
# దారి దీపం
మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 1 - సంచిక 6 | మార్చి 2023 | వెల : రూ.15




అంతర్జాతీయ
మహిళా దినోత్సవం

2023 మార్చి 8
ప్రత్యేక సంచిక

# వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజలందరికీ
# కళ్యాణి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి
## 2023 మార్చి 8 - మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

# కళ్యాణి హాస్పిటల్
## మల్టీస్పెషాలిటి బస్టాండ్ రోడ్, హన్మకొండ.



ఇప్పుడు స్త్రీలకు మరింత చేరువలో గైనకాలజిస్ట్
డా॥ అంజనీదేవి పర్తా, డా॥ గుజ్జుల సౌమ్య
డా॥ శ్వేత, డా॥ నేహా రెడ్డి గార్లు
విశాలమైన నియోనటాలజి
విభాగాన్ని నిర్వహిస్తున్న నిపుణులు
డా॥ రోహన్, డా॥ సందీప్ రెడ్డి
ల్యాప్ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్న
డా॥ ప్రతీక్‌రాజ్ ఫిజీషియన్
డా॥ వినోద్ రెడ్డి, డా॥ ఉత్తమ్ వైద్య గట్టు
డా॥ కె. కశ్యప్, డా॥ శాంతన్ గార్లు
అన్ని వేళలా అందుబాటులో ఉంటారు.




**డా॥ అంజనీదేవి పర్తా**
మేనేజింగ్ డైరెక్టర్

### హాస్పిటల్‌లో గల వివిధ విభాగాలు

1. జనరల్ సర్జరీ & ల్యాపరోస్కోపిక్ సర్జరీ
2. ఎముకల విభాగం ( Ortho ) & మోకాలు కీలు మార్పిడితో సహా
3. వెన్నెముక సర్జరీ & జనరల్ మెడిసిన్
4. మహిళలకు OBST & GYN
5. చిన్నపిల్లలకు నవజాత శిశువులకు NICU
6. చిన్నపిల్లలకు ప్రత్యేక సర్జరీ
7. వ్యాస్కులర్ సర్జరీ
8. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజి
9. చెవి, ముక్కు, నోరు ( ENT )




మూడు అధునాతన ఆపరేషన్ థియేటర్లు
మోకాలు మార్పిడి వెన్నుముకల సర్జరీ
గర్భిణీలకు నొప్పిలేని ప్రసవ సౌకర్యం
ల్యాప్‌రోస్కోపిక్ సర్జరీలు నిర్వహించబడుచున్నవి.

24/7 HOURS EMERGENCY SERVICE

**Contact Number : 0870-2577077**
**9502729151, 9100096006.**



# ఒక మార్గం - ఒక నినాదం

మార్చి 8 – అంతర్జాతీయ మహిళా దినోత్సవం. అది మహిళల ఉద్యమాల నుంచి రూపుదిద్దుకుంది. అది లింగ వివక్షకు వ్యతిరేకం. స్త్రీ పురుషుల మధ్య అంతరాలకు వ్యతిరేకం. అన్ని రకాల అణచివేతలకు వ్యతిరేకం. సమానత్వం కోసం, సాధికారత కోసం సాగిన, సాగుతున్న పోరాటాలకు ప్రతీక. ఎన్నో హక్కుల్ని సాధించింది. ఎన్నో విజయాలను మూటగట్టుకుంది. సాధికారత కోసం ఎన్నో అడుగులు వేసింది. అయినా ఈ ప్రయాణం పరిపూర్తి కాలేదు. ఈ దిశగా ప్రపంచంలో, దేశంలో మహిళలు ఉద్యమిస్తూనే ఉన్నారు. ఐక్యరాజ్య సమితి ప్రతీ ఏటా మార్చి 8న ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. ఏదో ఒక అంశాన్ని మన ముందుకు తెస్తున్నది. దాని పరిష్కార మార్గాలను అన్వేషించమని ప్రపంచ దేశాలకు దిశా నిర్దేశం చేస్తున్నది.

ఈ ఏడాది సమితి ప్రతిపాదిస్తున్న అంశం 'డిజిట్ ఆల్' మన ముందుకు తెచ్చింది. మహిళలను చుట్టు ముట్టిన డిజిటల్ అంతరాన్ని సమస్యగా మన ముందుకు తెచ్చింది. డిజిటల్ అంతరం అంటే స్మార్ట్ ఫోన్లు, టాబ్లెట్లు, లాప్ టాప్‌లు, ఇంటర్‌నెట్ వినియోగంలో స్త్రీ పురుషుల మధ్య అంతరం. అలాగే ఈ శాస్త్ర సంకేతిక విప్లవ పరిజ్ఞానాన్ని మహిళా సమానత్వానికి సాధనం చేయడం ఎలా అన్న సమస్యను మన ముందుకు తెచ్చింది. రాబోయే కాలాన్ని ఈ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ప్రభావితం చేస్తోంది. 2050 నాటికి శాస్త్ర సాంకేతిక రంగాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయన్నది ఒక అంచనా. ఈ రంగంలో ఇప్పుడు మహిళలు ఇంటర్‌నెట్ ప్రపంచానికి వెలుపల ఉన్నారు. మన దేశంలో పురుషులలో 60 శాతం మందికి ఫోన్ సౌకర్యం ఉంటే మహిళల్లో 31 శాతానికే దాని వినియోగం ఉంది. 25,067 గ్రామాలకు ఫోన్, ఇంటర్‌నెట్ సౌకర్యాలు లేవు. స్త్రీ పురుషుల మధ్య ఇంటర్‌నెట్ వినియోగంలో 40.40 శాతం అంతరం ఉంది. కోట్లాది మంది శ్రామిక మహిళలు, పేదలు అటు చదువుకు, ఇటు ఆధునిక డిజిటల్ చదువుకీ దూరంగా ఉన్నారు. ఒకనాడు నిరక్షరాస్యత అంతరాలకు ఎలా మూలం అయ్యిందో ఇప్పుడు డిజిటల్ నిరక్షరాస్యత అంతకుమించి వివక్షనీ, అంతరాలను సృష్టిస్తున్నది. ఈ అంతరాల తొలగింపుపై అన్ని దేశాలు తక్షణం దృష్టి సారించకపోతే మహిళలు తిరిగి మరింతగా వివక్షకీ అంతరాలకు అసమానతలకు గురయ్యే ప్రమాదం పొంచివుంది.

మరొకటి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రచార వేదిక వుంది. ఈ సంస్థ ప్రతీ సంవత్సరం ఒక ప్రచార నినాదాన్ని చేపడుతుంది. ఈ సంవత్సరం ప్రచార నినాదం 'embrace equity' ఈక్విటీని హత్తుకుందాం, ఆలింగనం చేసుకుందాం అన్నది ఈ నినాదం ఇచ్చే సందేశం. మనకు ఈక్వాలిటీ అన్న నినాదం తెలిసిందే. అది సమానత్వ, సమాన అవకాశాల సందేశం. ఈక్విటీకి ఈక్వాలిటీకి మధ్య పెద్ద తేడా ఉంది. అందరికీ సమాన అవకాశాలు ఉండడం అవసరం. కాని, అది మాత్రమే సరిపోదు. సమాజంలో అంతరాలున్నాయి. వ్యక్తుల అవసరాలలో, శక్తి సామర్థ్యాలలో అంతరాలు ఉన్నాయి. సమాన అవకాశాలు ఈ అంతరాలను పట్టించుకోవు. అందువల్ల ఎదిగే అవకాశాలను అందరూ సమానంగా అందిపుచ్చుకోలేరు. ఈక్విటీని హత్తుకోవడం అంటే సమాన అవకాశాలు మాత్రమే కాదు, సమానంగా ఎదిగే అవకాశాలు, సమానంగా ప్రయోజనాన్ని పొందే అవకాశాలు కల్పించడం. ఇదే ఈ ప్రచార నినాదంలోని ప్రత్యేకత. దీనికి ఉదాహరణ.. అందరికీ సమాన అవకాశాల పేరుతో ఒకే తరహా సైకిళ్లు అందిస్తే దాని ప్రయోజనాన్ని వికలాంగులు పొందలేరు. చిన్న పిల్లలు, పొందలేరు. వారు కూడా ప్రయోజనం పొందే అవకాశాలు గల వాహనాలను వారికి అందించాలి. ఈ తరహా ఈక్విటీ ఈ సంవత్సరం ప్రచార నినాదంగా వుంది. కొత్త ప్రపంచం కొత్త అవకాశాలు, కొత్త నినాదాలు వీటిని మహిళలు అందిపుచ్చుకోవడానికి తగిన కార్యకలాపాలకు ఈ మహిళా దినోత్సవం వేదిక కావాలి. ❑

మార్చి - 2023 పేజీలు : 52

# దారి దీపం

## మాసపత్రిక

సంపుటి : 1 - సంచిక : 6

డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణ మూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. ఒక మార్గం - ఒక నినాదం.. 3
2. మహిళా దినోత్సవం.. కాలక్రమణిక 5
3. ఓటు హక్కు.. మహిళల సంఘర్షణ
- డాక్టర్ దేవరాజు మహారాజు 6
4. జాతీయోద్యమంలో ఎందరో
వీరవనితలు - శాంతిశ్రీ 9
5. జాతీయోద్యమంలో ముస్లిం మహిళలు
- ప్రొఫెసర్ టి.జ్యోతిరాణి 11
6. తొలితరం రచయిత్రుల కథల్లో జాతీయోద్యమ
ప్రభావం - డాక్టర్ కందాళ శోభారాణి 14
7. రాజ్యాంగ రచనలో మహిళల పాత్ర
- అస్లర్ అలీ మహ్మద్ 18
8. చరిత్ర తిరగరాయడమే లక్ష్యం!
- ఎస్.పుణ్యవతి 22
9. షహీదా కవిత్వ పరామర్శ - కాత్యాయనీ విద్మహే 24
10. మోనోగమీ ఒక భ్రమ - డా. కె.ఎన్. మల్లీశ్వరి 30
11 లేడీ డాక్టర్స్.. అడుగడుగునా అవరోధాలు 33
12. పురుషాధిక్యత.. 'మహిళా రిజర్వేషన్లు -డాక్టర్ పి.సంజీవమ్మ 35
13. ప్రగతికి ఆమడదూరంలో పడతులు - డాక్టర్ కనుపర్తి విజయలక్ష్మి 38
14. లోక్‌సభ, రాజ్యసభల్లో మహిళలు 40
15. వివక్ష ఇంటి గుట్టును రట్టు చేసిన అమర్త్యసేన్ - ఎస్.మనోరమ 42
16. నేటి ప్రపంచంలో మహిళల స్థితిగతులు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి 43
17. భారతదేశంలో మహిళల ఆస్తి, వారసత్వ చట్టాలు 46
18. బైరి ఇందిర గారు రాసుకున్న కవిత్వం 50




INNOVATION AND TECHNOLOGY FOR GENDER EQUALITY

దారి దీపం
మాసపత్రిక

వివరాలకు సంప్రదించండి

డా॥ బి.రమేష్ చంద్రబాబు,
34-15-1,
దొడ్డిపట్ల వారి తోట వీధి,
తణుకు - 534211,
ప.గో.జిల్లా, ఏపీ
ఫోన్ : 93971 14495

"

రాజులకు చోటు లేని ప్రజాస్వామ్యంలో నియంతలకన్నా ఎక్కువ ప్రమాదకరమైన అధికారాన్ని చెలాయిస్తూ పీడించే పాలకులు నేడు తయారయ్యారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం

# కాలక్రమణిక




- ఆగస్టు 17, 1907 సోషలిస్టు మహిళల మొదటి ఇంటర్నేషనల్ సదస్సు జర్మనీలో స్టట్గార్ట్ జరిగింది. మహిళలకు ఓటు హక్కును, ఎన్నికయ్యే హక్కును డిమాండ్ చేస్తూ చేసిన తీర్మానం ఆమోదించబడింది.
- మే 3, 1908 'మహిళా దినోత్సవ' తొలి నగర స్థాయి సమావేశం అమెరికాలోని చికాగో నగరంలో జరిగింది.
- ఫిబ్రవరి 28, 1909 'మహిళా దినోత్సవ' తొలి జాతీయ స్థాయి ప్రదర్శన అమెరికాలో జరిగింది.
- ఆగస్టు 26-27, 1910 డెన్మార్క్లోని కోపెన్హాగెన్లో జరిగిన సోషలిస్టు మహిళల రెండవ ఇంటర్నేషనల్ సదస్సులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరపాలని క్లారా జట్కిన్, కాటే దంకర్, తదితర కామ్రేడ్స్ ప్రతిపాదించిన చారిత్రక తీర్మానం ఆమోదం. ఇదే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి అసలైన మూలం.
- మార్చి 19, 1911 మొదటిసారిగా జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, డెన్మార్క్ తొలిసారిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది.
- మే 12, 1912 జర్మనీ, స్వీడన్ సహా పలు దేశాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపబడింది.
- మార్చి 2, 1913 మొట్ట మొదటిసారిగా రష్యాలోనూ (జులియన్ కేలండర్ ప్రకారం 1913, ఫిబ్రవరి 17న) జర్మనీతో సహా అనేక దేశాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది.
- మార్చి 8, 1914 పోలీసు అణచివేత జరిగినప్పటికీ రష్యాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించబడింది.
- జూలై 28, 1914 మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం.
- నవంబర్ 1, 1914 ప్రతి దేశంలోనూ ప్రభుత్వానికి, బూర్జువాలకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టండని లెనిన్ పిలుపునిచ్చారు.
- మార్చి 7, 1915 స్విట్జర్లాండ్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు.
- మార్చి 26-28, 1915 సిట్జర్లాండ్లోని బెర్న్ నిర్వహించిన సోషలిస్టు మహిళల అంతర్జాతీయ సదస్సు.. కార్యాచరణకు పూనుకోవాలని, శాంతి కోసం డిమాండ్ చేయాలని మహిళలకు పిలుపునిచ్చింది.
- మార్చి 8, 1917 రష్యాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున పెట్రోగ్రాడ్ మహిళా కార్మికులు రొట్టె, శాంతిని డిమాండ్ చేస్తూ సమ్మె చేసి ర్యాలీ నిర్వహించడం ద్వారా రష్యాలో చారిత్రాత్మక విప్లవం ప్రారంభమైంది. (జులియన్ కేలండర్ను అనుసరించి ఈ విప్లవాన్ని ఫిబ్రవరి విప్లవం అని పిలుస్తారు.). ఈ రకంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించబడింది. మార్చి 8కి అసలైన మూలం ఇదే.
- మార్చి 16, 1917 రష్యా రాచరికం కూలగొట్టబడింది. జులియన్ కేలండర్ను అనుసరించి ఫిబ్రవరి విప్లవంగా పిలవబడే విప్లవం ఘన విజయం సాధించింది.
- నవంబర్ 7, 1917 సోవియట్ రాజకీయాధికారాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. లెనిన్ నేతృత్వంలో మంత్రి మండలి ఏర్పడింది. శాంతి, భూమిపై డిక్రీ జారీ అయింది.
- 1920 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం-మార్చి 8' రష్యాలో సాధారణ సెలవు దినంగా ప్రకటించబడింది.
- జూలై 30-ఆగస్టు 2, 1920 కమ్యూనిస్టు మహిళల తొలి అంతర్జాతీయ సదస్సు మాస్కోలో జరిగింది.
- జూన్ 9-15, 1921 మాస్కోలో జరిగిన కమ్యూనిస్టు మహిళల రెండవ అంతర్జాతీయ సదస్సులో అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి మార్చి 8ని శాశ్వత తేదీగా నిర్ణయిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం జరిగింది. 'మార్చి 8-అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని' నెలకొల్పిన అసలైన సంఘటన ఇదే. (మిగతా 8లో)

# ఓటు హక్కు.. మహిళల సంఘర్షణ



డాక్టర్ దేవరాజు మహారాజు
**కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, జీవ శాస్త్రవేత్త**

**'ప్రుడెన్సియా అయాల పోరాటంలో న్యాయం ఉంది. ఆమె కేవలం స్త్రీ అయినందుకే ఆమెను రాజకీయాల్లోకి రాకూడదనడం, ఎన్నికల్లో నిలబడగూడదనడం అన్యాయం. స్త్రీలను చులకనగా చూడకూడదని ఆమె గొంతెత్తి ఆక్రోశించడంలో నిజాయితీ ఉంది. నిబద్ధత ఉంది. విశ్వ జనీనమైన ఆమె వాదనను ఆలకించాల్సిందే. శ్రద్ధ వహించాల్సిందే. ఒక మహోన్నతమైన ఆశయం కోసం ఆమె సమిధ కావడానికి సిద్ధపడ్డారు. ఇక, ఈ దేశంలో లింగ అసమానత్వం ఇంకా ఎంతో కాలం నిలవదు.'**

ప్రుడెన్సియా అయాల (1885-1936) ఎల్ సాల్వడార్ కవయిత్రి, వ్యాసకర్త, స్త్రీ హక్కుల కార్యకర్త. 20వ శతాబ్దపు ప్రారంభంలో తన రచనలతో ప్రపంచాన్ని ఆకట్టుకున్న మహిళ. ఎల్ సాల్వడార్ స్త్రీలకు ఓటు హక్కు కూడా లేని రోజుల్లో ఆమె అక్కడ దేశాధ్యక్ష స్థానానికి మొదటిసారి పోటీలో నిలిచిన ధీర వనిత! అలాంటి సమాజం ఆమెను ఎలాగూ గెలవనివ్వదు.



కానీ, ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది ఏమంటే, అంతటి ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఆమె ప్రదర్శించిన గుండె ధైర్యం, తెగువ ఎంతటిదో ఉహించుకోవాల్సిందే! ఆ దేశపు సుప్రీంకోర్టు ఆమె నామినేషన్ అప్పుడు కొట్టేసింది. అయితే, ఆమె మరణం (1936) తర్వాత చాలా కాలానికి ఆ దేశ రాజ్యాంగ సవరణ ప్రకారం 1950లో మహిళలకు అక్కడ ఓటు హక్కు లభించింది. సోన్ సొనేట్ ప్రాంతంలో ఓ మారుమూల గ్రామంలో పుట్టిన ఆమె, సాంటా అనా నగరంలో పెరిగారు. అక్కడే విద్యాభ్యాసం పూర్తి చేసుకుని జర్నలిస్ట్ రచయిత్రిగా, కార్యకర్తగా రూపుదిద్దుకున్నారు. ఎల్ సాల్వడార్ మధ్య అమెరికాలో ఒక దేశం. దీనికి సాన్ సాల్వడార్ రాజధాని. ఇదే ఆ దేశంలోని అతి పెద్ద నగరం. అక్కడి ప్రస్తుత జనాభా 6.8 మిలియన్లు. ఇందులో ఎక్కువ శాతం మంది స్పానిష్ మాట్లాడతారు.

ప్రుడెన్సియా అయాల కేవలం మహిళా సాధికారత కోసం ఉద్యమించడమే కాదు, జాతీయ, అంతర్జాతీయ సమస్యలపైన స్పందిస్తూ వచ్చారు. అమెరికా నియంతృత్వ ధోరణితో వారి దేశం మీద సైనిక చర్య చేపట్టడాన్ని ఆమె తీవ్రంగా నిరసించారు. అంతేకాదు, పరిపాలనలో పారదర్శకత ఉండాలనీ, ప్రజలకు మతస్వేచ్ఛ ఉండాలని, మద్యం అమ్మకాలను నియంత్రించాలని, హక్కులు స్త్రీలతోపాటు పిల్లలకు ఉండాలని సామాజిక కార్యకర్తగా ఆమె ఉద్యమాలు సాగించారు. ఫలితంగా అనేకసార్లు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కొంత కాలం గాటిమల, ఎల్ సాల్వడార్ జైల్లో పెట్టారు. అందుకు ఆమె విచారించలేదు. పైవాటితో పాటు, పెళ్ళి కాని జంటలకు పుట్టిన పిల్లలకు హక్కులు వర్తింపజే యాలని ఆమె డిమాండ్ చేశారు. అక్రమ సంబంధంతో పిల్లల్ని కన్న వారికి శిక్ష విధించవచ్చుగానీ, ఏమీ తెలియని పిల్లలు ఎందుకు బలి కావాలి ? అన్నది ఆమె వాదన. యువ జంటలు పెళ్ళయిన వారా? కాని వారా? వారి సంబంధం సక్రమమైందా? కాదా? అని పసిబిడ్డలు చూసుకుని పుట్టరు కదా? పుట్టారంటే వారికి బాలల హక్కులు, ఆ తర్వాత మానవ హక్కులు వర్తించవల్సిందేనన్నది ఆమె

ఉద్దేశం. ప్రుడెన్సియా అయాల లింగ సమానత్వం ఎందుకు కావాలన్నారో దానికి తగిన వివరణ కూడా ఇచ్చారు.

"స్త్రీ పురుషుడు ఉంటేనే ఇల్లు. స్త్రీ పురుషుడు ఉంటేనే ఇంట్లో ఇంద్ర ధనుస్సులు. స్త్రీ – పురుషుడు ఉంటేనే సమాజం. స్త్రీ పురుషుడు ఉంటేనే రాబోయే తరాలు. స్త్రీ పురుషుడు అంటేనే జీవన సౌందర్యం ! స్త్రీ– పురుషుడు ఉంటేనే అర్థం పరమార్థం. అందువల్ల దేశంలో పౌరసత్వం అనేది ఇద్దరికీ సమానమే. ఓటు హక్కుతోపాటు ఇతర హక్కులూ బాధ్యతలు ఇద్దరికీ సమానమే. సమాజంలో సమ భాగస్వాములైన స్త్రీలను తక్కువగా చూడడం, సౌకర్యాలు కల్పించకపోవడం, విద్యనందించకపోవడం హేయమైన చర్య. సత్వరం సరిచేసుకోవాలి" అని ఆమె జీవితాంతం ఆవేదన చెందారు. ఆక్రోశించారు. చివరికి ఆమె మరణం తర్వాత చాలా కాలానికి – ఆమె కృషి ఫలితంగానే మార్పులు జరుగుతూ వచ్చాయి. పురుష అహంకారాన్ని ధిక్కరిస్తూ హక్కుల కోసం పోరాడుతున్న ప్రుడెన్సియా అయాలా గూర్చి ఆ దేశపు తత్త్వవేత్త, రచయిత, జర్నలిస్ట్ అయిన అల్బర్టో మాస్ ఫెర్రర్– ఆ రోజుల్లో ఇలా రాశాడు. "ప్రుడెన్సియా అయాల పోరాటంలో న్యాయం ఉంది. ఆమె కేవలం స్త్రీ అయినందుకే ఆమెను రాజకీయాల్లోకి రాకూడదనడం, ఎన్నికల్లో నిలబడ గూడదనడం అన్యాయం. స్త్రీలను చులకనగా చూడకూడదని ఆమె గొంతెత్తి ఆక్రోశిం చడంలో నిజాయితీ ఉంది. నిబద్ధత ఉంది. విశ్వజనీనమైన ఆమె వాదనను ఆలకించాల్సిందే. శ్రద్ధ వహించాల్సిందే. ఒక మహోన్నతమైన ఆశయం కోసం ఆమె సమిధ కావడానికి సిద్ధపడ్డారు. ఇక, ఈ దేశంలో లింగ అసమాన త్వం ఇంకా ఎంతో కాలం నిలవదు." అని ! హక్కుల కోసం నిరంతరం పోరాడిన ధీర వనితగా ప్రపంచం గుర్తించిన తర్వాత, ఆమె మరణానంతరం వారి దేశం ప్రుడెన్సియా అయాలకు దేశపు అత్యున్నత గౌరవం 'ఆర్డర్ ఆఫ్ జోస్ మాటియాస్ డెల్ గాడో' 2014లో ప్రకటించింది.

ప్రుడెన్సియా అయాలకు సమకాలీన కాలంలో లేదా అంతకు ముందు కాలంలో భారతదేశంలో పరిస్థితి ఎలా ఉందో ఒకసారి గమనిద్దాం! దానివల్ల ప్రపంచ దేశాలకంటే ఈ దేశంలో పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయా? భిన్నంగా ఉన్నాయా బేరీజు వేసుకోవచ్చు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత, స్త్రీలకు ఓటు హక్కు ఉండాల్సిన అవసరాన్ని 'ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్' (1917) నొక్కి చెప్పింది. ఈ సంస్థ ప్రకటించిన 'స్త్రీ ధర్మ' పత్రిక అందుకు తీవ్రంగా కృషి చేసింది. ఆ సంస్థ రూపొందించుకున్న ధ్యేయాలు ఈ విధంగా ఉన్నాయి. 1.భారత మాతకు ప్రియమైన కూతుర్లందరూ వారి వారి బాధ్యతల్ని తెలుసుకోవాలి 2.తల్లులుగా, భార్యలుగా బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తూ ఒకవైపు భవిష్యత్ భారతాన్ని తీర్చిదిద్దుతూ, మరోవైపు కుటుంబ సభ్యులకు తగిన శిక్షణ ఇవ్వాలి. 3.పురుషులకు ఉన్నట్లుగానే స్త్రీలు కూడా ఓటు హక్కు సాధించుకోవాలి. మున్సిపల్, లెజిస్లేటివ్ కౌన్సిల్ వంటి ఎన్నికల్లో పోటీ చేయగల హక్కును పొందాలి. 4.వివిధ మహిళా కమిటీలు ఏర్పడి, స్త్రీ జనాభ్యుదయానికి కావాల్సిన వివిధ ప్రణాళికలు రూపొందించాలి. వాటికి కార్యరూపం ఇవ్వాలి. ముఖ్యంగా స్త్రీ విద్య కోసం ఎక్కువ శ్రమించాలి. ఈ ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్ 1917లో మద్రాసు (చెన్నై) అడయార్ ప్రారంభమైంది. మార్గరెట్ కజిన్స్, అనిబిసెంట్, జినా రాజదాస, దోరీతి వంటి వారు పూనుకుని సంస్థను పురోగమన దిశలో నడిపించారు. ఇక్కడ స్త్రీలకు విద్య నేర్పించి, వివేకవంతుల్ని చేసిన ఘనత సావిత్రి బాయి పూలే దే (1831–1897). ఆమె ఒక మరాఠి కవయిత్రి, మేధావి మాత్రమే కాదు. స్త్రీ జనోద్ధరణకు అలుపెరుగని పోరాటం చేసిన తొలి ఉపాధ్యాయురాలు. భర్త జ్యోతి బా పూలే(1827– 1890)తోపాటు అంటరానితనాన్ని అంత మొందించిన ధీర వనిత! 1848లో ఆమె మహిళల కోసం తొలి పాఠశాలను ప్రారంభించారు. అందులో బ్రాహ్మణేతర జాతుల ఆడపిల్లలకు రాత్రింబవళ్ళు చదువు చెప్పారు. 1873లో 'సత్య శోధక్ మండల్' ప్రారంభించి తద్వారా ఒక మహోద్యమానికి రూపకల్పన చేశారు. దేశంలో నెలకొన్న సామాజిక పరిస్థితుల ప్రకారం ఓటు వేసే హక్కును, విద్యాలయాల్లో చదువుకునే అర్హతను స్త్రీకి ఊహించలేమని ఆనాటి మేధావులు కొందరు ఆవేదన వెలిబుచ్చారు. అయితే రామ్ మోహన్‌రాయ్ లాంటి సంఘ సంస్కర్తలు స్త్రీ జనోద్ధరణకు పూనుకున్నారు. కాలక్రమంలో పరిస్థితులు మారాయి. 20వ శతాబ్దం వచ్చేసరికి పరిస్థితులు చాలా మారాయి. స్త్రీకి పురుషుడితో సమానమైన ప్రతిపత్తి లభించాలని స్త్రీలే సంఘర్షణ ప్రారంభించారు.

ప్రుడెన్సియా అయాల వంటి వారి జీవితాలు మనకు తెలిశాయి గనక, ప్రపంచ దేశాలన్నింటిలో స్త్రీల పరిస్థితి ఒకే విధంగా ఉందని తెలుస్తోంది. ప్రపంచపు పనిలో మూడింట రెండు వంతులు పనిచేసి, పదింట ఒక వంతు మాత్రమే సంపాదించుకుని నూటికి ఒక వంతు ఆస్తి కూడా సమకూర్చుకోలేని అభాగ్యుల మీద, అర్థ జనాభా అయిన స్త్రీల మీద చరిత్రలో మొట్టమొదటిసారి ప్రపంచ పు దృష్టి పడింది. అప్పటి నుంచే చరిత్ర తప్పిదాన్ని సరిచేయడానికి తగిన కృషి ప్రారంభమైంది. తల్లిగా, భార్యగా స్త్రీ నిర్వహించే పాత్ర అద్వితీయమైంది. ఆమె కాలాన్ని, శక్తిని, ఆలోచనల్ని అన్నింటినీ ఇంటి పని మింగేస్తుంది. ఆ పని ఎంత విలువైందో, అంత 'విలువ' లేనిది! అంటే ఎంత పనిచేసినా ఆమెకు ఒక రూపాయి ఆదాయం గానీ, కనీసం గుర్తింపు గానీ దొరకవు. ప్రపంచ దేశాలన్నింటా పరిస్థితి ఇదే. ఇంటి పని పోను, బయటి పని అదనం! అంటే ఒక రోజులో స్త్రీలు రెండు రోజుల పని చేస్తున్నారన్న మాట.

ప్రపంచంలో గల ఆహారంలో సగానికి పైగా పండించేది స్త్రీలే. కానీ, వారికంటూ భూమి ఉండదు. ప్రభుత్వ సహాయం గానీ, బ్యాంకు రుణాలు గానీ ఉండవు. ప్రపంచ కూలీలలో మూడు వంతులు స్త్రీ లే. చేసే పని ఒకటే అయినా, పురుషుడి కంటే స్త్రీకి తక్కువ కూలి చెల్లిస్తారు. ఇంటి పనుల్లాగానే, వారు చేసే వ్యవసాయ పనులకు, నిర్మాణ పనులకు కూడా సరైన విలువ లేదు. నిన్న మొన్నటి దాకా ఉద్యోగాల్లో కూడా ఈ తేడా ఉండేది. చేస్తున్న ఉద్యోగం ఒకటే అయినా, స్త్రీల వేతనం పురుషుల వేతనం కంటే తక్కువగా ఉండేది. 1975-80 ప్రాంతాల్లో ఈ తేడా సవరించబడింది. తెలివైన చురుకైన స్త్రీలు సెక్రటరీలుగా, క్లర్కులుగా, పి.ఏ లుగా పని చేస్తున్నారు. ఇలాంటి ఉద్యోగాలు పురుషులు కూడా చేస్తున్నారు. అయితే, వారి సంఖ్య తక్కువ. పురుషులు మేనేజర్లుగా, నిర్వహణాధికారులుగా, యజమానులుగా ఉంటున్నారు. ఈపరిస్థితి మన దేశంలోనేకాదు, అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలలో కూడా ఇలాగే ఉంది. ఈ 21వ శతాబ్దంలో పరిస్థితులు మరింతగా మెరుగయ్యాయి.

పురుషులతోపాటు స్త్రీలకు కూడా అన్ని హక్కులూ లభించాయి. విద్యావంతుల సమూహాల్లో అవ గాహన పెరిగిన కుటుంబాలలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. పురుషులు ఇంటి పనిలో, పిల్లల సంరక్షణలో భాగ స్వాములవుతున్నారు. స్త్రీలు కూడా సంపాదన కోసం పరుగులు తీస్తున్నారు. అయితే, స్త్రీ, పురుష స్వేచ్ఛ కట్టలు తెంచుకోకుండా జాగ్రత్త పడాల్సి వస్తోంది! ❑

---

# కాలక్రమణిక

(ఐదో పేజీ తరువాయి)

- డిసెంబర్ 1, 1961 మహిళల ఇంటర్నేషనల్ డెమోక్రటిక్ ఫెడరేషన్ ఏర్పాటయింది.
- నవంబర్ 1, 1961 అణ్వాయుధాలకు, వియత్నాంపై యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికాలో మహిళలు సమ్మెకు దిగారు. ఈ ఆందోళనను 'ఉమెన్ స్ట్రైక్ ఫర్ పీస్' నిర్వహించింది.
- 1966 అమెరికాలో నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ ఉమెన్ ఏర్పాటైంది.
- 1967 న్యూయార్క్ ర్యాడికల్ ఉమెన్ ఏర్పాటైంది.
- మార్చి 8, 1968 మహిళా విముక్తి సంస్థలు చికాగోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించాయి.
- సెప్టెంబర్ 7, 1968 అట్లాంటిక్ నగరంలో జరిగిన మిస్ అమెరికా పోటీలను న్యూయార్క్ ర్యాడికల్ ఉమెన్ నిరసించారు. 'రవికెలు తగలబెట్టడం' కాదు, రవికెలు, మొలతాళ్ళు వంటి వాటిని చెత్తబుట్టలోకి విసిరారు.
- 1969 చికాగో ఉమెన్స్ లిబరేషన్ యూనియన్ ఏర్పాటైంది. వందలాది స్త్రీ వాద గ్రూపులు, ఉద్యమాలు, అనేక పత్రికలు స్త్రీవాదం గురించిన చైతన్యాన్ని విస్తరింపజేశాయి.
- 1971 మహిళల పురోభివృద్ధి కోసం ఒక అంతర్జాతీయ సంవత్సరం యొక్క ప్రాధాన్యతను బెర్లిన్లో జరిగిన బ్యూరో ఆఫ్ ఉమెన్స్ ఇంటర్నేషనల్ డిమోక్రటిక్ ఫెడరేషన్ నొక్కి చెప్పింది.
- ఫిబ్రవరి 23, 1972 మహిళా సంవత్సరాన్ని, మహిళల పట్ల వివక్షను రూపుమాపేందుకు ఒక సదస్సును ప్రతిపాదిస్తూ ఫ్రెడా బ్రౌన్ ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్‌కు ఒక లేఖను పంపారు.
- మార్చి 1972 మహిళల స్థితిగతులపై జరిగిన ఐరాస కమిషన్ సమావేశంలో 'అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని' ప్రకటించాలనే ఉమెన్స్ ఇంటర్నేషనల్ డెమోక్రటిక్ ఫెడరేషన్ ప్రతిపాదనను హెర్టా కూసినెన్ సమర్పించారు.
- 1975ను అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించాల్సిందిగా ప్రతిపాదిస్తూ అనంతరం ఆ కమిషన్ ఐరాస సర్వసభ్య సభకు సిఫారసు చేసింది.
- డిసెంబర్, 1972 సర్వసభ్య సభ ఆ సిఫార్సును ఆమోదిస్తూ 1975ను అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించింది
- మార్చి 8, 1975 మొట్టమొదటిసారిగా ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించింది.
- జూన్ 19-జూలై 2, 1975 అంతర్జాతీయ మహిళా సంవత్సరపు ప్రపంచ సదస్సు మెక్సికో నగరంలో నిర్వహించబడింది.
- డిసెంబర్ 16, 1977 మహిళల హక్కులు, అంతర్జాతీయ శాంతి కోసం సంవత్సరంలో ఏదో ఒక రోజును ఐక్యరాజ్యసమితి దినోత్సవంగా ప్రకటించాల్సిందిగా అన్ని దేశాలనూ ఆహ్వానిస్తూ ఐరాస సర్వసభ్య సభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.
- ఫిబ్రవరి 2, 2015 'ప్రపంచవ్యాప్తంగా మహిళలు చేసిన పోరాటాలు, ఐక్యరాజ్యసమితిలో మా సంస్థ చూపిన చొరవ మూలంగా అంతర్జాతీయ మహిళా సంవత్సరం ఏర్పాటైంది' అని తన 70వ వ్యవస్థాపక దినోత్సవం రోజున ఉమెన్స్ ఇంటర్నేషనల్ డెమోక్రటిక్ ఫెడరేషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. ❑

# జాతీయోద్యమంలో ఎందరో వీరవనితలు



శాంతిశ్రీ

**దేశ స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు వారి పాత్ర అద్వితీయమైనది. పురుషులతోపాటు స్త్రీలూ అసమాన త్యాగాలు చేశారు. మొత్తం 186 మంది వనితలు స్వాతంత్ర్య సమరాంగణంలో వీరోచితంగా పోరాడారు. ఒక్క గుంటూరు జిల్లాలోనే 59 మంది మహిళలు పాల్గొన్నారు. నాటి ఆంధ్రప్రదేశ్‌లో ఏ నగరంలోనూ 12 మంది మహిళలు స్వాతంత్ర్య సమరంలో జైళ్లకు వెళ్లలేదు. కానీ ఒక్క రాజమహేంద్రికే ఆ ఘనత దక్కింది. వీరి మహోన్నత వారసత్వాన్ని భావితరాలు అందిపుచ్చుకోవాలి. అసలైన దేశభక్తి సర్వమానవ సౌభ్రాతృత్వమే !**

శ్రీకాకుళం జిల్లా శశిమాను గున్నమ్మ అటవీ చట్టాలను ధిక్కరించే సమయంలో నిండు గర్భిణి. ఆ పోరాటంలో ఆమె అమరత్వం పొందింది. ఈ జిల్లాలో ఐదుగురు స్త్రీలు జైలుకు వెళ్లారు. వీరిలో కప్పగంతుల ఆదిలక్ష్మి హరిజనాభ్యుదయ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. దువ్వాడ బాలకృష్ణమ్మ




మందసా రైతు ఉద్యమంలో పాల్గొని, 1940లో ఏడాదిపాటు కఠిన కారాగారం అనుభవించారు. హెచ్.సత్యభామాబాయి 1940లో సత్యాగ్రహం చేసి, వెల్లూరు, కడలూరులో జైలు శిక్ష అనుభవించారు. జయంతి సూరమ్మ 1930లో ఆరు నెలలు వెల్లూరు జైల్లో, 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని వెల్లూరు, కడలూరు కారాగారాల్లో 15 నెలలు శిక్ష అనుభవించారు. విజయనగరంలో టేకుమళ్ళ కుటుంబం నుంచే నలుగురు మహిళలు జైలుకు వెళ్లారు. వారు టేకుమళ్ళ బుచ్చి రామాయమ్మ, మహాలక్ష్మమ్మ, సీతారామమ్మ, వరాహలక్ష్మి. ఈ జిల్లాలోనే మంత్రిప్రగడ బంగారమ్మ 1930లో ఏడున్నర నెలలు వెల్లూరు జైల్లో కఠినశిక్ష అనుభవించి, 1948లో మరణించారు. భానగరపు అనసూయమ్మ క్విట్ ఇండియా ఉద్యమంలో జైలు శిక్ష పొందారు. విశాఖ జిల్లా దిమిలి గ్రామంలో శిష్టా లక్ష్మీ నర్సమ్మ, లింగమ్మ, సోదెమ్మ, శ్యామసుందరమ్మ ఉద్యమాల్లో పాల్గొని, జైలుశిక్ష అనుభవించారు. మిస్సుల లక్ష్మీనర్సమ్మ ఆరు నెలలపాటు, కాల్నాధభట్ల మహలక్ష్మమ్మ, గాదె నారాయణమ్మ, దర్భా వేంకట రమణమ్మ జైలు శిక్ష అనుభవించారు.

తూర్పు గోదావరి జిల్లా నుండి భార్యాభర్తలు కాశీభట్ల వేంకట రమణమ్మ, లక్ష్మీనరసింహారావు, పాలకోడేటి శ్యామలాంబ, సూర్యప్రకాశరావు జమిలిగా జైలుకెళ్లారు. బారు అలివేలమ్మ, సింహాద్రి అన్నపూర్ణాదేవి, పందిరి జగదాంబ, పెద్దాడ కామేశ్వరమ్మ, మానుగంటి లక్ష్మీనర్సమ్మ, మానాప్రగడ రామ సుందరమ్మ, భమిడిపాటి రంగనాయకమ్మ, రాచర్ల సామ్రాజ్యం తదితర మొత్తం 21 మంది స్త్రీలు పాల్గొన్నారు.

1932లో సరోజినీనాయుడు అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన నిరసన సభలో వేదాంతం కమలాదేవి అరెస్టయ్యారు. దువ్వూరి సుబ్బమ్మ భర్త చనిపోయిన ఒంటరి మహిళ. ఒకసారి పోలీసు 'మా పాలన ఎలా ఉంది?' అనడిగితే.. ఆమె తన తల మీద తెల్ల కొంగును తొలగించి, గుండును చూపిస్తూ 'ఇలా ఉంది' అని ధీటుగా చెప్పారట. స్వాతంత్ర్య పోరాటంలో దుర్గాబాయి దేశ్ ముఖ్ పాత్ర ఎంతో స్ఫూర్తిదాయకం. పశ్చిమ గోదావరి జిల్లా

మతాన్ని (హిందూ మతం, ఇస్లాం వంటి అర్థంలో) రాజకీయాన్ని దేనికదిగా వేరువేరుగా వుంచాలి. మతాన్ని రాజకీయాల్లోకి, పబ్లిక్‌లోకి తీసుకురాకూడదు. దాన్ని వ్యక్తి యొక్క ప్రయివేటు వ్యవహారంగానే చూడాలి.



– గాంధీజీ



లౌకికవాదం అంటే మతం లాంటి దాన్ని నిరుత్సాహపరిచేది ఎంతమాత్రం కాదు. మత స్వేచ్ఛ, మతం లేని వారి స్వేచ్ఛ, అందరి వ్యక్తిగత సత్రప్రవర్తనా స్వేచ్ఛ అని దానికి అర్థం. ఇతర మత వ్యవహారాల్లో, మన రాజ్య మౌలిక స్వభావంలో జోక్యం చేసుకోనంతవరకూ అన్ని మతాలకూ వ్యవహార స్వేచ్ఛ వుంటుందని దానికి అర్థం.

– నెహ్రూ

ఏలూరులో గాంధీజీ పర్యటనకు వచ్చినప్పుడు తన బంగారు వస్తువులన్నింటినీ ఇచ్చేసిన తొలి మహిళ మాగంటి అన్నపూర్ణా దేవి. ఉద్దరాజు మాణిక్యాంబ శాసనోల్లంఘన ఉద్యమంలో 10 నెలలు వెల్లూరు, కన్ననూరు జైళ్లలో శిక్ష అనుభవించారు. చింత పర్తి బుచ్చెమ్మ, దారా దమయంతీదేవి, కోటమర్తి కనక మహా లక్ష్మి ఎన్నోసార్లు లాఠీదెబ్బలు తిన్నారు. ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించారు. కొవ్వలి కనకమ్మ, దాసరి కృష్ణవేణమ్మ, దామ రాజు లక్ష్మమ్మ, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ, ముదుంబ లక్ష్మీదేవి, మంతెన లక్ష్మీనర్సమ్మ, శృంగారకవి లక్ష్మీనర్సమ్మ, వెలమాటి మాణిక్యాంబ, కంది నాగరత్నమ్మ, పాలకోడేటి నాగరత్నమ్మ, దాట్ల నర్సమ్మ, కలగర పిచ్చమ్మ, వద్దిపర్తి శకుం తల, కొటికల పూడి సరస్వతీదేవి, వారణాసి సీతమ్మ, అద్దునూరి సీతారా మమ్మ, వేగేశ్న సుభద్రాదేవి, బారదవాడ సూరమ్మ, ముదుంబ వెంకటమ్మ, గోకరాజు వెంకాయమ్మ మొత్తం 27 మంది మహిళలు సత్యాగ్రహంలో పాల్గొని, జైలుశిక్ష అనుభవించారు.

కృష్ణా జిల్లాలో మహిళాయోధుల్లో ఎందరో మహోన్నతులు ఉన్నారు. మల్లిరెడ్డి అన్నపూర్ణమ్మ, సూరపునేని అన్నపూర్ణమ్మ, వల్లభనేని అన్నపూర్ణమ్మ, అట్లూరి కామేశ్వరమ్మ, జాగర్లమూడి కామేశ్వరమ్మ, గొర్రెపాటి కుటుంబమ్మ, చెరుకూరి కృష్ణవేణమ్మ, గుత్తికొండ లక్ష్మమ్మ, బొప్పన లక్ష్మీకాంతమ్మ, గొర్రెపాటి లక్ష్మీ కాంతమ్మ, కొల్లిపర లక్ష్మీకాంతమ్మ, గోనుగుంట్ల లక్ష్మీకాంతమ్మ, కోటగిరి మంగతాయారమ్మ, అరికెపూడి మాణిక్యాంబ, మనోరమ, వల్లభనేని సీతామహలక్ష్మమ్మ, గుత్తికొండ సీతమ్మ, కొల్లిపర సీతమ్మ, వారణాసి సీతమ్మ, నూతక్కి సీతారామమ్మ, గుళ్ళపల్లి సీతారామమ్మ, సీతంరాజు సీతారామమ్మ, తంగిరాల సీతారామమ్మ, పాదుర్తి సుందరమ్మ, పునూరి సుందరమ్మ మొత్తం 25 మంది మహిళలు వెల్లూరులో నెలల నుంచి ఏడాది పాటు జైలుశిక్ష అనుభవించారు.

గుంటూరు జిల్లాలో 'మాలపల్లి' నవల రాసిన ఉన్నవ లక్ష్మీ నారాయణ భార్య ఉన్నవ లక్ష్మీబాయమ్మ, బసవరాజు అప్పారావు సతీమణి రాజ్యలక్ష్మి వంటివారు ఉద్యమంలో ఉన్నారు. సత్తెనపల్లిలో మాణిక్యాంబ, తెనాలి తాలూకా నుండి ఏడుగురు, రేపల్లె తాలూకాలో 12 మంది మహిళలు జైలుశిక్ష అనుభవించారు. మంతెనవారిపాలెంలో ఐదుగురు స్త్రీలు, పండి తారాధ్యుల సత్యవతమ్మ పేరు గల ఇద్దరు స్త్రీలు రేపల్లె నుండి జైలుకెళ్లారు. కాళంగి శేషమాంబ కూడా జిల్లా నుండి అరెస్ట య్యారు. రాష్ట్రంలో అత్యధికంగా 59 మంది స్త్రీలు గుంటూరు జిల్లా నుండే పాల్గొన్నారు. ప్రకాశం జిల్లాలో 1921, 1922 లలో 'పన్ను నిరాకరణ ఉద్యమం'లో కోట సుందరమ్మ పన్ను కట్టటానికి నిరాకరించింది. పీసుపాటి త్రిపురాంబ ఈ జిల్లా నుంచే పాల్గొన్నారు. నెల్లూరు జిల్లాలో పొణకా కనకమ్మ గ్రంథాలయ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తే.. తిక్కవరపు సుందరమ్మ హరిజనోద్యమంలో నేతృత్వం వహించారు. పాటూరు బాలసరస్వతమ్మ 1930–32 ఉద్యమాల్లో పాల్గొని, అరెస్టయ్యారు. 'శశి' అనే మాసపత్రికను నిర్వహించారు. మున్సి పల్ కౌన్సిలర్‌గా సేవలందించారు. ముత్తుకూరు కామమ్మ, వేనాటి చెంచులక్ష్మమ్మ, బెజవాడ లక్ష్మీకాంతమ్మ, ఓరుగంటి మహాలక్ష్మమ్మ, చవ్వాకుల మైత్రేయి దేశభక్తి గేయాలతో ప్రజలను ఉర్రూతలూగించారు. 26 మంది మహిళలు జాతీయోద్యమంలో పాల్గొని, జైలుశిక్ష అనుభవించారు. అనంతపురం జిల్లా ఇల్లూరు కేసమ్మ క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని, వెల్లూరు జైల్లో రెండు నెలలు కఠినశిక్ష పొందారు. చిత్తూరు జిల్లా నుండి తంబళంపల్లి నల్లపురెడ్డి శకుంతల ఎగ్మూరు మేజిస్ట్రేటు ఎదుట పికెటింగు జరపడం వల్ల వెల్లూరు జైల్లో ఆరు నెలల జైలుశిక్ష అనుభవించారు. తెలంగాణా ప్రాంతం నుండికొర్రా బుచ్చమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం, సంగం లక్ష్మీబాయి, పద్మజానాయుడు తదితరులు సమరశీలంగా పోరాడారు. ఇలా ఎందరెందరో చేసిన పోరాటాల, త్యాగాల ప్రతిఫలం మన స్వాతంత్ర్యం. సమైక్యత, సామరస్యం, స్వావలంబన కోసం ఈ స్ఫూర్తితో ఇప్పుడూ కులమతాలకు అతీతంగా మహిళలు కృషిచేయాలి. రాష్ట్రంలో ఇంతమంది మహిళలు మహోన్నత పోరాటం చేశారు. ఈ పోరాటంలో కాగడా పెట్టి వెతికినా కాషాయదళాలు కనిపించని వైనం. అసలైన జాతీయోద్యమ వారసులు ఎవరో తేటతెల్లం చేస్తోంది. ❑

**(ప్రజాశక్తి సౌజన్యంతో..)**

# జాతీయోద్యమంలో ముస్లిం మహిళలు




ప్రొఫెసర్ టి.జ్యోతిరాణి, M.A., Ph.D.

**భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం మహిళలు పుస్తకానికి రాసిన స్నేహ వాక్యం**

**స్వాతంత్ర్యోద్యమాన్ని జనబాహుళ్య ఉద్యమంగా బలోపేతం చేసే క్రమంలో గాంధీజీ పిలుపు మేరకే స్త్రీల భాగస్వామ్యం చోటు చేసుకున్నదనే భావన తప్పని ఈ పుస్తకంలో పొందుపరచబడిన 61 మంది ముస్లిం స్త్రీల పాత్రలను పరిశీలిస్తే బోధపడుతుంది. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం నుంచి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చే వరకు నిర్మించబడిన వివిధ ఉద్యమాలలో ముస్లిం మహిళలు గుణాత్మకంగా విలక్షణమైన పాత్ర నిర్వహించారన్న వాస్తవం తెలుస్తుంది.**

అసమ సంబంధాలు పునాదిగాగల రాజకీయార్థిక నిర్మాణాలను ప్రగతిశీలంగా మలచుకొనటానికి, ప్రజాస్వామికం చేసుకొనటానికి తలఎత్తిన ఉద్యమాలైనా, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పరాయిపాలన నుండి దేశాన్ని విముక్తం చేసుకొనటానికి నిర్మించబడ్డ స్వాతంత్ర్యోద్యమాలైనా అవి ఉనికిలోకి వచ్చి ఆశించిన లక్ష్యాలను సాధించటానికి ఆకాశంలో సగమైన స్త్రీల పరోక్ష, ప్రత్యక్ష భాగస్వామ్యం అనివార్యం. కానీ పితృస్వామిక




భావజాలం స్త్రీని ఒక స్వతంత్ర వ్యక్తిగా చూడటానికి నిరాకరిస్తుంది. స్త్రీ పురుషుల మధ్య అధీనత్వ- ఆధిపత్య సంబంధాలు పునాదిగా నిర్మించబడిన పితృస్వామిక కుటుంబంలో ఇంటికే పరిమితం చేయబడిన స్త్రీ ఇంటిని నిర్వహించటానికి తన జీవిత కాలమంతా నిర్విరామంగా, నిరంతరాయంగా శ్రమ చేస్తున్నప్పటికీ ఆ పనికి విలువ లేదు. గుర్తింపురాదు. అదే విధంగా భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో స్త్రీల చురుకైన భాగస్వామ్యం, క్రియాశీలక పాత్ర గుర్తింపునకు రాకుండా, అదృశ్యంగా మిగిలిపోయే ప్రమాదం వున్నది. ఇటువంటి స్థితి ముస్లిం స్త్రీల విషయంలో మరింత తీవ్రమయ్యే అవకాశమున్నది. స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లింల స్త్రీలు చురుకైన భాగస్వామ్యం వహించారన్నది ఒక చారిత్రక వాస్తవం. ఈ సత్యాన్ని వెలికి తీయటానికి జెండర్ చైతన్య స్పృహ, చిత్తశుద్ధి, నిబద్ధతలతో కూడిన కృషి, విభిన్న పద్ధతుల ద్వారా స్త్రీల భాగస్వామ్యానికి సంబంధించిన సమాచార సేకరణ అవసరం అవుతాయి. ఈ విధమైన కృషి శ్రీ సయ్యద్ నశీర్ అహమ్మద్ రాసిన భారత స్వాతంత్ర్యోద్యమం- ముస్లిం మహిళలు పుస్తకంలో వ్యక్తమవుతుంది.

స్వాతంత్ర్యోద్యమాన్ని జనబాహుళ్య ఉద్యమంగా (Mass Movement) బలోపేతం చేసే క్రమంలో గాంధీజీ పిలుపు మేరకే స్త్రీల భాగస్వామ్యం చోటు చేసుకున్నదనే భావన తప్పని ఈ పుస్తకంలో పొందుపరచబడిన 61 మంది ముస్లిం స్త్రీల పాత్రలను పరిశీలిస్తే బోధపడుతుంది. 1857 నుండి 1947 వరకు అంటే ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం నుంచి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చే వరకు నిర్మించబడిన వివిధ ఉద్యమాలలో, ఆ తరువాత సాగిన ప్రజా ఉద్యమాలలో ముస్లిం మహిళలు గుణాత్మకంగా విలక్షణమైన పాత్ర నిర్వహించారన్న వాస్తవం తెలుస్తుంది. స్వతంత్ర భారత నిర్మాణంలో వారి స్థానం స్పష్టమవుతుంది. స్త్రీలుగా పితృస్వామిక సమాజంలో, ముస్లింలుగా భారతదేశంలో పరాయీకరణకు గురవుతున్న వర్తమాన సందర్భంలో ఈ పుస్తకం ఆహ్వానించతగింది. భారతదేశంలోని

వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం స్త్రీలు స్వాతంత్ర్య పోరాటంలో అధికంగా పాల్గొనటం గమనించవచ్చు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న ముస్లిం స్త్రీలలో బేగం హజరత్ మహల్ మినహాయించి పోరుబాటన నడిచిన మిగిలిన వారందరూ సాధారణ కుటుంబాలకు చెందినవారే. దాదాపు నూట యాభై సంవత్సరాల క్రితమే పరాయిపాలనను వ్యతిరే కించి, తిరగబడి, ఉరి శిక్షలకు ఏ మాత్రం భయపడకుండా ఎదురు నిలిచిన వీరవనితలు వీరు. స్వాతంత్ర్య సాధనకు రూపుదిద్దుకున్న విభిన్న పోరాట మార్గాలు - అహింసాయుత మార్గం కావచ్చు, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే వామపక్ష మార్గం కావచ్చు గెరిల్ల యుద్ధమే మార్గం కావచ్చు- అన్ని పోరాట మార్గాలలో ముస్లిం స్త్రీల భాగస్వామ్యం ఉండటం గమనించవలసిన విషయం. ఖిలాఫత్ ఉద్యమం ద్వారా జాతీయోద్యమంలో ప్రవేశించి సహాయ నిరాకరణ, విదేశీ వస్తు బహిష్కరణ, క్విట్ ఇండియా మొదలైన అన్ని పోరాట రూపాలలో ముస్లిం స్త్రీల చురుకైన భాగస్వామ్యం కనిపిస్తుంది. ఈ ముస్లిం స్త్రీలు సంపన్న కుటుంబాల నుండి సాధారణ కుటుంబాల వరకు చెందిన వారు. దక్షణాఫ్రికాలో సంపదను, వ్యాపారాలను త్యజించి భారతదేశానికి వచ్చి పాల్గొన్న కుటుంబాలు కొన్ని కాగా స్వదేశంలోనే ఆస్తులను, పదవులను, ఉద్యోగాలను, వ్యాపారాలను వదులుకొని జాతీయోద్యమంలో పాల్గొన్న కుటుంబాలు మరికొన్ని. ఈ నేపథ్యం గల కుటుంబాలకు చెందిన ముస్లిం మహిళలు చాలా వరకు ఉన్నత విద్యను అభ్యసించినవారే. బాల్యం నుండే బ్రిటీష్ పాలనను వ్యతిరేకించిన వారే. మునీరా మజ్రుల్ హఖ్, అమీనాతయ్యబ్జీ, మజీదా హసీనా బేగం మొదలైన వారు జాతీయోద్యమంలో ప్రత్యక్షంగా భాగస్వాములు. రజియాఖాతూన్ మొదలైనవారు పరోక్షంగా ఉద్యమానికి తోడ్పడ్డారు.

వాస్తవానికి ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యం అని ఖచ్చితంగా విభజించటం కష్టం. సమావేశాలు నిర్వహించడం, ప్రసంగిం చటం, పికెటింగ్‌లు జరపటం, ఊరేగింపులో పాల్గొనటం, పోలీసు లాఠీదెబ్బలను తినటం, జైలుకెళ్ళటం, శిక్షను అనుభవిం చడం ఉద్యమానికి ఎంత ముఖ్యమో నిధులను సమీకరించటం, ఉద్యమకారులు జైలుకు వెళ్ళినప్పుడు వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనటం, నైతిక మద్దతునివ్వటం, ఉద్యమకారు లకు ఆశ్రయమివ్వటం, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి పత్రికలు నడపటం, రచనలు చేయటం, తమ ఇంటి పురుషులు ఉద్యమంలో నిమగ్నమైనప్పుడు కుటుంబ బాధ్యతలు సంపూర్ణం గా స్వీకరించటం, పోలీసుల దాష్టికాన్ని భరించటం, ఎంతటి కష్ట నష్టాలకైనా సంసిద్ధులు కావటం మొదలైనవన్ని ఉద్యమం నిలదొక్కు కొనటానికి, లక్ష్యాలను సాధించటానికి అంతే ముఖ్యం. కాబట్టి సమగ్రదృష్టితో, సునిశితంగా పరిశీలిస్తే ఉద్యమంలో ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యం అనే విభజన కృత్రిమమైనదే. చాలా సందర్భాలలో ఉద్యమకారుల కుటుం బాలకు చెందిన మహిళల భాగస్వామ్యం ప్రారంభంలో పరోక్ష రూపంలో ఉన్నట్లు కనిపించినా, భర్త జైలుకెళ్ళినప్పుడు, భర్త చేపట్టిన బాధ్యతను నిర్వర్తించే క్రమంలో స్త్రీలు పోరాటంలో ముందుండటం గమనించదగింది. అక్బరీ బేగం, అమినా తయ్యాబ్జీ, షంషున్నిసా అన్సారీ, సుఫియాసోం, అంజాదీ బేగం మొదలైనవారు ఉద్యమ నాయకత్వ స్థానంలో వుండి ఉద్యమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. కార్యకర్తలుగా ముస్లిం స్త్రీలు పోరాటాలలో ముందుండి లాఠీ దెబ్బలు తిని, అరెస్టయి, జైలు శిక్షలను అనుభవించినారు. స్త్రీలను సమీకరించడంలో కీలక పాత్రను పోషించారు.

బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బ్రెజిల్లో జరిగిన అంతర్జాతీయ సమావేశానికి 'హజరా ఆపా' భారతదేశ ప్రతినిధిగా హాజరయ్యారు. అక్బరీ బేగం, మహబూబ్ ఫాతిమా, అంజాది బేగం, సుగరాఖాతూన్, సాదత్ బానో కిచ్లూ తదితరు లు ఉత్తేజపూరిత ప్రసంగాలతో ప్రజలను ఉద్యమోన్ముఖులను చేయటంలో కృతకృత్యులయ్యారు. ఉమర్ బీబీ, ఆమనా ఖురేషి మొదలైన వారు కార్యకర్తలుగా విదేశీ వస్త్ర దహనంలో ముందుండి తమ వస్తువులను దహనం చేయటంతో ఉద్యమాన్ని ప్రారంభించారు. అన్ని పోరాట రూపాలలో ముస్లిం స్త్రీలు ముందు ఉండి లాఠీ దెబ్బలను తిని, అరెస్టయి, జైలు శిక్షలను అనుభవించారు. భర్త అరెస్టయినప్పుడు బ్రిటీష్ వ్యతిరేకతను ప్రచారం చేసే 'జమిందార్' పత్రిక ప్రచురణ బాధ్యతను బేగం జాఫర్ అలీఖాన్, 'ఉర్దూ-ఏ-మౌల్లా' ప్రచురణను బేగం నిశాతున్నీసా చేపట్టగా బేగం ఖుర్షీద్ ఖ్వాజా 'జామియా మిలియా ఇస్లామీయ' విద్యా కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహి స్తూ 'హింద్' అను ఉర్దూ మాసపత్రికకు సంపాదకురాలిగా విధులను నిర్వర్తించారు. బీబీ అమతుస్సలాం 'హిందూస్థాన్' అనే ఉర్దూ పత్రికను నిర్వహించారు. మరికొందరు తమ రచనల తో ఉద్యమానికి స్ఫూర్తినిచ్చారు. హాజ ఉరా ఆపా అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యురాలు కూడా. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ లింగవివక్షత వైపు దృష్టి సారించి, స్త్రీలను చైతన్యవంతులను చేయటానికి స్త్రీ విద్య సాధనమని గుర్తించి ఆ దిశగా ప్రయత్నించిన స్త్రీలూ కనిపి స్తారు. సంప్రదాయ మూఢాచారాలకు, పర్దా వ్యవస్థకు వ్యతిరేకం గా పోరాడటమూ కనిపిస్తుంది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ముస్లిం మహిళలందరూ హిందూ- ముస్లిం ఐక్యత కోసం కృషి చేసినవారే. ఉద్యమం చివరి దశలో బ్రిటీష్ వారి కుతంత్రాల ఫలితంగా పరిస్థితులు దేశ విభజనకు దారి తీయగా దానిని వ్యతిరేకించారు ఈ ముస్లిం మహిళలు. నైజాం ప్రాంతం భారతదేశంలో విలీనం కావాలని ఆందోళన చేసిన వారిలో ముస్లిం మహిళలు ఉన్నారు. భారతదేశ విభజన వల్ల ఆస్తులు

పాకిస్తాన్ భూభాగంలో ఉండిపోయినా, భారతదేశంలోనే వుండి కటిక పేదరికాన్ని అనుభవించిన ఉద్యమకారిణులూ కనిపిస్తారు. జాతీయోద్యమంలో పాల్గొన్న ఈ ముస్లిం మహిళలు 'భారతదేశం తమ మాతృభూమి' అన్న భావనతోనే ఎంతటి త్యాగానికైనా సిద్ధపడటం వీరి జీవితాలను గురించిన అధ్యయనం వెల్లడి చేస్తుంది. స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములు కావటమే కాకుండా, బ్రిటీషర్ల తొత్తులైన జమీందారులకు వ్యతిరేకంగానూ, స్వాతంత్ర్య సిద్ధించాక ప్రజా ఉద్యమాలలో, తెలంగాణా రైతాంగ పోరాటంలోనూ పాల్గొన్న ముస్లిం మహిళలు ఉన్నారు. గాంధేయమార్గాన్ని అనుసరిస్తూ సమాజసేవకు అంకితం కావటంపై కృతజ్ఞతతో స్వతంత్ర భారత ప్రభుత్వం ఫాతిమా ఇస్మాయిల్, కుల్సుం సయానీలకు 'పద్మశ్రీ' బిరుదునిచ్చి సత్కరించింది. వీరిలో కుల్సుం సయానీ 1957లో యూనిస్కో సమావేశంలో భారత ప్రతినిధిగా పాల్గొన్నారు. 1958లో ప్రభుత్వం స్త్రీ విద్య కోసం నియమించిన 'నేషనల్ కమీషన్ ఆన్ విమన్స్ ఎడ్యుకేషన్' అనే కమిటీలో ఈమె సభ్యురాలు. మహాత్మాగాంధీ శాంతి సందేశాన్ని ప్రపంచానికి చాటి చెప్పటానికి 11 దేశాలు పర్యటించింది. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య స్నేహం కోసం కృషి చేసింది. విద్య కోసం ప్రత్యేకించి స్త్రీ విద్య కోసం అవిశ్రాంతంగా ఆమె చేసిన కృషికి 'నెహ్రూ లిటరసీ అవార్డు' లభించింది. ఫాతిమా ఇస్మాయిల్ దళితుల అభ్యున్నతి కోసం చేసిన కృషికి గుర్తింపుగా 'దళిత మిత్ర' అవార్డు పొందింది. హాజఉరా ఆపా కార్మిక కర్షక సంక్షేమానికి చేసిన కృషికి లెనిన్ శతజయంతి ఉత్సవాలలో 'సుప్రీం సోవియట్ జూబ్లీ అవార్డు'తో గౌరవించబడింది. ఫాతిమా యఫ్ తయ్యాబ్ అలీ గాంధేయ మార్గంలో నడుస్తూ స్వాతంత్ర్యానంతర భారతదేశంలో గుజరాత్లోని 'పడేలా' గ్రామాన్ని దత్తత తీసుకొని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దింది. అందుకు భారత ప్రభుత్వం విశిష్ట మహిళగా ఆమెను గుర్తించింది.

స్వతంత్ర భారత దేశంలో రాజకీయ రంగ ప్రవేశం చేసి అసెంబ్లీ, పార్లమెంటు సభ్యులుగా, మంత్రులుగా బాధ్యతలను నిర్వహించిన వారున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాసుమా బేగం రాష్ట్రంలో మంత్రి పదవిని చేపట్టి దేశంలో మంత్రి పదవి చేపట్టిన తొలి ముస్లిం మహిళగా ఖ్యాతి గడించారు. సఫియా అబ్దుల్ వాజిద్, బేగం అక్బర్ జహాన్ బేగం, అనీస్ బేగం కిద్వాయ్ వంటి వారు పార్లమెంటు సభ్యులయ్యారు. బేగం షరీఫా హమీద్ అలీ ఐక్యరాజ్యసమితి మహిళా విభాగానికి భారతదేశ ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ విధంగా ఉద్యమబాటన నడిచిన ఈ స్త్రీల జీవితాలను అధ్యయనం చేసినప్పుడు వాళ్ళు ఎటువంటి విలువల కోసం పాటుపడ్డారో అవి ఎంత ఉన్నతమైన, ఉదాత్తమైన మానవీయ విలువలో అర్థమవుతుంది. ఎటువంటి కష్టానికీ తలవంచకపోవటం, ధైర్యంగా నిలబడడం, దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించటానికైనా సిద్ధపడడం, తాము చెప్పేదే ఆచరించటం, అరెస్టు కాకపోవటాన్ని నామోషీగా భావించటం, బ్రిటీష్ ప్రభుత్వానికి విన్నవించుకోవటాన్ని చిన్నతనంగా పరిగణించటం, క్షమాబిక్షను కోరటానికి బదులు ప్రాణాలు అర్పించడానికి సంసిద్ధులు కావడం, తమ ప్రాణాలు 'జాతి సొత్తులు' అని ప్రకటించడం మొదలైనవన్నీ వాళ్ళ ఆత్మాభిమానానికి, త్యాగనిరతికి అద్దం పడతాయి.

ఈ పుస్తకం ఇటు స్త్రీల చరిత్రనూ, అటు ముస్లింల చరిత్రనూ సుసం పన్నం చేస్తుంది. జాతీయోద్యమంలో పాల్గొన్న ముస్లిం మహిళల భారతీయతను స్పష్టం చేస్తుంది. హిందూ ముస్లింలు ఐక్యతతో స్వతంత్ర భారతదేశాన్ని సాధించుకున్నారన్న విషయం వెల్లడి చేస్తుంది. గ్లోబలేజేషన్ సంస్కృతిలో, స్వార్థపూరిత సామాజిక వాతావరణంలో పతనమవుతున్న మానవీయ విలువల మధ్య బతుకుతున్న ప్రస్తుత యువత ఈ పుస్తకం ద్వారా ఒక్కసారి చరిత్రలోకి తొంగిచూస్తే ఎటువంటి త్యాగాలతో ప్రస్తుత సమాజాన్ని నిర్మించుకున్నామో వారికి అర్థమవుతుంది. గతాన్ని తెలుసుకొని ఆ పునాదుల మీదుగా లౌకిక, ప్రజాస్వామిక, మానవీయ విలువలతో కూడిన ఉన్నతమైన సమాజాన్ని నిర్మించుకొనటానికి కావలసిన ప్రాతిపదిక ఈ పుస్తకంలో ఉన్నది. విశ్వవిద్యాలయాలలో సామాజిక శాస్త్రలలో ప్రత్యేకించి చరిత్రకు సంబంధించిన పరిశోధన అధ్యయనాలకు సయ్యద్ నశీర్ అహ్మద్ వ్రాసిన ఈ పుస్తకం ఒక నమూనాను అందిస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. పరిశోధకులకిది స్ఫూర్తినిస్తుంది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం మహిళలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించటం సులువైన విషయం కాదు. నిరంతర అన్వేషణ, నిజాయితీతో కూడిన అవిశ్రాంత కృషి, పట్టుదల అవసరమవుతాయి. అధ్యయనం పట్ల ఆసక్తి, సీరియస్‌నెస్ వున్న రచయిత నశీర్ అహమ్మద్ ఎన్నో గ్రంథాలయాలు తిరిగి, ఎన్నో సంస్థలను, వ్యక్తులను కలసి వివిధ భాషల్లో వున్న ఆధారాలను సేకరించటం వల్లే ఈ పుస్తక రచన సాధ్యమైంది. వ్యక్తుల జీవిత చరిత్రలకు ఫోటోలు జతపర్చినప్పుడు అధ్యయనం చేసేవారు ఆత్మీయ భావనకు లోనవుతారు. ఇందుకోసం మహిళల ఫోటోలను సేకరించటానికి రచయిత చేసిన శ్రమ అభిలషణీయం. సామాజిక స్పృహతో తపనతో ఎంతో శ్రమించి, ఎన్నో ఆధారాలను అధ్యయనం చేసి, అదృశ్యంగా ఉన్న ముస్లిం మహిళలు, ముస్లిం యోధులు స్వాతంత్ర్య పోరాటంలో నిర్వహించిన పాత్రను తన పలు గ్రంథాల ద్వారా, అసంఖ్యాకమైన తన వ్యాసాల ద్వారా వెలుగులోకి తీసుకరావటంలో రచయిత అనిర్వచనీయమైన కృషి వ్యక్తం అవుతుంది. భారతదేశ చరిత్రలో ముస్లింల భాగస్వామ్యం దిశగా శ్రీ సయ్యద్ నశీర్ అహమ్మద్ నిరంతరం సాగిస్తున్న కృషి ఆహ్వానించదగింది మాత్రమేకాదు అభినందించదగింది. ఈ పుస్తకానికి 'స్నేహ వాక్యం' వ్రాసే అవకాశం నాకు లభించిన గౌరవంగా భావిస్తున్నాను. ❑

# తొలితరం రచయిత్రుల కథల్లో జాతీయోద్యమ ప్రభావం



డాక్టర్ కందాళ శోభారాణి

**భారత స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలకు తెగించి మడి, మాన్యాలు వదులుకొని సర్వం త్యాగం చేసిన నారీమణులెందరో.. నిస్వార్థ సేవ చేసిన తల్లులు ఎందరో ఉన్నారు. వందేమాతర ఉద్యమం స్వదేశీ ఉద్యమంగా రూపుదిద్దుకుంది. 1905లో రష్యా, జపాన్ చేతిలో చావు దెబ్బ తినడంతో భారతదేశంలో జాతీయవాదం ఊపందుకుంది. పాశ్చాత్య విద్యా విధానం, స్త్రీ విద్య, బాల్య వివాహాల నిర్మూలన, స్త్రీ స్వేచ్ఛ సమానత్వం, సంఘ సంస్కర్తల కృషి మహిళా సంఘాల స్థాపన, పత్రికల సానుకూల స్పందన వంటివి 1910-1947 నాటి సమస్యలకు సామాజిక సాహిత్యాల పరిష్కారాలు.**

రెండు ప్రపంచ యుద్ధాలు, ఆర్య, బ్రహ్మ సమాజాల స్థాపన స్త్రీ పాఠశాలలు, కందుకూరి గురజాడల కృషి, 1927 అఖిల భారత మహిళా సంఘం స్థాపన, 1929 వ్యభిచార నిర్మూలన చట్టం 1930 శారదా వివాహ చట్టం, 1937 హిందూ స్త్రీల వారసత్వ చట్టం పలు ఆంధ్ర మహిళా సభల నిర్వహణ ఈ కాలంలో వచ్చిన మహిళా ఉద్యమాలు, అహింసాయుత స్వాతంత్ర్య పోరాటం, భారతీయ సమాజపు లౌకిక దృక్పథం వంటివి 1910-1947 నాటి సమస్యల పరిష్కారానికి రూపొందిన మార్గాలు. గత శతాబ్దంలో వచ్చిన ఉద్యమాలు, ఆంగ్ల విద్యా విధానం, శాస్త్రీయ దృక్పథం స్త్రీని ఆలోచింపచేశాయి. బండారు అచ్చమాంబ, చోరగుడి సీతమ్మ, ఉన్నవ లక్ష్మీ బాయమ్మ, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, కందుకూరి రాజ్యలక్ష్మీ, కనుపర్తి వరలక్ష్మమ్మ, దువ్వూరి సుబ్బమ్మ వంటి మహిళలు నాటి సంఘసంస్కరణ, జాతీయోద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. గాంధీజీ అహింసాయుత పోరాటానికి ప్రభావితులయ్యారు. మహిళా సభలను ఏర్పాటు చేశారు. స్త్రీ అసమానతల పట్ల నిరసన తెల్పారు. సమానత్వ ప్రాతిపదికన పోరాటాలు చేయడం వంటివి సాహితీ వస్తువులయ్యాయి. పలువురు రచయిత్రులు ఈ సమస్యలను కథా వస్తువుగా స్వీకరించి రచనలు చేశారు.

1910-1947 మధ్యకాలంలో ప్రధాన ఘట్టం జాతీయోద్యమం. 1857 సిపాయిల తిరుగుబాటు, 1906 విదేశీ ఉద్యమం, 1911 వందేమాతర ఉద్యమం, 1920 సహాయ నిరాకరణోద్యమం, 1928 సైమన్ కమిషన్‌పై తిరుగుబాటు, 1929 లాహోర్ పూర్ణ స్వరాజ్య తీర్మానం, 1931 గాంధీ ఇర్విన్ ఒప్పందం, 1930 ఉప్పు సత్యాగ్రహం, 1935 ఇండియా చట్టం, 1942 క్విట్ ఇండియా ఉద్యమం, 1946 తెలంగాణా ఉద్యమం, 1947 స్వాతంత్ర్య సంపాదన.. ఇవి జాతీయోద్యమంలోని ప్రధాన ఘట్టాలు. మహిళలు భారత రాజకీయ రంగం మీదకు రావడం భారత రాజకీయ రూపురేఖలు మారాయి. అనిబిసెంట్ హోం రూల్ ఉద్యమం, మాగంటి అన్నపూర్ణ ఖద్దరు ఉద్యమం, యామినీ పూర్ణతిలకం లాంటి మహిళలు గాంధీజీ ఉద్యమంలో చేరడం. పలువురు విప్లవకారిణిలుగా చేరడం, పలు మహిళా ఉద్యమాలు వంటివి భారత జాతీయోద్య మానికి పట్టునిచ్చాయి. ఈ అంశాలు కథా వస్తువులయ్యాయి.

## నివాళి



**శ్రీమతి శోభారాణి గారు ఫిబ్రవరి 12న మరణించిన వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది. బహుముఖీనమైన మహిళల సమస్యలపై పరిశోధనలు చేసి మహిళా ఉద్యమ జాగృతికి ఎంతో దోహదం చేసిన ఆమెకు దారి దీపం నివాళులర్పిస్తోంది.**

1. గుమ్మడిదల దుర్గాబాయి రాసిన 'నేద్యన్యనైతిని' -1929
2. కనుపర్తి వరలక్ష్మమ్మ రాసిన 'ప్రేమ ప్రభావము' - 1927
(2) ఐదు మాసముల ఇరువది దినములు (1931)
3. బసవరాజు వెంకటరాజ్యలక్ష్మి రాసిన 'ఎవరిదదృష్టం' 1931
4. తాడినాగమ్మ రాసిన 'ఒక ముద్దు' 1939
(2) ఇది కథగాదు'
5. చంద్రకాంతం - 'ప్రేమ వేదిక మీది'
6. మైదవోలు పద్మావతి - 'త్యాగిని'

ఆరుగురు రచయిత్రులు రాసిన ఎనిమిది కథలు తీసుకున్నా. కనుపర్తి వరలక్ష్మమ్మవి రెండు, తాడి నాగమ్మవి రెండు. ఈ ఎనిమిది కథలు జాతీయోద్యమ ప్రభావం, నేపథ్యంలో వచ్చాయి. జాతీయోద్యమంలో స్త్రీ క్రియాశీలక పాత్రను చిత్రించిన కథలుగా వాటికి ఒక ప్రత్యేకత ఉందని చెప్పొచ్చు.

## నేద్యన్యనైతిని

1920లో గాంధీ ఆంధ్రదేశంలో స్వాతంత్రోద్యమ ప్రచారం కోసం విరాళాలు పోగుచేయాలనే ఉద్దేశంతో రాజమండ్రి వచ్చిన పుడు బహిరంగసభలో ఆయన చేసిన ఉపన్యాసంలో ప్రభా వితురాలైన వ్యక్తి దుర్గాబాయి దేశ్‌ముఖ్. చిన్న వయసులోనే గాంధీ టోపీ ఒకటి సంపాదించి దాన్ని తిప్పి జోలెగా తయారు చేసి అందర్నీ డబ్బులు అడిగి గాంధీజీకి అందజేసింది. అప్పుడు గాంధీ ఆ సంచీ తీసుకొని డబ్బులు బాగానే పోగుచేశావు మరీ నీ చేతికున్న గాజులు మాటేమిటి. అనగానే తన చేతికున్న బంగారు గాజులు తీసి జోలెలోవేసింది. బాల్యం గడిచి జాతీ యోద్యంలోకి మహి ళాభ్యుదయ దృష్టితో దూసుకువచ్చిన స్త్రీ దుర్గాబాయి. ఆ నేపథ్యంలోనే ఆమె ఈ కథను 1929లో రాసింది.

బాల వితంతువైన శారదాబాయి సంప్రదాయాలను ధిక్కరించి పూనాకు వెళ్ళి చదువుకొని వచ్చి పాఠశాల స్థాపించి నడుపుతున్న చైతన్యశీలి. 'నేధన్యనైతిని' అన్నది ఈ కథలో ఆమె పలికిన అంతిమ వాక్యం. శ్యామసుందరుడు సైమన్ కమిషన్ బహిష్కరణ సందర్భం నుండి జాతీయాద్యమంలో చురుకుగా పాల్గొంటున్న యువకుడు. శ్యామసుందరుడు జాతీయోద్యమ క్రియాశీలత వల్ల పాఠశాల నుండి బహిష్కరించబడ్డాడు. అది అతనిని పోషిస్తున్న అన్నగారికి కంటగింపవుతుంది. అన్న గారి ఆజ్ఞకన్నా మాతృదేశ రక్షణ ముఖ్యమన్న ఆలోచనలో అన్న గారి దౌష్ట్యం జాతీయోద్యమ వ్యతిరేకత సహించలేక ఇల్లువదిలి వెళ్ళిపోతాడు. ఆ వార్తను తెలుపుతూ అక్క శారదాబాయికి ఉత్తరం వ్రాస్తాడు. శ్రీనివాసరావు కమలాబాయి దంపతుల పుత్రికలీల. జాతీయోద్యమ చైతన్యశీల స్వభావం. ఇంట్లో నూలు వడకటం జాతీయోద్యమ గీతాలు పాడటం ఆమెకు సహజంగా అలవడ్డాయి. లీల తండ్రి శ్రీనివాసరావు జబ్బుపడి మరణిస్తూ కూతురికి మాతృభూమిని మరువద్దు. భారతి రుణం తీర్చు అని సందేశమిస్తాడు. ఆ తర్వాత లీల తల్లి మరణిస్తూ చదువుల తల్లిగా మారి, విద్య లేని దేశం ఎలా ఉంటుందో తెలియని భర్త ఉన్నతాశయాలకు ఆటంకం కల్గించి వృథా ప్రలాపాలతో కాలం గడిపి అవిద్యాంధకారంలో మునిగి తేలే స్త్రీలను ఉద్ధరింపమని సందేశమిస్తుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుని శారదాబాయి లీలను చేరదీస్తుంది. ఇల్లు వదిలిన శ్యామ సుందరుడు అక్కగారి దగ్గరకు వచ్చి తన కార్యకలాపాలు కొనసాగిస్తుంటాడు. లీల శ్యామసుందరుల మధ్య అనురాగం పెరుగుతుంది. పరులకు చేయూతనిస్తూ స్వార్థరహితమైన సేవను అందిస్తూ ఫలా పేక్ష లేని దృక్పథం కలిగి, దేశభక్తి కలిగి, మానవసేవ చేయటంలోనే జన్మసార్థకత పొందుతుందని దుర్గాబాయి గారి భావన. శారదాబాయి వితంతువై పూనాకు వెళ్ళి విద్యనభ్యసించి ఆంధ్రదేశానికి తిరిగి వచ్చి, స్త్రీ విద్య కోసం పాఠశాల నడుపుతున్న ఆమె జబ్బు పడ్డప్పుడు తన తర్వాత తన ఆశయం కొనసాగటం గురించి కలిగిన సందేహానికి లీలా శ్యామసుందరుల ప్రవర్తన ఒక సమాధానమవుతుంది. తాను జబ్బుతో ఆశక్తురాలైతే పాఠశాల నిర్వహణ బాధ్యతను వాళ్ళిద్దరూ అతిసహజంగా చేపట్టారు. శారదాబాయి స్త్రీ జీవిత ధన్యత్వం స్త్రీ విద్యా ఉద్యమ నిర్వహణలో స్త్రీల అభివృద్ధి కొరకైన కార్యాచరణలోనే ఉందని నమ్మింది. కనుకనే తాను జీవించినంత కాలం ఆ పనిలోనే వున్న తన మరణానంతరం తన ఆశయాన్ని ముందుకు తీసుకొని పోగల యువతరం తయారు కావటం మరింత తృప్తినిచ్చింది. నేటికి నేను 'ధన్యనైతిని' అన్న ఆమె ఆఖరి మాటలో ఆ తృప్తే వ్యక్తమవుతుంది.

## ప్రేమ ప్రభావము

గాంధీజీ విజయవాడలో జరగనున్న అఖిలభారత కాంగ్రెస్ సమావేశానికి కలకత్తా నుంచి వస్తూ తెలుగుదేశంలోని అనేక పట్టణాలలో ప్రసంగించాడు. అందులో భాగంగానే మద్రాస్‌లో గాంధీజీ ఉపన్యసించాడు. విదేశీ వస్త్రాలను బహిష్కరించమని పిలుపునిచ్చాడు. స్వరాజ్య స్థాపనకు దౌర్జన్య స్థాపనకు దౌర్జన్య రహిత సహాయ నిరాకరణమే శరణ్యమని అభిప్రాయపడ్డాడు. ఆ స్ఫూర్తితోనే కనుపర్తి వరలక్ష్మమ్మ 1927లో 'ప్రేమ ప్రభావము' అనే కథను రాసింది.

లక్ష్మీ వెంకయ్యనాయుడు దంపతుల కొడుకు రామస్వామి చదువు రీత్యా మద్రాస్‌లో ఉంటాడు. గాంధీజీ సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా మద్రాస్‌కు వచ్చి ఉపన్యసించి నప్పుడు రామస్వామి ఆ ఉపన్యాస ప్రభావంతో సహాయ నిరాకరణోద్యమంలో చేరాలని నిశ్చయించుకుంటాడు. ఆ సంకల్పంతో చదువుకు స్వస్తి పలికి, నిర్ణయించుకున్న ప్రకారం స్వగ్రామం చేరతాడు. తండ్రికి కొడుకు ఉద్యోగం చేయాలని, పెద్ద మొత్తం వరకట్నంతో అతనికి పెళ్ళి చేయాలని ఉంటుంది. కాని, తండ్రి అభిప్రాయాన్ని రామస్వామి తిరస్కరి స్తాడు. కోపంతో తండ్రి కొడుకును ఇంట్లో ఉండొద్దంటాడు. తల్లి లక్ష్మి కొడుకు

అభిప్రాయాన్ని అంగీకరించి ప్రోత్సహిస్తుంది. ఇల్లు ఒళ్ళు గుల్లయ్యే చదువెందుకు ? పూర్వులు వ్యవసాయం చేసుకొని పాడిపంటలతో సుఖించలేదా ? సొంతంగా రాట్నం మీద నూలు వడుక్కొని నేయించుకుంటె బట్టలు మన్నుతాయి. డబ్బు వస్తుది. మా నాయనమ్మ వడికిన నూలుతో కోకలు నేయించుకుంటే మూడేళ్ళు కట్టేవాళ్ళము. సన్న చీరలు అని గొప్పే కాని మూడు నెళ్ళైనా ఉండవు. అని కాపురానికి వచ్చే టప్పుడు మా నాయనమ్మ కట్టెదు నూలు వడికి దుప్పటి నేయించి ఇచ్చింది. పాతికేండ్లయింది. ఇప్పటికి మాయలేదని ఖద్దరు గొప్పతనాన్ని తెలియపరుస్తుది. అయినా భర్త నిరాకరిస్తాడు. గాంధీ మద్రాస్ సభలో చెప్పిన మూల సూత్రాలైన సత్యం, త్యాగం, అహింస, ఐకమత్యం అనే నాలుగు సూత్రాలను గాంధీ ఆలోచనలను రామస్వామి హృదయంలో గాఢంగా నాటుకొని పోయాయి. దేశ హితులైన చింతతో మనస్సాక్షి ప్రేరితుడై అతడు సహాయోద్యమ మును చేపట్టినందుకు తండ్రి కోపిస్తాడు. తల్లి దు:ఖిస్తుంది. జననీ జన్మభూములు రెండు అతనికి సమాన గౌరవ పాత్రలు గానే ఉన్నవి. జన్మభూమి సేవింప నిశ్చయుడయ్యాడు. తల్లి సన్నిధికి చేరి ఉద్యమతత్వం బోధపరచాడు. తల్లి సమ్మతించింది. ఇల్లు వదిలి అసహాయోద్యమ ప్రచారకుడై రామస్వామి ఆంధ్ర దేశమంతా పర్యటించాడు. రామస్వామి జాతీయగీతాలు పాడు తూ స్వదేశీ వస్త్రాలు విక్రయిస్తుండగా పట్టుకొని కఠినశిక్ష వేసి జైలుకు పంపుతారు. ఆ విషయం తెలిసి తండ్రి వెంకయ్య నాయుడు తన విలువైన వస్త్రాలను తీసి ఆవలపారేసి, అధికారం వదిలి తన రావుసాహెబ్ బిరుదు వద్దని తిరస్కరించి ఖద్దరు వస్త్రధారియై ఖద్దరు వస్త్రాలను విక్రయించడానికి వెళ్ళి జైలు పాలవుతాడు. సంవత్సరం తర్వాత రామస్వామి విడుదల రోజు పుష్పవర్షం కురిసి జయధ్వానాలు మారుమ్రోగాయి. తండ్రి దగ్గరికొచ్చి ప్రేమ పూర్వకంగా కౌగిలించుకొంటాడు. రామ స్వామి తండ్రి చరణాలపై ఆనంద బాష్పాలను వదిలి ఆనందిస్తాడు. దేశం మీద ప్రేమతో కంకణబద్ధుడు కావటమే కాకుండా తన తండ్రిలో కూడా దేశంపట్ల ప్రేమాంకురాన్ని మొలిపించాడు. ఈ కథ కనుపర్తి వరలక్ష్మిగారి జాతీయోద్యమ చైతన్యాన్ని సూచిస్తుంది. గాంధీ నిర్వహించిన చారిత్రక పాత్రను రచయిత్రి ఈ కథలో నమోదు చేయటం విశేషంగా చెప్పవచ్చు.

## ఐదు మాసముల ఇరువది దినములు

కనుపర్తి వరలక్ష్మమ్మ రాసిన మరోకథ 'ఐదుమాసముల ఇరువది దినములు (1931) మహాత్మాగాంధీ పిలుపునందుకొని విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలో గోపాలరావు చేరతాడు. అతని భార్య రుక్మిణి. ఆమె ఏడోనెల పురిటికి పుట్టింటికి వెళు తుంది. అది మొదలు పిల్లవాడు పుట్టిన ఐదు నెలల వరకు ఆమెను చూడలేకపోతాడు. కారణం తలమునకలుగా అతను సత్యాగ్రహోద్యమంలో పనిచేస్తుంటాడు. పిల్లవాడితో పుట్టింటి నుండి వచ్చిన భార్య విదేశీ వస్త్రాలు ధరించి ఉండటం వల్ల గోపాలరావు ఆమెను పలకరించడు. ఆ రాత్రికి రాత్రే గోపాల రావును బ్రిటీష్ ప్రభుత్వం అరెస్ట్ చేస్తుంది. విదేశీ వస్త్ర వ్యతిరేక బోధ చేస్తున్నందుకు ఆరు నెలల కారగార శిక్ష విధించింది. ఈ సంఘటన చీరలు, నగలు జీవితమనుకునే ప్రపంచం నుంచి రుక్మిణి బయటికి వచ్చి దేశ స్థితిగతుల గురించి ఆలోచించేటట్లు చేసింది. స్వదేశీ వస్త్రాలను ధరించమని భర్త ప్రబోధించటం నేరమైనందుకు ఆశ్చర్యపడుతుంది. ఆలోచించే కొద్దీ విదేశీ వస్త్రాలలోని పరాధీనత, అవి ధరించిన తనపట్ల భర్త ప్రదర్శిం చిన ఉదాసీన వైఖరి మొదలైనవన్నీ అర్థం చేసుకుంటుంది రుక్మిణి. భర్త ఆశయం అర్థమవుతుంది. స్వదేశీ ఉద్యమానికి మద్దతుగా ఖద్దరు కట్టి, నూలు వడకటం మొదలుపెడ్తుంది. సావిత్రి గారి నోములు నోచేందుకు తన ఇంటికి వచ్చే యువతులు ఖద్దరు వస్త్రాలనే ధరించాలని షరతు పెడుతుంది. స్వదేశీ ఉద్యమం పట్ల ఆమె సంసిద్ధురాలు కావటమే కాకుండా చుట్టూ ఉన్న స్త్రీలను సమీకరించి కార్యోన్ముఖుల్ని చేస్తుంది. భర్త జైలు నుండి వచ్చే సరికి అతని ఆదర్శాలకు అభిరుచులకు అనుగుణమైన ప్రవర్తనలతో తయారవుతుంది. రుక్మిణి భర్త జైలు కెళ్ళిన రోజు నుండి తిరిగి వచ్చే రోజు వరకు 'ఐదు మాసముల ఇరువది దినములు' ఈ కాలంలో స్వదేశీ ఉద్యమాన్ని ఆశయంగా చేసుకొని తాను నూలు వడకటానికి, భర్తకు అవసరమైన దుస్తులను తాను తీసిన నూలుతో నేయించి పెడ్తుంది. ఖద్దరు వస్త్రాలు ధరించిన స్త్రీలతో కలిసి, స్త్రీలు చేయదగినవిగా సమాజం నిర్దేశించిన నోములు, వ్రతాలు చేయటానికి ఆమె తనను తాను మార్చుకుంటుంది. జాతీయో ద్యమ ఆశయాలతో కార్యశీలురైన పురుషులకు దీటుగా సహాయకారులుగా వారి సహచరులు కూడా సుశిక్షితులైనప్పుడే ఉద్యమం బలోపేతం కావటానికి వీలువుతుంది. కనుపర్తి వరలక్ష్మమ్మ ఈ కథ రాసి స్త్రీలకు ఆదర్శంగా నిల్చింది. భర్తల ఉన్నతాశయాల తత్త్వమెరిగి నడుచుకోవటంగా నిరూపించింది.

## ఎవరిదదృష్టం

శ్రీమతి బసవరావు వేంకట రాజ్యలక్ష్మి రాసిన 'ఎవరిదదృష్టం' కథలో సరళ, కమల ఇద్దరు స్నేహితులు. బాల్య వివాహ నిరోధానికి పాటుపడతూ స్త్రీలు కూడా పురుషులతో సమానంగా ఉండాలనే ఆలోచన కలిగిన తల్లిదండ్రుల బిడ్డ సరళ. నూతన సంప్రదాయ జీవనమార్గంలో నడిచే తల్లిదండ్రుల బిడ్డ కమల. ఆ నేపథ్యంలో వారి చైతన్యాలు ఆ రకంగానే వికసించాయి. తల్లిదండ్రుల ఇష్టానుసారం బాల్యంలోనే వివాహం చేసుకొని యుక్త వయసు రాగానే చదువు మానేసింది కమల. చదువు కొనసాగించి స్కూల్ ఫైనల్ ప్యాస్ అయింది సరళ. మద్రాస్‌లో జరిగే టెన్నిస్ పందేలు చూసేందుకు వెళ్లి అక్కడ టెన్నిస్ ఆట గాడు బేగ్‌ను పెళ్లి చేసుకోవాలనుకుటుంది. అందుకు

తల్లిదండ్రుల ఆమోదం పొందగల్గిన స్వేచ్ఛ, స్వతంత్రాలను అనుభవించే స్థితిలో సరళ ఉంటుంది. ఐతే సరళ చేసుకొన్న మతాంతర వివాహం వరుడి పక్షం వాళ్ళకు సమ్మతం కాకపోవ టంతో ఆమె వైవాహిక జీవితం అర్ధాంతరంగా ముగుస్తుంది. బాల్య వివాహం చేసుకున్న కమలదా అదృష్టం? తను చుదువు కొని కోరుకున్న పెళ్ళి చేసుకున్న సరళదా అదృష్టం? ప్రశ్నిస్తే రచయిత్రి బాల్య వివాహం చేసుకున్న కమలదిగా చూపించింది. కారణం బాల్య వివాహం చేసుకున్నప్పటికి కమల అత్త మామల కు, భర్తకు సేవచేస్తూ నూలు వడకటం పిల్లలందర్ని చేర్చుకొని హిందీ నేర్పటం వంటి జాతీయోద్యమ కార్యకలాపాలను సాగిస్తూ ఇంటిని భూలోక స్వర్గంలా చేసుకున్నది కమల అని రచయిత్రి అభిప్రాయం. బాల్య వివాహం తప్పు కాదనేది రచయిత్రి భావనగా కనబడుతుంది. ఒకరోజు సరళ, కమల దగ్గరికి చేరి పరిస్థితి తెల్పి 'నాగతి ఇలా అయింది' అని తన మీద తానే జాలిపడటం మాటలను చూస్తే మతాంతర వివాహాల పట్ల కూడా రచయిత్రి విముఖత కనిపిస్తుంది. కమల భర్త దామోదం సరళను ఆదరిస్తాడు. ఇంతలో సహాయ నిరాకరణో ద్యమంలో దామోదరం జైలుకు వెళ్తాడు. తిరిగి వచ్చేసరికి సరళ, కమల ఆయన పనిని కొనసాగిస్తారు. సరళ ఇదివరకు పాశ్చాత్య వ్యామోహంతో కొన్న జపాను, బెంగళూరు సిల్క్ చీరలు అన్నీ అగ్నిలో దహనం చేస్తుంది. ఖద్దరు చీర ధరించి, ఖద్దరుకున్న గౌరవం విదేశీ బట్టలకు లేదని ప్రచారం చేస్తుంది. ఖద్దరు బట్టలమూట నెత్తినబెట్టుకొని ఖద్దరమ్ముతుంది. సంసారంలో వైఫల్యం చెందిన స్త్రీలకు జాతీయోద్యమం ఒక ప్రత్యామ్నాయ ఆదర్శంగా కార్యక్రమం కావటం గమనించవచ్చు. సరళ పేరు ప్రఖ్యాతులు ప్రతి పత్రికలో చదివి పశ్చాత్తాపంతో బేగ్ సరళను వెతుక్కుంటూ వస్తాడు. సరళ 'ఇక రాను' దేశమే నాకు సంసారం. నీ కిష్టమైతే దేశసేవ చేయమని అంటుంది. మాతృ దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాతే మనకు సంసారం అనటంతో ఆమె స్వాతంత్ర్యకాంక్షను బలంగా చూపించింది రచయిత్రి. ఒక రోజు బెజవాడలో విదేశీ బట్టల దుకాణం దగ్గర పికెటింగ్‌లో అరెస్టయి ఆరు నెలలు శిక్షతో రాయవేలూరు జైల్లో వేస్తే ఆహార నియమాలు పడక 21 రోజులు ఉపవాసం ఉంటుంది. దేశం కోసం ప్రాణాలు ధారపోయటం నా అదృష్ట మని తల్లిదండ్రులకు, స్నేహితురాలికి తెలియజేస్తూ దేశసేవ మాత్రం ఏ నాటికి మరువద్దని ఆఖరుమాటగా చెప్పి ప్రాణాలు పదులుతుంది. సరళ ఉన్నతాశయాల కోసం పనిచేసి ప్రాణాలు వదలినం దుకు కమల తన కూతురుకి సరళ అని పేరు పెట్టు కొంటుంది. సకాలంలో పెళ్ళి చక్కని సంసారం భర్త ఆశయా లకు అనుగుణమైన ఆశయాలు ఆచరణ ఉన్న కమలదా అదృష్టం ? సంసారం జీవితం, విఫలమైనా జాతీయోద్యమంలో సార్థకమైన జీవితం గడిపిన సరళదా అదృష్టం ? అనే ప్రశ్న పాఠకులను వెన్నంటుతూనే ఉంటుంది. ఒకసారి ఒకవైపు మరొకసారి మరోవైపు మొగ్గుతుంది మనసు. ఆ ఇద్దరూ ఒకే వ్యక్తిత్వంలో భాగం కావటం రచయిత్రి ఆకాంక్ష.

జాతీయోద్యమంలో మహిళా కార్యకర్తల సహాయ సమయ స్ఫూర్తి తాడినాగమ్మ రాసిన 'ఇది కథ కాదు'లో కథాంశం భర్త కోసం ఖద్దరు ఉద్యమంలో పాల్గొన్న మరో ఇల్లాలు రాధ కథ చంద్రకాంతం రాసిన 'ప్రేమ వేదిక మీది' కథ. కన్నతల్లి పోషణార్థం జాతీయోద్యమానికి దూరమైన కుమారునికి కర్తవ్యం బోధించిన మాతృమూర్తి ఉద్బోధ మైదవోలు పద్మావతి రాసిన 'త్యాగిని' వృత్తాంతం. జాతీయోద్యమం నేపథ్యం నుంచి వచ్చిన స్త్రీలు రాసిన కథలలో మరింత విలక్షణమైంది తాడినాగమ్మ రాసిన ఒక ముద్దు కథ. జాతీయోద్యమ కార్యకలాపాలలో చైతన్యంతో చొరవతో పాల్గొంటున్న స్త్రీల చరిత్రను ప్రస్తావిస్తూ సామాజిక రంగాలలోకి వచ్చే స్త్రీలు ఎదుర్కొనే సున్నితమైన సమస్యను మనముందు పెట్టింది ఈ కథ.

## ఒక ముద్దు కథ

కథలో యువతకి 18 ఏళ్ళు. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొంటూ స్వదేశీ వస్త్ర విక్రయం తనపనిగా చేస్తున్న యువతి. నేధన్యనైతిని' కథలోని శారదాబాయి లాగ వితంతువు కాదు. కనుపర్తి వరలక్ష్మమ్మ గారి ఐదు మాసములు ఇరువది దినము లు' కథలోని రుక్మిణిలాగ ఇల్లాలు కాదు. ఎవరిదదృష్టం కథ లోని సరళలాగ విఫలమైన సంసారం కలది కాదు. పెళ్ళి కాని యువతి. స్వతంత్రంగా స్వచ్ఛందంగా ఉద్యమంలోకి వచ్చిన వ్యక్తి. స్వదేశీ ఉద్యమం వెనుక ఉన్న దేశీయ ఆర్థిక బలం గురిం చి తెలిసిన విద్యావంతురాలు మేధావి. విదేశీ వస్త్రాల కొనుగోలు వల్ల సంవత్సరానికి కొన్ని కోట్ల రూపాయల నష్టం జరగుతుం దని కొంత కాలం తర్వాత భారతీయులందరూ భిక్షాందేహీ అనే స్థితికి వస్తారని ఆవేదనతో స్వదేశీవస్త్రాలు మాత్రమే కొనమని ప్రజలను వేడుకుంటుంది. అప్పుడు ఆమె ఉపన్యాసం విన్న ధనమదాంధుడైన ఒక పురుషుడు ఒక ముద్దు ఇస్తే స్వదేశీ దీక్ష అవలంభిస్తానంటాడు. సామాజిక ఉద్యమంలోకి ప్రవేశించే స్త్రీలకు మాత్రమే ఎదురయ్యే ప్రత్యేక అనుభవం ఇది. స్త్రీలను లైంగిక దృష్టితో చూడటానికి మాత్రమే అలవాటు పడ్డ పురుషుల నుండి ఉద్యమాలలోకి వచ్చే స్త్రీలకు ఎదురయ్యే సమస్యను తాడి నాగమ్మ 1930లోనే ఊహించటం గమనించదగింది. ఇక్కడ ఆ యువతి ఒక దేశభక్తురాలుగానో, మేధావిగానో ఆ పురుషుడికి కనబడలేదు. తన అనుభవానికి సిద్ధంగా ఉన్న తాను హేళన చేయటానికి అవమానించడానికి అనువుగా ఉన్న రెండవ స్థాయి పౌరురాలుగా మాత్రమే కనబడింది. అందువల్లనే ఒక ముద్దు ఇస్తే ఉద్యమానికి పని చేయగల్గుతానని అనగలిగాడు. ఇలాంటి పరిస్థితులలో యువతులు అవమానంతో దు:ఖపడటం కాదు. ఆత్మ గౌరవంతో అలా అన్నవాళ్ళను (మిగతా 30వ పేజీలో)

# రాజ్యాంగ రచనలో మహిళల పాత్ర

అస్గర్ అలీ మహ్మద్

**రాజ్యాంగాన్ని శక్తివంతమైన విలక్షణ రాజ్యాంగంగా రూపొందించడంలో విశేష కృషి సల్పిన 15 మంది మహిళామణుల సేవను స్మరించుకుం దాం. వారే.. అమ్ము స్వామినాథన్(కేరళ), ద్రాక్షాయణి వేలునాథన్(కేరళ), బేగం ఐజాజ్ రసూల్(యునైటెడ్ ప్రావిన్స్), దుర్గాబాయి దేశముఖ్(రాజమండ్రి-ఆంధ్రప్రదేశ్), హన్స్ జీవరాజ్ మెహత(బరోడా), కమలా చౌదరి(లక్నో), లీలా రాయ్ (అస్సాం), మాలతి చౌదరి(ఈస్ట్ బెంగాల్), పూర్ణిమా బెనెర్జీ(అలహాబాద్), రాజకుమారి అమ్రిత్ కౌర్(లక్నో), రేణుక రాయ్ (బెంగాలీ, ICS అధికారి కుమార్తె, లండన్‌లో చదువు), సరోజినీ నాయుడు(హైదరాబాద్), సుచేత కృపలానీ(అంబాల-హర్యానా), విజయలక్ష్మి పండిట్ (అలహాబాద్), అన్నీ మాస్కారేన్(కేరళ).**

భారతదేశానికి నూతన రాజ్యాంగం తయారు చేయడానికి 1946లో 389 సభ్యులతో ఏర్పడింది భారత రాజ్యాంగ నిర్మాణ సంఘం(Constituent Assembly). దీనికి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ అధ్యక్షులయ్యారు. రాజ్యాంగ రచనకు భారత రాజ్యాంగ నిర్మాణ సంఘం అనేక కమిటీలుగా విడిపోయింది. ఆ కమిటీలలో ఒకటైన రాజ్యాంగ ముసాయిదా కమిటీ (Draft Committee) తయారుచేసిన రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26న రాజ్యాంగ నిర్మాణ సంఘం(Constituent Assembly) ఆమోదించినది. నూతన భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చింది. రాజ్యాంగ పితామహుడిగా పిలువబడిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాయకత్వంలో ఏడుగురు మగ సభ్యులతో కూడిన రాజ్యాంగ ముసాయిదా కమిటీ (డ్రాఫ్ట్ కమిటీ) రాజ్యాంగాన్ని తయారుచేసినా, భారత రాజ్యాంగ రూప కల్పనకు విశేషంగా తోడ్పడిన రాజ్యాంగ నిర్మాణ సంఘం (Constituent Assembly) లోని పదిహేను మంది మహిళా సభ్యుల సహకారం సులభంగా మర్చిపోరాదు. వారి జీవిత చరిత్రలను సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

## 1. అమ్ము స్వామినాథన్

అమ్ము స్వామినాథన్ కేరళలోని పాలఘాట్ జిల్లాలోని అనక్కారాలో ఒక ఉన్నత కుల హిందూ కుటుంబంలో జన్మించారు. ఆమె 1917లో ఉమెన్స్ ఇండియా అసోసియేషన్‌ను (Womens India Association) మద్రాసులో, అనిబిసెంట్, మార్గరెట్ కజిన్స్, మలాతీ పట్వర్ధన్, శ్రీమతి దాదాబాయ్, శ్రీ అంబుజామల్లతో కలిపి ఏర్పాటుచేశారు. ఆమె 1946లో మద్రా స్ నియోజకవర్గం నుంచి



రాజ్యాంగ సభ నిర్మాణ సంఘా నికి ఎన్నికయ్యారు. 1949 నవంబరు 24న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాయకత్వంలో రూపొందించిన ముసాయిదా రాజ్యాంగ ఆమోదంపై చర్చ సందర్భంగా ప్రసంగంలో ఒక ఆశావహ మరియు విశ్వాసంతో కూడిన అమ్ము స్వామినాథన్ ఇలా అన్నారు. 'భారతదేశం తన మహిళ లకు సమాన హక్కులు ఇవ్వలేదని భారతదేశం వెలుపల ప్రజలు పేర్కొ న్నారు. భారతీయ ప్రజలు తమ రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు వారు దేశంలోని ప్రతి ఇతర పౌరులతో సమానంగా మహిళలకు హక్కులు ఇచ్చారని ఇప్పుడు మనం చెప్పవచ్చు' అని అన్నారు. ఆమె 1952లో లోక్‌సభకు, 1954లో రాజ్య సభకు ఎన్నికయ్యారు. 1959లో అమ్ము స్వామినాథన్, సత్యజిత్ రే అధ్యక్షుడిగా వున్న 'ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీ' వైస్ ప్రెసిడెంట్ అయ్యారు. ఆమె భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్(1960-65) మరియు సెన్సార్ బోర్డులకు అధ్యక్షత వహించారు.

## 2.ద్రాక్షాయణి వేలాయుధన్

ఈమె 1912 జూలై 4న కొచ్చిన్‌లోని బోల్గట్టి ద్వీపంలో జన్మించారు. ఆమె అణగారిన వర్గాల(డిప్రెస్స్ క్లాస్) నాయకురాలు. తీవ్ర వివక్షతకు గురైన పులాయ కమ్యూనిటీకి చెందిన ఆమె, ఆ కమ్యూనిటీలో విద్యనభ్యసించిన, ఆ కమ్యూనిటీలో పై వస్త్రం(బ్లౌస్) ధరించిన మొదటిమహిళ. 1945లో ఆమె కొచ్చిన్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు నామినేట్ అయ్యారు. 1946లో రాజ్యాంగ సభకు ఎన్నికైన మొదటి మరియు ఏకైక దళిత మహిళ. రాజ్యాంగ అసెంబ్లీ చర్చల్లో షెడ్యూల్డ్ కులానికి సంబంధించిన అనేక అంశాలపై ఆమె బీఆర్ అంబేద్కర్‌ను అనుసరించారు.

## 3.బేగం ఐజాజ్ రసూల్

మాలెర్కోట రాచరిక కుటుంబంలో జన్మించిన ఆమె యువ భూస్వామి నవాబ్ ఐజాజ్ రసూల్‌ను పెళ్లి చేసుకున్నారు. ఆమె రాజ్యాంగ అసెంబ్లీకి చెందిన ఏకైక ముస్లిం మహిళ. 1935 భారత ప్రభుత్వం చట్టం అమలుతో రసూల్, ఆమె భర్త ముస్లిం లీగ్‌లో చేరి ఎన్నికల రాజకీయాలలో ప్రవేశించారు. 1937 ఎన్నికలలో, ఆమె U.P(యునైటెడ్ ప్రావిన్స్) శాసనసభకు ఎన్నికయ్యారు. 1950లో దేశంలో ముస్లిం లీగ్ రద్దు చేయడంతో ఆమె, రసూల్ కాంగ్రెస్‌లో చేరారు. ఆమె 1952 లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1969 నుంచి 1990 వరకు ఉత్తరప్రదేశ్ శాసన సభ్యురాలుగా ఉన్నారు. 1969, 1971 మధ్య సోషల్ వెల్ఫేర్ మరియు మైనారిటీల మంత్రిగా పనిచేశారు. ఆమె చేసిన సాంఘిక కృషికి 2000లో ఆమె పద్మభూషణ్ పురస్కారం అందుకుంది.

## 4.దుర్గాబాయి దేశ్‌ముఖ్

దుర్గాబాయి దేశ్‌ముఖ్ 1909 జూలై 15న రాజమండ్రిలో జన్మించారు. 12 ఏళ్ల వయసులో ఆమె ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం గారితో కలిసి నాన్ కో ఆపరేషన్ ఉద్యమంలోను, 1930 మేలో మద్రాస్ నగరంలో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలోను పాల్గొన్నారు. 1936లో ఆంధ్రప్రదేశ్ మహిళా సభను స్థాపించారు. తర్వాత ఒక దశాబ్దంలో అది మద్రాసు నగరంలో విద్య మరియు సామాజిక సంక్షేమ రంగాలలో గొప్ప సంస్థగా అవతరించింది. సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డ్, నేషనల్ కౌన్సిల్ ఫర్ వుమెన్స్ ఎడ్యుకేషన్ మరియు నేషనల్ కమిటీ ఆన్ గర్ల్స్ అండ్ వుమెన్స్ ఎడ్యుకేషన్ వంటి అనేక కేంద్ర సంస్థలలో ఆమె చైర్-పర్సన్‌గా పనిచేశారు. ఆమె పార్లమెంటు సభ్యురాలితో పాటు కేంద్ర ప్రణాళికా సంఘం సభ్యురాలు. ఆమె ఆంధ్ర ఎడ్యుకేషనల్ సొసైటీ, న్యూఢిల్లీతో సంబంధం కలిగి ఉన్నారు. దేశంలో అక్షరాస్యత ప్రోత్సాహానికి చేసిన అసాధారణ కృషికి 1971లో దుర్గబాయ్ నాలుగవ నెహ్రూ సాహిత్య పురస్కారం అందుకున్నారు. 1975లో ఆమెకు పద్మ విభూషణ్ పురస్కారం లభించింది.

## 5.హంసా జీవరాజ్ మెహతా

1897 జూలై 3న ఆమె దేవన్ ఆఫ్ బరోడా మనుభాయ్ నంద్ శంకర్ మెహతాకు జన్మించారు. జర్నలిజం, సోషియాలజీ ఇంగ్లాండ్‌లో చదివారు. ఆమె ఒక సంస్కర్త, సాంఘిక కార్యకర్త, విద్యావేత్త మరియు రచయిత్రి. ఆమె గుజరాతీలో పిల్లలకు అనేక పుస్తకాలు రాశారు. గలివర్స్ ట్రావెల్స్‌తో సహా పలు ఆంగ్ల కథలను అనువదించారు. 1926లో బాంబే స్కూల్స్ కమిటీకి ఎన్నికయ్యారు. 1945-46లో ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ కన్వెన్షన్‌లో ఆమె తన అధ్యక్ష ఉపన్యాసంలో మహిళల హక్కుల బిల్లును ప్రతిపాదించారు. ఆమె 1945-1960 మధ్య SNDT మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్, ఆల్ ఇండియా సెకండరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సభ్యురాలు, ఇంటర్-యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు మరియు మహారాజా శాయాజీ రావు యూనివర్శిటీ ఆఫ్ బరోడా వైస్-ఛాన్సలర్‌గా పనిచేశారు.

## 6.కమలా చౌదరి

కమలాచౌదరి లక్నోలోని ఒక సంప్రదాయ ధనిక కుటుంబంలో జన్మించారు. ఆమె తన విద్యను కొనసాగించటానికి పోరాటం జరిపారు. ఆమె జాతీయవాది మరియు 1930లో గాంధీ ప్రారంభించిన శాసనోల్లంఘన ఉద్యమంలో చురుకైన భాగస్వామిగా ఉన్నారు. ఆమె 54వ సెషన్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. 70 దశకంలో లోక్‌సభ

సభ్యురాలిగా ఎన్నికయ్యారు. చౌదరి ఒక ప్రసిద్ధ రచయిత్రి. ఆమె కథలు సాధారణంగా మహిళల అంతర్గత ప్రపంచాన్ని ఆవిష్కరిస్తాయి. ఆధునిక దేశంగా భారతదేశం ఆవిర్భావాన్ని చిత్రీకరించారు.

## 7. లీలా రాయ్

ఆమె 1900వ సంవత్సరం అక్టోబర్‌లో గోయల్పరా, అస్సాంలో జన్మించారు. తండ్రి డిప్యూటీ మేజిస్ట్రేట్. జాతీయ వాద ఉద్యమంపై సానుభూతి కలిగి ఉన్నారు. ఆమె 1921 లో బెతున్ కాలేజీ నుంచి పట్టభద్రులై, ఆల్ బెంగాల్ ఉమెన్స్ సఫ్రేజ్ కమిటీ(All Bengal Womens Suffrage Committee) కి సహాయ కార్యదర్శి అయ్యారు. మహిళల హక్కులను డిమాండ్ చేయటానికి సభలు, సమావేశాలు ఏర్పాటు చేశారు. 1923లో, ఆమె తన స్నేహితులతో దిపాలి సంఘాన్ని స్థాపించారు. దిపాలి సంఘం స్థాపించిన పాఠశాలలు రాజకీయ చర్చకు కేంద్రాలుగా మారాయి. తరువాత 1926లో, ఢాకా మరియు కోలకతాలో మహిళ విద్యార్థిని సంఘం 'చాత్రీ సంఘం'ను స్థాపించారు. దీక్షా మహిళా సత్యాగ్రహ సంఘాన్ని ఏర్పాటు చేయడంలో ఆమె కీలకపాత్ర పోషించారు. ఇది ఉప్పు-పన్ను వ్యతిరేక ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించింది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆశీర్వాదాన్ని కలిగిన జయశ్రీ పత్రిక సంపాదకురాలుగా పనిచేశారు. 1937లో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. మరుసటి సంవత్సరం, బెంగాల్ ప్రాంతీయ కాంగ్రెస్ మహిళా సంఘాన్ని స్థాపించారు. సుభాష్‌చంద్రబోస్ రూపొందించిన మహిళల సబ్ కమిటీ సభ్యురాలిగా పనిచేశారు. బోస్ 1940లో జైలుకు వెళ్ళినప్పుడు, ఆమె ఫార్వర్డ్ బ్లాక్ వీక్లీ సంపాదకురాలిగా నామినేట్ అయ్యింది. భారతదేశం వదిలివెళ్ళటానికి ముందు, లీలా రాయ్ మరియు ఆమె భర్తకు పార్టీ కార్యక్రమాల పూర్తి బాధ్యత నేతాజీ ఇచ్చారు. 1947లో ఆమె పశ్చిమ బెంగాల్లోని మహిళా సంస్థ అయిన జాతియ మహిళా సంఘటిని స్థాపించారు. 1960లో, ఫార్వర్డ్ బ్లాక్(సుభాషిస్ట్) మరియు ప్రజా సోషలిస్ట్ పార్టీల విలీనంతో ఏర్పడిన నూతన పార్టీకి ఆమె అధ్యక్షురాలుగా పనిచేశారు.

## 8. మాలతీ చౌదరి

1904లో ఈస్ట్ బెంగాల్ (ఇప్పుడు బంగ్లాదేశ్)లోని ఒక ప్రముఖ కుటుంబంలో జన్మించారు. ఆమెను కుటుంబ సభ్యులు 16 ఏళ్ళ వయసులో శాంతినికేతన్‌కు పంపారు. అక్కడ ఆమె విశ్వభారతి విశ్వవిద్యాలయంలో చేరారు. ఆమె నవక్రుష్ణ చౌదరిని వివాహం చేసుకున్నారు. తర్వాత ఆయన ఒడిశా ముఖ్యమంత్రి అయ్యారు. 1927లో ఆమె ఒడిషాకు మారారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి ఆమె భర్తతోపాటు ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. సత్యాగ్రహం కోసం అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు ఆ దంపతులు ప్రజలను విద్యావంతులను చేశారు. 1933లో ఆమె తన భర్తతో కలిసి ఉత్కల్ కాంగ్రెస్ సమాజ్ వాది కార్మిక్ సంఘ్‌ను స్థాపించారు. ఆ తరువాత అది అఖిల భారత కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీకి చెందిన ఒరిస్సా ప్రావిన్షియల్ బ్రాంచ్‌గా పిలవబడింది. 1934లో ఒరిస్సాలో తన ప్రసిద్ధ 'పాదయాత్ర'లో ఆమె గాంధీజీ తోపాటు పాల్గొన్నారు. ఒరిస్సాలోని బలహీన వర్గాల అభివృద్ధికి "బజారత్ చత్రావాస్" వంటి అనేక సంస్థలను ఆమె ఏర్పాటు చేసింది. ఆమె ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ ప్రకటనను నిరసిస్తూ ఖైదు చేయబడ్డారు.

## 9. పూర్ణిమ బెనర్జీ

పూర్ణిమ బెనర్జీ ఉత్తరప్రదేశ్ అలహాబాద్‌లోని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లో 1930 మరియు 40లలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న తీవ్రవాద భావాలు గల మహిళలలో ఒకరు. సత్యాగ్రహ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు ఆమెను అరెస్టు చేశారు. రాజ్యాంగ అసెంబ్లీలో పూర్ణిమ బెనర్జీ ప్రసంగాలు ఆమె సోషలిస్టు భావజాలానికి అద్దం పడతాయి. నగర కమిటీకి కార్యదర్శిగా, ఆమె ట్రేడ్ యూనియన్స్, కిసాన్ సమావేశాలు, గ్రామీణ వికాసం కోసం పనిచేశారు.

## 10. రాజకుమారి అమ్రిత్ కౌర్

అమ్రిత్‌కౌర్ ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో 1889 ఫిబ్రవరి 2న జన్మించారు. ఆమె భారతదేశ మొదటి ఆరోగ్య శాఖ మంత్రిగా పదేళ్లపాటు పనిచేసారు. కపుర్తాల మాజీ మహారాజు హర్నం సింగ్ కుమార్తె అయిన ఆమె ఇంగ్లాండ్‌లోని డోర్సెట్‌లోని షెర్బోర్ గర్ల్స్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. 16 ఏళ్లపాటు మహాత్మాగాంధీ కార్యదర్శిగా పనిచేశారు. ఆమె ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ స్థాపకురాలు(ఎయిమ్స్). మరియు దాని స్వయంప్రతిపత్తి కోసం ఆమె వాదించారు. ఆమె మహిళల విద్య, క్రీడల్లో వారి ఆరోగ్య సంరక్షణపై ఆసక్తి చూపేవారు. ఆమె ట్యుబర్క్యోసిస్ అసోషియేషన్ అఫ్ ఇండియా, సెంట్రల్ లెప్రాసీ అండ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను స్థాపించారు. సెయింట్ జాన్ అంబులెన్స్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షురాలిగా మరియు లీగ్ ఆఫ్ రెడ్ క్రాస్ సొసైటీ గవర్నర్ల బోర్డుకు వైస్ చైర్ పర్సన్‌గా వ్యవరించారు. ఆమె 1964లో మరణించినప్పుడు, ది న్యూయార్క్ టైమ్స్ ఆమెను 'తన దేశ సేవలో పాల్గొన్న యువరాణి' అని పిలిచింది.

## 11. రేణుకా రాయ్

ఆమె ఐసీఎస్ అధికారి సతీష్‌చంద్ర ముఖర్జీ, చారులతా

ముఖర్జీల కుమార్తె. ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్ (AIWC)లో ఒక సామాజిక కార్యకర్త. ఆమె కొంతకాలం లండన్‌లో నివసించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుండి ఆమె BA పూర్తిచేశారు. 1934లో AIWC న్యాయ కార్యదర్శిగా ఆమె భారతదేశంలో "మహిళల చట్టపరమైన అవరోధాలు- ఎ ప్లీ ఫర్ ఏ కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ" (Legal Disabilities of Women in India; A Plea for a Commission of Enquiry). శారదా బిల్ మరియు భారత దేశంలో చట్టం ముందు మహిళల పరిస్థితిపై చట్టపరమైన సమీక్షను కోరారు. రేణుకా ఏకరీతి వ్యక్తిగత చట్టం కోడ్ uniform personal law code కోసం వాదించారు. భారత మహిళల స్థానం ప్రపంచంలో అత్యంత అన్యాయమైనది అని చెప్పారు. 1943 నుంచి 1946 వరకు ఆమె సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యురాలు. తరువాత రాజ్యాంగ అసెంబ్లీ, తాత్కాలిక పార్లమెంటు సభ్యురాలు. 1952-57లో పశ్చిమ బెంగాల్ రిలీఫ్ మరియు పునరావాస మంత్రిగా పనిచేశారు. 1957లో మరలా 1962లో ఆమె లోక్‌సభకు మాల్దా నుంచి ఎన్నికయ్యారు. ఆమె 1952లో AIWC అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ప్రణాళికా సంఘం మరియు శాంతినికేతన్‌లోని విశ్వ భారతీయ విశ్వవిద్యాలయం పాలక మండలిలో పనిచేశారు. ఆమె ఆల్ బెంగాల్ ఉమెన్స్ యూనియన్ అండ్ ది ఉమెన్స్ కో-ఆర్డినేటింగ్ కౌన్సిల్‌ను స్థాపించారు.

## 12. సరోజినీ నాయుడు

సరోజినీ నాయుడు 1879 ఫిబ్రవరి 13న హైదరాబాదులో జన్మించారు. ఆమె ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మరియు తొలి రాష్ట్ర గవర్నర్‌గా నియమించబడిన మొదటి భారతీయ మహిళ. "ది నైటింగేల్ ఆఫ్ ఇండియా"గా పిలుస్తారు. ఆమె లండన్‌లోని కింగ్స్ కళాశాలలో, తరువాత కేంబ్రిడ్జిలోని గిర్టన్ కాలేజీలో చదువుకుంది. ఇంగ్లండ్‌లో ఓటు హక్కు ప్రచారంలో కొంత అనుభవం పొందిన తరువాత, ఆమె ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ మరియు మహాత్మా గాంధీ యొక్క నాన్ కో-ఆపరేటివ్ ఉద్యమాలపై ఆకర్షితురాలయ్యారు. 1924 లో ఆమె ఆఫ్రికా, తర్వాత ఉత్తర అమెరికాలో పర్యటించారు. 1928-29లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమాలలో పాల్గొన్నారు. భారతదేశంలో బ్రిటీష్-వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్నందుకు ఆమెకు జైలు శిక్ష విధించారు. (1930, 1932 మరియు 1942-43). ఆమె 1931లో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ రెండవ సెషన్ కోసం గాంధీజీతో కలిసి లండన్ వెళ్లారు. సరోజినీ నాయుడు సాహిత్య పరంగా ప్రసిద్ధి చెందారు. 1914 లో ఆమె రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్‌లో సభ్యురాలిగా ఎన్నికయ్యారు.

## 13. సుచేత కృపలానీ

సుచేతా కృపలానీ 1908లో ప్రస్తుత హర్యానా-అంబాలా పట్టణంలో జన్మించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో ఆమె పాల్గొన్నారు. 1940లో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగాన్ని కృపలానీ స్థాపించారు. స్వాతంత్ర్యం తర్వాత, కృపాలానీ ఎంపిగా, తరువాత ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో లేబర్, కమ్యూనిటీ డెవలెప్‌మెంట్ అండ్ ఇండస్ట్రీ మంత్రిగా పని చేశారు. ఆమె చంద్రభాను గుప్తా తర్వాత యూపీ ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టి 1967 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఆమె భారతదేశ మొదటి మహిళా ముఖ్యమంత్రి.

## 14. విజయలక్ష్మి పండిట్

విజయాలక్ష్మీ పండిట్ 1900 ఆగస్టు 18న అలహాబాద్లో జన్మించారు. జవహర్‌లాల్ నెహ్రూ సోదరి. ఆమె 1932-1933, 1940, 1942-1943లలో మూడు వేర్వేరు సందర్భాలలో బ్రిటిష్ వారిచే ఖైదు చేయబడ్డారు. రాజకీయాల్లో పండిట్ దీర్ఘకాల జీవితం అలహాబాద్ మున్సిపల్ బోర్డుకు ఆమె ఎన్నికతో అధికారికంగా ప్రారంభమైంది. 1936లో ఆమె యునైటెడ్ ప్రావిన్స్(UP) అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1937లో స్థానిక స్వీయ-ప్రభుత్వం మరియు ప్రజా ఆరోగ్యమంత్రిగా అయ్యారు. క్యాబినెట్ మంత్రిగా ఎన్నికైన మొదటి భారతీయ మహిళ. 1939లో బ్రిటీష్ ప్రభుత్వం, ఇండియా రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొంటున్నది అని ప్రకటించినందుకు ఆమె నిరసన వ్యక్తం చేశారు. తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. సెప్టెంబరు 1953లో ఆమె U.N జనరల్ అసెంబ్లీ అధ్యక్షురాలిగా ఎన్నికైన మొట్ట మొదటి ఆసియా మహిళ.

## 15. అన్నీ మస్కారేన్

ఆమె కేరళలోని తిరువనంతపురానికి చెందిన లాటిన్ కాథలిక్ కుటుంబంలో జన్మించారు. ట్రావెన్కోర్ స్టేట్ కాంగ్రెస్‌లో చేరిన మొట్ట మొదటి మహిళలలో ఆమె ఒకరు. ట్రావెన్కోర్ స్టేట్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఎన్నికైన మొట్ట మొదటి మహిళగా గుర్తింపు పొందింది. ట్రావెన్కోర్ రాష్ట్రానికి స్వాతంత్ర్యం ఇచ్చి భారతదేశంలో విలీనం చేయాలనే ఉద్యమ నాయకులలో ఆమె ఒకరు. ఆమె తన రాజకీయ జీవితంలో 1939-47 నుంచి వివిధ కాలాలపాటు ఖైదు చేయబడ్డారు. 1952లో జరిగిన భారతదేశ సాధారణ ఎన్నికలలో తొలి లోక్‌సభకు మస్కారేన్ ఎన్నికయ్యారు. కేరళ నుంచి మొదటి మహిళా ఎంపీగా ఎన్నికయ్యారు. పార్లమెంటుకు ఎన్నికయ్యే ముందు, 1949-1950 మధ్యకాలంలో హెల్త్ అండ్ పవర్ మంత్రి పదవిలో కొంతకాలం పనిచేశారు. ❑

# చరిత్ర తిరగరాయడమే లక్ష్యం! అదే మార్చి 8 సందేశం




ఎస్.పుణ్యవతి

ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు


**'ఈ దుష్ట సమాజం పతనం కాక తప్పదు'. అంటాడు మార్క్సిస్టు మహా పండితులు రాహుల్ సాంకృత్యాయన్. అది అక్షరాలా నిజం. దుష్ట సమాజ పతనం మహిళల మహోగ్ర జ్వాలతోనే సాధ్యం. చరిత్ర చెబుతున్న సత్యం ఇది. చరిత్రలో వర్గ పోరాటాలకు ఎంత గొప్ప స్థానం ఉందో, పోరాటాల్లో మహిళలు పాత్రకు అంతే స్థానం ఉంది. మగువ తెగువ చూపకుండా ఏ ఒక్క సామాజిక విప్లవం జయప్రదం కాలేదంటాడు కారల్ మార్క్స్. ఫ్రెంచి విప్లవం మన కళ్ల ఎదుటి సాక్ష్యం.**

పదులు వేల సంఖ్యలో మహిళలు, పై వర్గాల స్త్రీల నుండి రెక్కాడితే గాని డొక్కాడని పేద శ్రామిక మహిళల వరకు తిరగబడి పోరాడారు. రాజరికం గాని, రాజాజ్ఞతో నడిచే సైన్యం గాని ప్రజలు ముఖ్యంగా మహిళల పోరాట ధాటికి తట్టుకోలేకపోయాయి. చివరికి రాచరికం కుప్పకూలింది. రాజు తల తెగిపడింది. స్వేచ్ఛా సమానత్వం సౌభాతృత్వం నినాదాలు ఉనికిలోకి వచ్చాయి. రాచరికాలకు కాలం చెల్లి ప్రజాస్వామ్యపు స్వేచ్ఛా గాలులు వీచడానికి ఫ్రెంచి విప్లవం నాంది పలికింది. అందులో స్త్రీల పాత్ర అమోఘం. అంతకన్నా గొప్పది అక్టోబరు విప్లవం. బానిసల తిరుగుబాట్లతో బానిస యుగం అంతరించింది. ఫ్రెంచి విప్లవంలో భూస్వామ్యం రద్దయి ఆధునిక పెట్టుబడిదారీ యుగం ఆవిర్భవించింది. పెట్టుబడిదార్ల దోపిడీ కారణంగా కార్మిక వర్గం అష్టకష్టాలు పడింది. ఆ దోపిడీ పీడనలను అంతమొందించింది అక్టోబరు విప్లవం. ఆ విప్లవానికి నాంది పలికింది మార్చి 8.

### మార్చి 8 చరిత్ర

1750 – ఆ ప్రాంతాల్లో ఫ్రెంచి విప్లవం వచ్చింది. బూర్జువా వర్గంతో పాటే కార్మిక వర్గం ఉనికిలోకొచ్చాయి. దివాళా ఎత్తిన రైతాంగం, స్త్రీలతో సహా ఫ్యాక్టరీల్లో పనికి కుదిరారు. కార్మిక వర్గం సైన్యంలో చేరారు. కష్టాలు పడలేక తిరగబడ్డారు. సంఘాలు పెట్టుకొని సంఘటితమయ్యారు. పెరుగుతున్న మహిళా కార్మికుల కోసం, వారి పోరాటాలు ఉధృతం చెయ్యడం కోసం సోషలిస్టు మహిళా నేతలు ముందుంటారు. క్లారాజెట్కిన్ నేతృత్వంలో 1910లో జమికూడి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి / మార్చి నెలల్లో ఒక్కరోజు అన్ని దేశాల్లో మహిళా శ్రామికుల కోర్కెల దినం జరపాలని తీర్మానించారు. కనీస వేతనాలు, పని గంటల తగ్గింపులు, ఓటు హక్కు వారి డిమాండ్లుగా ఉన్నాయి. ప్రపంచంలో యుద్ధ మేఘాలు కమ్ముకొంటున్న రోజులవి. యుద్ధం వద్దు శాంతి కావాలని డిమాండ్ చేశారు. రష్యాలోను కొల్లంతాయ్ నేతృత్వంలో మహిళా ఉద్యమం సాగుతూ వచ్చింది. ప్రతి ఏటా జరిపే 'మహిళా కార్మికుల కోర్కెల దినం' పోరాటాలకు మరింత స్ఫూర్తినిస్తూ వచ్చింది. కనీస హక్కుల కోసం కార్మికులు, భూమి కోసం రైతులు, యుద్ధం వద్దు శాంతి కావాలని సైనికులు తిరగబడుతున్నారు. చక్రవర్తి నిషిద్ధాజ్ఞలను ధిక్కరించి మహిళలు ప్రదర్శనలు చేశారు. రష్యన్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 23, కొత్త క్యాలెండర్ ప్రకారం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. వేల సంఖ్యలో మహిళలు వీధుల్లోకి వచ్చారు. రొట్టెల కోసం దుకాణాలపై దాడులు చేశారు. యుద్ధానికి వ్యతిరేకంగా శాంతిని కోరుతూ 'సైనికులారా! మీ తుపాకులు కింద పడేయండి! మాలో చేరండి' అంటూ పిలుపునిచ్చారు. సైన్యం తిరగబడింది. శతాబ్దాల చరిత్ర గల రోమనోవ వంశం కుప్పకూలింది. అదే ఫిబ్రవరి విప్లవంగా రష్యన్ విప్లవ చరిత్రలో నిలిచిపోయింది. అక్టోబరు విప్లవానికి నాంది పలికింది. చరిత్ర పునరావృతమవుతుందా! అన్నట్లుంది ప్రస్తుత పరిస్థితి. మోడీ ప్రభుత్వ విధానాలు, దాని వెనక నుండి నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ భావజాల దాడి మహిళలతో సహా మొత్తం ప్రజలను ఆందోళనలోకి నెడుతోంది. పోరుబాట పట్టేలా చేస్తోంది. గత కాంగ్రెసు పాలన నుంచి మోడీ పాలనలో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా ఉంది. ఓ వైపు కార్మిక హక్కులపై దాడి. మరోవైపు ప్రజాస్వామ్య హక్కులపై దాడి. మతం పేరుతో ప్రజల ఐక్యతను చీల్చి విరోధాలు పెంచి పబ్బం గడుపుకొనే ధోరణులు, గౌరీ లంకేశ్ వంటి మహిళల హత్యలు, గోరక్షణ పేరుతో ముస్లిం, దళిత సోదరులపై దాడులు, హత్యలు, చడీ చప్పుడు కాకుండా బ్యాంకుల్లో సొమ్ము కార్పొరేట్లకు దోచిపెట్టడాలు–ఇవన్నీ ఆగ్రహానికి గురిచేస్తున్నాయి. పీవీ నరసింహారావు మొద లుపెట్టిన సరళీకరణ విధానాలు మోడీ ప్రభుత్వం ఇంకా జోరుగా అమలు చేస్తోంది. ప్రణాళికా సంఘం రద్దు చేసి ఆ స్థానంలో నీతి ఆయోగ్ ప్రతిష్ఠించారు. దాని విషఫలితాల్లో

దళిత, గిరిజన సంక్షేమ నిధుల కత్తిరింపుతో ఇప్పటికే అన్యాయంగా ఉన్న ఈ వర్గాల స్థితి ఇంకా దిగజారింది. అంగ న్వాడీ, మధ్యాహ్న భోజనం వంటి స్కీములకు డబ్బులు తగ్గించేశారు. పిల్లల నోట్లో మట్టి కొట్టారు. తల్లులు, చెల్లెళ్లు అంటూ ఆకాశానికెత్తుతూనే స్కీం వర్కర్లతో చాలీ చాలని జీతాలలో గాడిద చాకిరీ చేయిస్తున్నారు. మరో వైపు రైతులను భూముల నుంచి వెళ్లగొట్టి లక్షల ఎకరాలు గుంజుకుంటున్నారు. పారిశ్రామిక అభివృద్ధి, మేక్ ఇన్ ఇండియా నినాదాలే కానీ పరిశ్రమలు వచ్చిందే లేదు. వచ్చినా యంత్రాలతోనే పని. కార్మికులు, వారెంత నైపుణ్యం గల వారైనా, కనీస వేతనాలు ఇవ్వరు. రాజధాని ఢిల్లీతో సహా రూ.ఐదారు వేలకు మించి జీతం లేదు. మోడీ గారు, ఆయనను నడిపే సంఘీయుల సూక్తులు మహాద్భుతంగా వుంటాయి. ఆడవాళ్లు బయటికొచ్చి పని చెయ్యరాదట! ఇంటి పట్టునే ఉండి మొగుణ్ణి, పిల్లల్ని చూసు కోవాలట. సనాతన ధర్మం చెప్పిందట. మొగుడికి సరిపడా జీతమిచ్చి, భార్యా పిల్లల్ని అపురూపంగా చూసుకోగలిగితే బయటికి పోయి చాకిరీ చెయ్యాల్సిన ఖర్మ, యజమానులు, తోటి కార్మికుల వేధింపులు, అవమానాలు, అఘాయిత్యాలు భరించాల్సిన ఖర్మ ఎవరికి పట్టింది. బ్యాండెక్కు కార్మికురాలు ఏం పాపం చేసిందని? అసలు రాజకీయమేమంటే ఆడది, అబల అని పేరు చెప్పి ఆడదాని ఆత్మ విశ్వాసాన్ని దెబ్బగొట్టి ఇంకా, ఇంకా తక్కువ కూలి ఇచ్చి, చాకిరీ చేయించుకోవాలనే కుట్ర దీన్లో దాగి వుంది. 'సీత గీత దాటితే' అంటూ లక్ష్మణ రేఖలు గీచి, గడప దాటితే మీ బతుకింతే అని పురుషాధిక్య హూంకరింపులు ఇందులో వున్నాయి. నూతన ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చాక పబ్లిక్ సెక్టారుపై దెబ్బకొట్టారు. ప్రయివేటు వాళ్ల లాభాపేక్షకు.. జనాలను పంచి పెట్టారు. లైసెన్సు రాజ్ రద్దు చెయ్యాలనే గావుకేకలు పెట్టి వున్న కార్మిక చట్టాలను, కార్మిక హక్కులను రద్దు చేయడంలో మోడీ గారు కాంగ్రెసు పాలకులకన్నా నాలుగాకులు ఎక్కువే చదివారు.

ఇకపోతే గో రక్షణ, దాని వెనకాల చెప్పే శ్రీరంగ నీతులు చూద్దాం. ఒక వైపు గోమాత, గోరక్షణ నినాదాలు, ముస్లింలు, దళితులు ఆవు మాంసం తింటారంటూ సమాజంలో 40 శాతం జనాన్ని వెలివేసినంత పనిచేసి వాళ్ల మీద దాడులు చేయించేది కేవలం గోమాత మీద ప్రేమ అని ఏ రైతుగాని, ఏ ఆడ కూతురు గాని అనుకుంటే అంతకన్నా అమాయకత్వం, వెర్రిబాగులతనం మరొకటి వుండదు. అసలు కారణమేమంటే మన వ్యవసా యాన్ని దెబ్బకొట్టడం. దివాళా ఎత్తిన రైతుల నుండి భూములు కారు చౌకగా గుంజుకొని పందికొక్కుల్లాంటి కార్పొరేట్లకు కట్టబెట్టడం. ఇప్పుడు చూడండి అసలు కథ. మధ్య ప్రదేశ్లో బీజేపీ అధికారంలో వుంది. ఇప్పుడు లేటెస్టుగా ఒక చట్టం తేవాలని ప్రయత్నిస్తోంది. అదేమంటే, ఆవుల్ని పోషించకుండా ఎవరైనా గాలికి వదిలేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకో వాలని, శిక్షించాలని. హర్యానాలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా అదే బాట పట్టింది. మన దేశంలో ఇప్పటికీ 60 నుండి 70 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. వ్యవసాయ మంటే స్త్రీలే. స్త్రీలే ఈ రోజు వ్యవసాయ పనుల్లో ఎక్కువగా వుంటున్నారు. వ్యవసాయం తరువాత పశుపోషణ అతిపెద్ద ఆదాయ వనరు. వ్యవసాయానికి పనికిరాని, పాలు ఇవ్వని వట్టి పోయిన పశువుల్ని మాంసానికి అమ్మడం ఎక్కడైనా ఆనవాయితీ. ఈ ప్రభుత్వాల నిర్వాకాల కారణంగా, రైతాంగం దివాళా తీసి, రైతు కుటుంబం తమని తాము పోషించుకోవడమే భారమైన స్థితిలో వట్టిపోయిన పశువుల్ని మాంసానికి అమ్ముకుం టారు. ఇప్పుడు కొనడమే గాదు, అమ్మడం కూడా నేరం అవు తోంది. రైతులు ఇంకా అప్పుల్లో కూరుకుపోవడం, దివాళా ఎత్తడం, భూములను అమ్ముకోవడం ఖాయం. రైతులు, రైతు స్త్రీలు, వేతన కార్మికుల సంఖ్యలో చేరడం దాని ఫలితమే. ఇప్పటికే రైతు కుటుంబాలు భూములు వదిలి వలసలు పోయి పట్నాల్లో కార్మిక సైన్యంలో చేరుతున్నారు. ఇప్పుడు ఈ ప్రక్రియలో ఇంకా వేగం పుంజుకుంటుంది. వ్యవసాయంలో కుటుంబ పోషణ సాధ్యం కాక, పని దొరకక, ఇప్పటికే స్త్రీలు వేతన కార్మికుల జాబితాలో చేరిపోయారు. మన రాష్ట్రంతో సహా అన్ని రాష్ట్రాల్లో జరుగుతున్నదదే.


గతంతో పోలిస్తే వ్యవసాయేతర కార్మికుల సంఖ్య వేతనం మీద ఆధారపడే ఫ్యాక్టరీ కార్మికులు కావచ్చు, ఇళ్లల్లో వుండి దుస్తులు ఇతర పరిశ్రమల్లో పని చేసే గృహ కార్మికులు కావచ్చు, నిర్మాణరంగం ఇంకా ఇతర సేవారంగాలలోకి మహిళా కార్మి కుల సంఖ్య పెరిగింది. రాష్ట్రంలో జీడి పప్పు పరిశ్రమ, రొయ్యల పరిశ్రమ, స్పిన్నింగ్, టెక్స్ టైల్, గార్మెంటు వంటి పలు రంగా ల్లోనూ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా తదితర స్కీము వర్కర్లు, విద్య, వైద్య రంగాల్లో లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరు కాక చింతపండు, అగర్బత్తి, జీన్స్ ప్యాంట్లు వంటి గార్మెంట్లలో లక్ష వరకు వున్నారు. పని కోసమో గావచ్చు, ఒకసారి కార్మి కులు ఒక గొడుగు కింద పనిచెయ్యడం ప్రారంభించాక సం ఘాలు పెట్టుకోకమానరు. పోరాటాల్లోకి దిగకమానరు. బతుకు మీద జరిగే దాడిని తిప్పి కొడతారు. ఆధార్ కార్డు అనుసంధానం పేరుతో లక్షల సంఖ్యలో రేషను కార్డులను ప్రభు త్వం రద్దు చేసింది. అదేమంటే వేలిముద్రలు పడలేదంటారు. ధరలు పెరుగుతాయి. ప్రభుత్వం నుండి సహకారం శూన్యం. హింస పెరుగుతోంది. 'భారత్ మాతాకీ జై' నినాదం ఇవ్వకుంటే నేరం. కాని మాతలకీ రక్షణ లేదు. బిడ్డలకీ రక్షణ లేదు. దేశమంతా హోలీ రంగుల్లో మునక లేస్తుంటే రాజధాని ఢిల్లీలో, కాలేజీ విద్యార్థినులపై బెలూన్లలో వీర్యం నింపి ఆడపిల్లలపైకి గురిచూసి కొట్టారు. 7వ తరగతి పిల్లవాడు 4 వ తరగతి పిల్ల మీద అత్యాచారం చేస్తాడు. (మిగతా 32లో)

# షహీదా కవిత్వ పరామర్శ



కాత్యాయనీ విద్మహే

**ఒకప్పుడు అంతర్జాతీయంగా మహిళా శ్రామిక హక్కుల పోరాట సంకేతం అయిన మార్చ్ 8 ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్‌లో మహిళలు సాధించిన సాంఘిక ఆర్థిక సాంస్కృతిక రాజకీయ ప్రగతికి సంతోషిస్తూ చేసుకొనే ఉత్సవంగా రూపాంతరం చెందింది. ఈ పరిస్థితులలో 2023 మార్చ్ 8 కి ప్రపంచమంతటికీ 'పక్షపాతం, మూసపాత్రలు, వివక్ష లేని జండర్ సమానతా ప్రపంచాన్ని భావిద్దాం. కలిసికట్టుగా సమానత్వాన్ని కౌగిలించుకొందాం' అన్న నినాదం అంది వచ్చింది. జండర్ సమానత్వ సాధనకు డిజిటల్ ప్రపంచంలోకి స్త్రీలందరినీ తీసుకొని రావటమే మార్గమని ఆ దిశగా కార్యాచరణకు పిలుపు కూడా వచ్చింది.**




జండర్ సమానత సాధించవలసిన లక్ష్యంగా ప్రపంచ వ్యాప్తంగా చర్చలోకి వచ్చి నాలుగు దశాబ్దాలు గడిచిపోయింది. జెండర్ సమానతకు అవరోధంగా ఉన్న పితృస్వామిక వ్యవస్థలు, భావజాలం, ఆ పితృస్వామిక భావజాలంతో స్వభావంతో నిండి పోయిన సామాజిక వ్యవస్థలు, సంస్థలు ఇన్నేళ్ళుగా విశ్లేషణకు, విమర్శకు గురవుతూనే వున్నాయి. ప్రజాస్వామిక సాంస్కృతిక భావజాలవ్యాప్తికి స్త్రీవాదం ఒక సిద్ధాంతంగా అందివచ్చింది. మహిళా సాధికారత దాని కొనసాగింపు భావనే. ముప్ఫయేళ్లు అవుతున్నా అది ఇంకా ఆకాశ కుసుమమే. సాధికారతకు అవసరమైన విద్యా వైద్య ఆర్థిక స్వావలంబన, సామాజిక రాజకీయ నిర్మాణాలలో భాగస్వామ్యం, నిర్ణయాధికారం నత్త నడకను మించలేదు. ఈ నేపథ్యంలో భారతదేశంలో కుల మత వర్గ సమాజంలో స్త్రీలపై రకరకాల రూపాలలో అమలవుతున్న ఆధిపత్యం, అణచివేత, నిర్బంధం, హింస యథాతథంగా కొన సాగుతూనే ఉన్నది. పేదరికం, ఆకలి లేని ప్రపంచ నిర్మాణం, జెండర్ సమానత సాధించటం, స్త్రీలను బాలికలను సాధికారు లను చేయటం వంటి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల మధ్య-ఒకటి సాధించటానికి మరొకటి ప్రధాన షరతుగా వున్నస్థితి, పరస్పర సంబంధం గమనించనట్లు జెండర్ సమానతను, సాధికారతను సర్వ స్వతంత్ర మంత్రాలుగా జపించటం అలవాటైన సమాజం లో ఉన్నాం. ఇప్పటికీ జండర్ సమానతను భావించటం దగ్గరే గిరికీలు కొట్టటం పెద్ద విషాదం. అయితే జండర్ సమానత సాధనకు ప్రపంచవ్యాపితంగా కమ్యూనిస్ట్ ఉద్యమాలు, ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించుకొంటూ కర్షక కార్మిక వర్గ విముక్తితో ముడిపెట్టి చేస్తున్న ప్రయోగాల చరిత్ర ఒకటి ఉందని గుర్తుంచుకొనటం ఆశావహమైన ముందడుగుకు నైతిక ధైర్యాన్నిస్తుంది. ఈ క్రమంలో దాదాపు గత 35 ఏళ్లుగా దండకారణ్య విప్లవోద్యమంలో లక్షల కొద్దీ సభ్యులతో నడుస్తున్న మహిళా సంఘాల ద్వారా జండర్ సమానత సాధనకు ప్రత్యా మ్నాయ ఆలోచనలు జరుగుతున్నాయి. ఆచరణ రూపం తీసు కొంటున్నాయి. విప్లవోద్యమంలో భాగమై ఆర్థిక అసమానతలు లేని సమాజానికి జండర్ సమానతకు ఉన్న సంబంధం

గురించిన తాత్విక అవగాహన నుంచి వాళ్ళు సాహిత్య సృజన చేస్తున్నారు. ఆ సాహిత్యాన్ని అధ్యయనం చేయటం సమానత్వం, స్వేచ్ఛ 'రాజ్యాంగబద్ధం'గా పౌరులందరికీ నిరాకరించబడుతున్న వర్తమాన సందర్భంలో ప్రత్యామ్నాయాల అన్వేషణకు అవసరం. షహీదా విషయంలో వివి అన్నట్లు వాళ్ళది మార్క్సియన్ జెండర్ స్పృహ. షహీదా కవిత్వంలోని మార్క్సియన్ జెండర్ స్పృహ గురించి మాట్లాడుకొనటం శ్రామిక మహిళల సమిష్టి శక్తికి సంకేతమైన మార్చి 8 సముచిత సందర్భం.

1992 నుండి 2011 వరకు షహీదా వ్రాసిన కవిత్వం 'ఒకమాట ఒక సంభాషణ' అనే శీర్షికతో 2015లో పుస్తకంగా ప్రచురించబడింది. ఇందులో తొమ్మిది కవితలకు వస్తువు జండర్ సమస్య. 'బోలో స్వతంత్ర భారత నారీకీ జై' వాటిలో మొదటిది. నీలి మేఘాలు కవితా సంకలనం వచ్చిన సంవత్సరమే ఇది మహిళా మార్గం పత్రికలో అచ్చయింది. (జూలై-సెప్టెంబర్ 1993) జండర్ రాజకీయ అవగాహన, విప్లవ రాజకీయ దృక్పథం పెనవేసుకొని వ్యక్తీకరణలో వ్యంగ్యం ప్రధానంగా వున్న కవిత ఇది. నాది పవిత్ర భారతదేశం, నాది స్వతంత్ర భారతదేశం, నాది అతిపెద్ద ప్రజాస్వామిక దేశం, బలహీనుల సంరక్షించే నాగరిక దేశం నాది, అన్ని మతాలకు విలువనిచ్చే లౌకిక రాజ్యం నాది,భిన్నత్వంలో ఏకత్వం నాదేశం, సర్వసత్తాక సార్వభౌమాధికార దేశం నాది అని దేశాన్ని గురించి సగర్వంగా చేసే ప్రకటనలు ఈ కవిత నిర్మాణంలో కీలకమైనవి. ఒక్కొక్క ప్రకటన దానికి పూర్తిగా భిన్నమైన సామాజిక రాజకీయ వాస్తవికతను చెప్పే భావచిత్రాలు, పదచిత్రాలతో విస్తరిస్తుంది. అలా ఒక్కొక్క ప్రకటనకు ఒక్కొక్క ఖండిక. ఆ రకంగా ఇందులో ఏడు ఖండికలు ఉన్నాయి.

"నాది పవిత్ర భారతదేశం
స్త్రీని దేవతగా పూజించే మను జన్మభూమి
అందుకే నాకు నిత్య 'అగ్నిహెూత్రాలూ'
బడితె 'పూజలూ' 'ధూప నైవేద్యాలు'!" అన్నది కవిత ప్రారంభం.

"నాది స్వతంత్ర భారతదేశం
ఆత్మహత్య చేసుకోవడానికీ
హత్యకు గురి కావడానికీ
ఆడ పిల్లలను చంపేసుకోడానికీ
శరీరాన్ని అమ్మేసుకోడానికీ
వంటింట్లో మగ్గడానికీ
పిల్లల్ని పెంచడానికీ
నాకెంత స్వతంత్రం?!" అని రెండవ ఖండికలో హత్యలకు, ఆత్మహత్యలకు, భ్రూణ హత్యలకు గురికావటానికి శరీర వ్యాపారానికి, వంటింటి పనికి, పిల్లల్ని కని పెంచటానికి స్త్రీలకు స్వతంత్ర భారతదేశంలో చాలా స్వతంత్రం ఉందని అత్యంత తిరస్కృత వాచ్య ధ్వనితో చెప్తుంది. ఇక్కడి వరకే అయితే ఇది కేవల స్త్రీ వాదకవిత. నాది అతిపెద్ద ప్రజాస్వామిక దేశం అని ప్రకటించాక 'రైతుల్ని పిప్పి చేసే భూస్వాముల్ని / కార్మికుల్ని తొలిచేసే పెట్టుబడిదారుల్ని/'రేప్'లు చేసే పోలీసుల్ని/వివస్త్రలను చేసే గూండాల్నీ/ అక్కున చేర్చుకొనే" ప్రభుత్వం ప్రజాస్వామ్య ప్రభుత్వం అవుతుందా ఆలోచించమని హెచ్చరిస్తుంది. అదే సమయంలో భూస్వామ్య పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలను ప్రోత్సహించే ప్రభుత్వాలు స్త్రీలకు మిత్ర ప్రభుత్వాలు కాలేవని సూచిస్తుంది.

'బలహీనుల సంరక్షించే నాగరిక దేశం' అంటే ఒక వైపు స్త్రీలను 'అబలలు' అని తక్కువ చేయటం.. మరొకవైపు 'అంట్లు తోమడం – వంట చేయడం, బట్టలుతకడం – పిల్లల్ని పెంచడం, ఇల్లు ఊడ్వడం – నీళ్ళు తేవడం' వంటి క్షణం తీరిక, దమ్మిడీ ఆదాయం లేని ఇంటి పనుల బరువు నెత్తికెత్తటం అని హేళనగా అంటుంది. అబలలు అంటే బలం లేనివాళ్ళు, శక్తి హీనులు అని కదా అర్థం వాళ్లకు అంట్లు తోమటం మొదలైన అంత ఇంటి పని బరువు మోపటం ఏమి న్యాయం అన్నది అందులోని తర్కం. బయటకు వెళ్తే నికరమైన ఆదాయం లేని తాత్కాలిక పనులు 'నాట్లు వేయడం – కోతలు కోయడం 'పీస్' వర్క్ చేయడం' వంటివి స్త్రీలకు కేటాయించటం గురించి నిరసన స్వరంతో పలుకుతూ స్త్రీల పనులను తేలికగా చూస్తారు కానీ అవి 'తేలిక పాటి' పనులు మాత్రం కావని సూచిస్తుంది. అలాగే అన్ని మతాలకు విలువనిచ్చేదిగా చెప్పబడే లౌకిక రాజ్యంలో అన్ని మతాలకు స్త్రీపైవున్న పెత్తందారీతనం సంగతేమిటి అని నిలదీస్తుంది. మతం పురుషులకు భార్యలను సులభంగా వదిలించుకోగల హక్కును, పిల్లల మీద హక్కును, మగపిల్లలకు ఆస్తిని వారసత్వంగా బదిలీ చేసే హక్కును ఇస్తున్నదని సతీ సహగమనం పేరుతో భార్య మీద మరణించిన భర్త అధికారాన్ని స్థిరీకరిస్తున్నదని చెప్తూ ఇందులోని వివక్షా స్వభావాన్ని గమనించమని గుర్తు చేస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం గురించి పదేపదే చెప్పే దేశంలో ప్రాంతాలు భిన్నమైనా నిర్బంధం లో ఏకత్వం ఉందని చెప్పటంలో ప్రజారాజకీయ దృక్పథం స్పష్టమే. అదే సమయంలో 'సి.ఆర్.ఎఫ్., బి.ఎస్.ఎఫ్., అస్సాం రైఫిల్స్, సి.ఐ.ఎస్.ఎఫ్..../ కావలి కుక్కల్లో – రక్కసి మూకల్లో భిన్నత్వం /స్త్రీలపై అత్యాచారాల్లో – ఏకత్వం !" అన్న పాదాలలో స్త్రీవాద కవులు పెద్దగా మాట్లాడని స్త్రీలపై రాజ్యహింస వైపు చూడమంటుంది షహీదా .

'సర్వసత్తాక సార్వభౌమాధికార దేశం నాది' అని ప్రారంభించిన భాగంలో అమ్మాయిల అక్రమరవాణా, బ్లూ ఫిల్మ్‌ల దిగుమతి, గర్భనిరోధక ప్రయోగాలకు భారత స్త్రీలను అప్పగించటం స్త్రీని అమ్మకపు సరుకుస్థాయికి దిగజార్చటమే అని సూచిస్తూ

అందుకు మార్గాలు తెరిచిన దేశం సర్వసత్తాక సార్వభౌమాధికారం కల దేశం అంటే నమ్మటం ఎలా అన్నది ఆమె ప్రశ్న. 'పర్యావరణాన్ని దెబ్బ తీసి ఆనకట్టలు నిర్మించినా /వ్యవసాయాన్ని నాశనం చేసినా/పరిశ్రమలు మూసేసినా' అన్నీ బహుళజాతి కంపెనీల విదేశీ వ్యాపార శక్తుల ప్రయోజనాల కొరకే అవుతున్నప్పుడు దేశం సర్వసత్తాక సార్వ భౌమాధికారం వున్నదేశమని అనుకొనటం ఎట్లా అన్న విచారం కవితలో వ్యక్తం అవుతుంది. బోలో స్వతంత్ర భారత్ కీ జై అని, బోలో స్వత్వంత్ర భారత నారీ కి జై! అని జైకొట్టుకొనటంలోని ఆత్మవంచనను బట్టబయలు చేసింది ఈ కవిత.

'ప్రజాస్వామ్యం అంటే హక్కుల కాపాడుకోట, ఆకతాయిలకు ధగడు' అంటాడు కాళోజి. వర్తమానంలో అది తిరగబడిన వాస్తవం. దీనిని 1993 నాటికే గుర్తించి హెచ్చరించింది షహీదా. రైతుల కార్మికుల స్త్రీల హక్కులను ధ్వంసం చేసే ఆధిపత్య వర్గాలను-భూస్వాములు, పెట్టుబడిదారులు, పోలీసులు, గుండాలు-ఎవరైనా కావచ్చు-అక్కున చేర్చుకొనే ప్రభుత్వం హక్కులు కాపాడే కోట స్వభావం కోల్పోయింది. కనుక అది ప్రజాస్వామ్యం కానేరదు అని కవి నిర్ధారించినట్లయింది.

స్త్రీ సమస్య వివక్షకు, పితృస్వామిక రాజకీయాలకు మాత్రమే పరిమితమైనది కాదు, సర్వ స్వతంత్ర అంశమూ కాదు. కర్షక కార్మిక వర్గాల సమస్యలతో కలిపి చూడవలసిన అంశం. అంతే కాదు స్త్రీ పురుష, కర్షక భూస్వామి, కార్మిక పెట్టుబడిదారు సంబంధాలలోని వైరుధ్యాలు పరస్పర సంబంధం కలిగినవే అన్నది విప్లవకవి అవగాహన. ఉత్పత్తి సంబంధాలు వ్యత్యాసాలను సృష్టించినా వాటిని స్థిరీకరించిన మత సంస్కృతుల, రాజకీయార్థిక విధానాల సంబంధంలో ఆ వ్యత్యాసాలను అర్థం చేసుకోవలసినదన్న మార్క్సియన్ జండర్ దృక్పథం అతి సాధారణ వాక్యాలతోనే అయినా అత్యంత వ్యంగ్యభరితంగా వ్యక్తం కావటం వల్ల ఇది మంచి కవిత అయింది.

1994లో షహీదా మిడిల్‌క్లాస్ తండ్రిని సంబోధిస్తూ పితృత్వం అనే కవిత వ్రాసింది. మాతృత్వానికి నిర్వచనాలు, వివరణలు సాహిత్యంలో కోకొల్లలు. అవి స్త్రీల మీద అనంతమైన పని బరువును అలవోకగా మోపుతాయి. మాతృధర్మంగా ప్రచారం చేయబడుతుంది. ఆ క్రమంలో త్యాగం తల్లి స్వభావంగా కీర్తించబడుతుంటుంది. మాతృదేవతగా స్త్రీకి భావనాత్మక సింహాసనం ఒకటి వేయబడుతుంది. ఒక స్త్రీ తల్లి కావటం అంటే ఒక పురుషుడు తండ్రి కావటం కూడా. కానీ పితృత్వానికి నిర్వచనాలు, వివరణలు సాహిత్యంలో తక్కువే. తల్లి పురిటి నొప్పులు పడి చచ్చి బతికి జన్మయిస్తే తండ్రి 'పుత్రగాత్ర పరిష్వంగ సుఖం' (శకుంతలోపాఖ్యానం, భారతం) పొందుతాడు. పిల్లల అల్లరికి అసమర్థతకు తల్లులను బాధ్యులు చేసి వాళ్ళ వివేకం సామర్థ్యం అంతా తమ ఘనతే అని గర్వపడుతుంటారు తండ్రులు. ఈ లోక రీతిలోని అణచివేత, హింస నిరసించవలసినవి, నిర్మూలించవలసినవి కనుక పితృత్వాన్ని నిర్వచించటానికి పూనుకొన్నది ఈ కవితలో షహీదా. 'వాళ్ళను హత్తుకున్నప్పుడు మాత్రమే కలిగే స్పర్శానుభూతి/వాళ్ళు కొత్తకొత్తగా అన్నీ నేర్చుకొన్న ప్పుడు కలిగే గర్వం' మాత్రమే కాదు పితృత్వం అంటే అని అస్తిత్వంలో ఉన్న అలవాటును ముందుగా నిరాకరించింది. 'రెండు పూటలా చేయించాల్సిన స్నానం /మూడుపూటలు ముదిపిస్తూ తినిపించవలసిన బువ్వ' అని మొదలు పెట్టి ఒక శిశువు పెంపకంలో స్త్రీలు చేసే అన్ని పనులు-మలమూత్రాలతో తడిసిన బట్టలు ఉతకటం, నలత పడ్డ బిడ్డ కోసం నిద్రకాయటం, జోలపాడటం అన్నీ చేయటమే పితృత్వం అని స్పష్టం చేసింది. మాతృధర్మంగా ఏదయితే చెప్పబడుతున్నదో అదే పితృధర్మం కూడా అని నిర్వచించిన షహీదా పిల్లల పెంపకపు పని స్త్రీ పురుషులిద్దరిదీ అని చెప్పినట్లయింది.

'ఆచరించం' అనే కవిత(1994) ప్రత్యేకత అత్యంత తిరస్కృత వాచ్యంలో ఉండటం. క్రోధాన్ని, నిరసనను వ్యక్తం చేయటానికి అదొక పద్ధతి సంభాషణ. క్రోధం దేని మీద? స్త్రీ పురుష సమానత్వం గురించి కానీ, దోపిడీ లేని సమాజం గురించి కానీ ఆలోచించకుండా బతికేస్తున్న గతానుగతికత్వం మీద. ఈ క్రోధాన్ని వ్యక్తం చేయటానికి సావిత్రిని సందర్భంగా చేసుకొన్నది షహీదా. సావిత్రి ఎవరు? మగవాడికి స్త్రీల జీవితం మీద సర్వాధికారాలు ఇచ్చిన పితృస్వామ్యం తల్లి జీవితానుభవం, తన జీవితానుభవం అయి భర్తను భరించలేని స్థితిలో ధిక్కారమై ఇద్దరు పిల్లలతో బయటకు వచ్చి స్వతంత్రంగా బ్రతకటానికి ప్రయత్నించి అనారోగ్యంతో 42 ఏళ్ల వయసులో (1991) మరణించిన కవి, విమర్శకురాలు. స్త్రీ పురుష సమానత్వం, దోపిడిలేని సమాజం ఆకాంక్షగా ఆమె రచన సాగింది. ఇలా కవులు లోకపుటన్యాయాల గురించి ఎందరు ఎంత వేదన పడుతున్నా, అరిచి మొత్తుకొంటున్నా ఏ మాత్రం మార్పు లేకుండా యథాతథంగా కొనసాగిపోతున్న సమాజం పట్ల ఆగ్రహ ప్రకటనగా షహీదా రాసిన కవిత 'ఆచరించం'.

'రోజూ మా భార్యలు అందించిన/చాయ్ కప్పుల్ని ఖాళీ చేస్తూనేం ఉన్నాం /వాళ్ళు చక్కగా ఉతికి ఇస్త్రీ చేసిన బట్టల్ని తొడుక్కొని/'మా' పన్ల మీద 'బైటకు' వెళ్తూనే ఉన్నాం' ఇంటిపని స్త్రీలదిగా బయట పని పురుషులదిగా చేయబడిన వ్యవస్థాగత ఏర్పాటు ఎంత అలవాటుగా కొనసాగిపోతున్నదో అందువల్ల సౌఖ్యం అనుభవిస్తున్న పురుషుల కోణం నుండి చెప్పబడింది. భార్య చాకిరీ అవసరం. కానీ భార్య అవసరమే లేని స్వంత పనులు, ప్రపంచం మగవాడికి ఉండటాన్ని సూచిస్తుంది

ఈ కవితాభాగం. ఇంట్లో 'పనులు తీరని' స్థితిలో స్త్రీలను మిగిల్చి పురుషులు బయట తిరగటం ఎలా చేస్తున్నారో అలాగే దేశంలో ఎన్ని సమస్యలున్నా, ప్రజలు నిర్బంధాల పాలవుతున్నా తెలిసీ పట్టించుకోకుండా తిరిగేస్తున్నారు అన్నది కవి ఆరోపణ. రెండూ స్వప్రయోజనాపేక్ష నుండీ చేసేవే. సాటి మనిషి కష్ట సుఖాలకు స్పందించగల సున్నిత మానవీయ స్పందనను కోల్పో యిన స్థితిని సూచించేవే. సావిత్రిలాగా ప్రశ్నించే స్త్రీలు, ధిక్కరిం చే స్త్రీలు ఇంట్లో పుట్టనంత కాలం, సమస్యలు, నిర్బంధాలు తమ ఇంటిదాకా రానంత వరకు ఇలా అందినకాడికి సౌఖ్యాల ను అనుభవిస్తూ ఉండటమే కానీ అసమానతల వ్యవస్థ-అది కుటుంబమైనా మొత్తం సమాజమైనా మారాలన్న ఆలోచనే లేని వర్గ స్వభావంపై వ్యంగ్య వ్యాఖ్యానంగా వచ్చింది ఈ కవిత.

బస్సును కేంద్రంగా చేసి స్త్రీ సమస్య గురించి షహీదా వ్రాసిన కవితలు రెండు ఉన్నాయి. 'మీకు బస్సు అంటే/ ఓ రవాణా సాధనం మాత్రమే / కానీ మాకు / ప్రతీక్షణం మేం 'స్త్రీలం' అని గుర్తుచేసే సాధనం 'అని మొదలవుతుంది బస్సులు కూడా (1994) కవిత. స్త్రీలు కావటం వల్ల బస్సు వాళ్లకు యుద్ధక్షేత్రమే అవుతుంది. స్త్రీల కోసం ప్రత్యేకించిన సీట్లను ఆక్రమించుకొన్న మగవాళ్ళను లేవగొట్టటానికి ఒక యుద్ధం. మీదపడి తాకాలను కొనే మగవాళ్ళను తప్పించుకొనటానికి కిటికీ సీటు కోసం మరొ క యుద్ధం. అందుకనే బస్సు దిగిన ప్రతిసారీ రిలీఫ్‌తో సుదీర్ఘం గా నిట్టూర్చటం జరుగుతుంటుందని అంటుంది.

ఈ కవితలో షహీదా రెండు కవితలను ప్రస్తావించింది. అవి రెండూ స్త్రీలు రాసినవి. సావిత్రి రాసిన 'బందిపోట్లు' ఒక కవిత. కిటికీ సీటు కోసం సాటి స్త్రీలతో పోటీపడ్డప్పుడు 'బందిపోట్లు' మమ్మల్ని విభజిస్తున్న అనుభూతి అంటుంది కవి. బందిపోట్లు ఎవరు అంటే పెళ్ళి ద్వారా స్త్రీల శరీరం మీద, జీవితం మీద పెత్తనం సంపాదించి కొల్లగొట్టే పురుషులు. పురుషులు ఒక అమ్మ కన్నబిడ్డలే. కని 'పాలిచ్చి పెంచిన జనంలో సగమే/ మమ్మల్ని విభజించి పాలిస్తోందని! అర్థం కావటమే బందిపోట్లు కవిత ముగింపు. మీదపడి మగవాళ్ల వికృతులనుండి తప్పుకొన టానికి స్త్రీలు కిటికీ సీటు కోసం ఘర్షణ పడే సందర్భంలో స్త్రీలను విభజించి పాలిస్తున్న మగవాడి వికృతి అర్థమైంది కవికి. చటుక్కున ఆ అనుభవాన్ని బందిపోట్లు కవితతో సంవదించు కోగలిగింది. ఇక ఈ కవితలో ప్రస్తావనకు వచ్చిన మరొక కవిత చూపులు జయప్రభ వ్రాసింది. బయటకు వెళ్ళినప్పుడు గుడి బడి బస్సుఅనే తేడా లేకుండా మగవాడి చూపులకు తన శరీ రం వస్తువు అవుతున్నప్పుడు స్త్రీ ఆ విషపు చూపులను ఎదుర్కొ నటానికి తన కళ్ళకు ముళ్ళ పదును ఇయ్యాలనుకొంటుంది. కళ్ళల్లోనే కాదు, స్త్రీకి వళ్లంతా ముళ్ళుండే రోజు వస్తుందని కవితను ముగించింది జయప్రభ. అంతరంగంలో ఎక్కడో దాగిన ఆ కవితా భావమే షహీదా కవితలోని 'జయప్రభ చూపుల్ని ప్రతిరోజూ ఆచరించడం' అన్న పాదంలోకి ప్రవహిం చింది. అక్కడ ఆగక జయప్రదను దాటి శరీరాల్ని సాయుధం చేయాలి అనుకొనటంలో ఉంది షహీదా ప్రత్యేకత. బస్సులు మగపెత్తనపు ప్రదర్శనా సాధనాలుగా వున్న బస్సులు రవాణాలో పురోగతిని మాత్రం సూచించే రోజు రావాలంటే స్త్రీలు చేయవలసిన యుద్ధాలను సంకేతించటం అది. బస్సులు మగపెత్తనపు ప్రదర్శనా సాధనాలుగా ఉన్నపుడు దానికి పరిష్కారంగా వచ్చినవి లేడీస్ స్పెషల్స్. షహీదా వ్రాసిన మరొక కవిత లేడీస్ స్పెషల్ (1995-96)లేడీస్ స్పెషల్‌లో ప్రయాణం పనితో అలిసిపోయినప్పుడు అమ్మాయి ఇచ్చే చాయ్ లా హాయి గా ఉంటుందట. అవయవాల్లా కాక ఆడవాళ్లు మనుషులుగా ఉండేట్లు చేస్తుంది. వాళ్ళ కదలికల్లో స్వేచ్ఛ జెండాలా ఎగురు తుంటుంది. విజయ ధరహాసం హక్కు గా ప్రకటితమవుతుంది. అయితే అంత హాయిని, ఆత్మ గౌరవాన్ని ఇచ్చే లేడీస్ స్పెషల్‌ను 'ఇంటా బయటా పితృస్వామ్యపు ఎడారిలో/నువ్వు మా ఒయాసి స్సువే / కానీ మా ఆశల ఆదర్శం కాదు' అని ప్రకటించటంలో ఉంది షహీదా దృక్పథం. మగపెత్తనాల నుండి, గొంగళి పురుగు ల్లాంటి మగవాడి చూపుల నుండి విముక్తికి తక్షణపోరాటం లేడీస్ స్పెషల్ కోసం పోరాటం. అయితే అది 'సమానత్వం కోసం వేసిన మొదటి అడుగే కానీ సమానత్వం సాధించినట్లు కాదు. స్త్రీలు పోరాడి సాధించుకొన్నదే అయినా ఒక సౌకర్యపు సందర్భమే కానీ అసమానత్వాన్ని రద్దుచేయగల సత్తా దానికి లేదు. అందుకే షహీదా 'మా లక్ష్యం ఒయాసిస్సుల అన్వేషణ కాదు/ఎడారిని నందనవనం చేయటం' అన్నప్రకటనతో కవితను ముగించింది. ఎడారిని నందనవనం చేయటం అంటే సమాజా న్ని సమూలంగా మార్చటం. ఒయాసిస్సుల అన్వేషణ సంస్కరణ. తక్షణ అవసరం. ఎడారిని పట్టించుకోకపోతే ఒయాసిస్సుల అన్వేషణలోనే కాలం గడిచిపోతుంటుంది. ఎడారిని నందనవ నం చేసుకొంటే ఒయాసిస్సులకోసం వెతుకులాట అవసరమే ఉండదు. ఎడారిని నందనవనం చేయటం అంటే విప్లవం. సంపూర్ణ సమానత్వాన్ని వాస్తవీకరించే మార్గం అది. స్త్రీలకు అనుసరించవలసిన మార్గం అదే అన్నది సూచన.

లేడీస్ స్పెషల్ కంటే కాస్త ముందు వ్రాసిన కవిత(1995) నో రిజర్వేషన్. స్త్రీ పురుష వివక్ష ఉన్నదని తెలిసాక వివక్ష నుంచి విముక్తి ఆకాంక్ష అవుతుంది. వివక్ష నుండి విముక్తికి సాయుధ పోరు మార్గం అని తెలిసి ఆచరణలోకి వెళ్లిన స్త్రీ కి స్త్రీకావటం వల్ల నిర్బంధం నుంచి మినహాయింపు ఏమీ ఉండదని చెప్పే చిన్న కవిత ఇది. వివక్షలను రద్దు చేయటానికి జరిగే ఏ పోరా టమైనా ఆధిపత్యాన్ని కలవరపెట్టేదే. దాని ఫలితం స్త్రీపురుష వివక్షలేకుండా పోరాటంలో ఉన్నవాళ్ల మీద నిర్బంధం ప్రయోగించటం, నిర్మూలించటం జరుగుతుంటుందని సూచన.

2002లో వచ్చిన 'ఆత్మ రక్షణ' అనే కవిత లో షహీదా ఎన్ కౌంటర్‌ను, కుటుంబ హింసను ఒకే రకమైనవిగా ప్రతిపాదించి స్వంత ఆస్తి వాటి మూలమని నిర్ధారిస్తుంది. 'అల్పాక్షరాలలో అనల్పార్థ రచన' అన్న సూత్రానికి ఉదాహరణ ప్రాయమైన కవిత ఇది.

నక్సలైట్లు సంఘవిద్రోహులు..
పోలీసులపై కాల్పులు జరిపారు
పోలీసులకు వేరేదారిలేదు
ఆత్మరక్షణార్థం కాల్పులు జరపక తప్పలేదు

'ఎన్‌కౌంటర్' కవితలోని ఈ మొదటి భాగం విప్లవకారులను పట్టుకొని కాల్చి చంపటాన్ని సమర్థించుకొనటానికి రాజ్యం సిద్ధం చేసుకొన్న కట్టుకథ. ఎప్పుడూ ఇదే కథ.

భార్య దుర్మార్గురాలు
భర్తపై తిరగబడింది
భర్తకిక వేరే దారి లేదు
'ఆత్మ' రక్షణార్థం ఆమెను తన్నక తప్పలేదు

'కుటుంబ హింస'.. కవితలోని ఈ రెండవ భాగం భార్యల మీద ఆధిపత్యాన్ని నిరూపించుకొనటానికి హక్కుగానో, అల వాటుగానో కొట్టే భర్తలను సమర్థించే కట్టుకథ.

రెండు భాగాలు సాదాసీదా ప్రకటనలు మాత్రమే. అయితే మొదటిభాగంలో ఎన్‌కౌంటర్, రెండవ భాగంలో కుటుంబ హింస అనే మాటలను సింగిల్ ఇన్వర్టెడ్ కామాలో చూపించటం ద్వారా రాజ్యం, కుటుంబం అనే రెండు వ్యవస్థల కుట్ర పూరిత అధికార స్వభావం వైపు వేలు పెట్టి చూపించింది. అంతే కాదు రెండు ప్రకటనలు ఒకదాని వెంట ఒకటి చేయటం ద్వారా రాజ్యహింస, కుటుంబ హింస ఒకే ఆధిపత్య మూలాలు అని చెప్పినట్లయింది. ఆ ఆధిపత్య మూలం స్వంత ఆస్తి అన్నది కవితకు ముక్తాయింపు. 'అంతేలే/'ఆత్మ'ల్ని స్వంతాస్తిలో కల్గిన వాళ్ల/కథలన్నీ ఒకే సిరాతో రాయక తప్పదుగా' 'ఆత్మరక్షణ' స్వంత ఆస్తి రక్షణ కవచమే అయినప్పుడు రెండు వ్యవస్థలను మానవీయం, ప్రజాస్వామికం చేయటానికి విప్లవం ఒక్కటే మార్గమని సూచిస్తుంది కవి.

'మూడు బావులూ, కొన్ని ప్రశ్నలు' కథన కవిత. నాలుగు దృశ్యాల కథనం. ఒక దృశ్యం మీద నుండి మరొక దృశ్యం మీదకు కెమెరాను మళ్లిస్తూ, వ్యాఖ్యానాన్ని వినిపిస్తూ సాగే దీర్ఘ కవిత చిన్న డాక్యుమెంటరీ సినిమాలా ఉంటుంది. పిండ దశ లోనే హత్య చేయబడుతున్న ఆడ శిశువు సమస్య కేంద్రంగా వచ్చిన కవిత ఇది. ఆడ చెత్త మగ మాణిక్యం అన్న వివక్షా పూరిత పితృస్వామిక వ్యవస్థా స్వభావం ఆధునిక యుగంలో ఎంత క్రూర దశకు చేరిందంటే అమ్నియోసెంటిసిస్ పరీక్ష ద్వారా గర్భస్థ శిశువు ఆడదైతే పిండ దశలోనే చంపేసే దశకు చేరింది. భ్రూణ హత్యల ద్వారా పుట్టకుండానే మరణించే ఆడ శిశువులను జనాభాలో లెక్కకే రాకుండా పోతున్నందున అదృశ్య మహిళలు అంటున్నారు. భారత ప్రభుత్వ కుటుంబ సంక్షేమ శాఖ నివేదిక ప్రకారం 1984 నుండి 91 మధ్య కాలంలోనే మూడు మిలియన్ల భ్రూణ హత్యలు నమోదయ్యాయంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకొనవచ్చు. ఈ సమస్యను వస్తువుగా చేసి అప్పుడే యుద్ధ శిశువులాంటి కవితలు వచ్చాయి. పదిహేను ఏళ్లలో ఆ సమస్య తీవ్రమైందే కానీ తగ్గలేదు. గర్భస్థ ఆడశిశు హత్యలను వ్యవస్థీకృతం చేసే వైద్యవ్యాపారం గొలుసు సంబంధా లతో జాతీయస్థాయి ప్రాజెక్ట్ అయింది. ఈ నేపథ్యంలో ఆడ పిండాలను తల్లి గర్భం నుండి పెకిలించి పాడుబడ్డ బావుల్లోకి విసిరెయ్యటం మామూలైపోయింది. ఈ నేపథ్యంలో చూడాలి 2006 లో వచ్చిన ఈ 'మూడు బావులూ, కొన్ని ప్రశ్నలు' కవితను. ఈ కవితలో మొదటి దృశ్యం బోరుబావిలో పడిన ఒక పిల్లవాడిని రక్షించటం. ప్రభుత్వ రక్షణవ్యవస్థలన్నీ ఆ పనిలో నిమగ్నం అయితే దృశ్యమాధ్యమాలన్నీ ఆ క్రమాన్ని 24 గంటల ఛానల్స్ కోసం చిత్రీకరిస్తూనే ఉన్నాయి. ఉత్కంఠ తో టీవీల ముందు కూర్చుని ప్రజలు చూస్తూనే ఉన్నారు. వార్తా పత్రికలు కథనాలు ప్రచురిస్తూనే ఉన్నాయి. మొత్తానికి ఆ పిల్లవాడు రక్షించబడ్డాడు. రెండవ దృశ్యం యాభై ఆడశిశు పిండాలు ఉన్న బావి. 'సైన్యం లేదు, ఆక్సిజనూ లేదు /సానుభూతి లేదు, ఆకాం క్షా లేదు/కనీసం ఆశ్చర్యం కూడా లేదు/ఆఖరికి తల్లిదండ్రులు కూడా లేరు' పత్రికలలో ఒక మూల వార్తగా మిగిలిన ఆడ పిండాలు అవి. ఆడ శిశు హత్యలకు సమాజంలో సమకూడిన సమ్మతిలోని దుర్మార్గాన్ని, క్రూరత్వాన్ని చూపిస్తుంది ఈ భాగం. ఒక శిశువు రక్షణకు ప్రభుత్వ యంత్రాంగం అంతా దిగివచ్చే పరిస్థితి, 'ఆహారం ఆక్సిజనే కాక ఆ బావిలోకి దేశప్రజల సాను భూతీ/ ఆకాంక్షా కూడా ధారళంగా ప్రవహించే" పరిస్థితి ఉండగా మరి అనేకమంది శిశువులకు అవి ఎందుకు కరువు అవుతున్నాయి ? అన్న ప్రశ్నను వేస్తుంది కవి ఈ రెండు దృశ్యాలను ఒక దాని వెంబడి ఒకదానిని చూపటం ద్వారా. ఆడ పిల్లల పట్ల అమలవుతున్న వివక్ష గురించి ఎవరికీ వాళ్ళే ఎంతైనా ఆలోచించవచ్చు. అయ్యో అయ్యో అని వాపోవచ్చు. అయితే షహీదా పాఠకులను ఈ వివక్షను పెంచి పోషించే వ్యవస్థల గురించి ఆలోచించండి అంటూ మూడవ దృశ్యంలోకి ప్రవేశ పెడుతుంది.

'అదొక క్లినిక్' అని మొదలవుతుంది ఆ దృశ్యం. 'తల్లి కడుపులో అమాయకంగా దాగున్న ఆడ పిండాలని' కనిపెట్టి పెకిలించి పారేసే కేంద్రం. 'పెద్ద డబ్బు సంచీ మనసున్న డాక్టర్లు' ఆ పని చేస్తూ ఉంటారు. మార్క్సిస్టు తత్వశాస్త్రంలో డబ్బు సంచీ అన్నది పెట్టుబడిదారుకు మరొక పేరు. కొనటం అమ్మటం అనే ప్రక్రియలో లాభాల సముపార్జన ఉంటుంది. కొనటానికైనా అమ్మటానికైనా కావాల్సినది డబ్బే. లాభమూ

డబ్బే. డాక్టర్లను పెద్ద డబ్బు సంచీ మనసున్న వాళ్ళు అంటున్న దంటే డబ్బుతో చదువును కొని డబ్బుచేసుకొనటానికి వైద్యాన్ని వ్యాపారంగా చేస్తున్నవాళ్లు అని చెప్తున్నట్లు. మనిషి, మనసు అన్నీ మాయం అయి డబ్బు సంచీ రూపం ఎత్తినప్పుడు జరిగేది హింసా పూరితమూ అమానవీయమూ అయిన దోపిడీపీడనలే. ప్రాణం పోయవలసిన వైద్యులను గర్భస్థ శిశుహంతకులుగా చేస్తున్నది డబ్బుసంచీ మనసు. పంజాబ్ లోని ఆ క్లినిక్ దగ్గరలోనే ఉందని పిండాల బావి ఉందని చెబుతూ 'కష్టపడి వెతుక్కోనవసరం లేకుండా పెద్దయ్యాక ఏ సుయ్యోగొయ్యో చూసుకోకుండా' తమ డబ్బుసంచీ మనసుతో కృడి డాక్టర్లు పుట్టబోయే ఆడపిల్లలకు ముందే గోతులు తవ్వి వాటికాడ కూచుని ఉంటారు' అన్న వాక్యాలలో డాక్టర్లు గోతికాడ నక్కలు అన్న ధ్వని వినబడుతుంది. ఇప్పుడు మొదటి బావిని కూడా ఈ దృశ్యంలోకి తెచ్చి బావుల దుర్ఘటనలపట్ల స్పందన లోని తేడాకు స్త్రీపురుష జనాభా నిష్పత్తిలో వ్యత్యాసాలకు మధ్య సంబంధాన్ని గురించి ఆలోచించమంటుంది. నాలుగో దృశ్యంలో మరొకబా వి. గాలీ వెలుతురూ లేని కాలూ చేయీ మెదదు ఆడని ఇరుకిరు కు బావి అది భారతదేశం అనే పేరుతో ఉన్న స్వంత ఆస్తిబావి. అందులోకి ఓ వందకోట్ల మందిని విసిరేసిన బలమైన చేతులు భూస్వామ్య పెట్టుబడి దారీ ఆర్థిక నిర్మాణాలు. ఆ బావులనుండి ఎలాగైనాబయటపడి ఆ రెండు చేతులనూ నరికేసి ఆ బావిని పూడ్చేయ్యటం కవి కామన. యాభై ఆడపిండాలే కాదు బతికి తీరాల్సిన వాళ్ళందరూ ఆ బావిలో పడో, తోసెయ్యబడో అకారణంగా ప్రాణాలు కోల్పోకుం డా ఉండాలంటే జరగాల్సింది అదే అన్న నిశ్చితాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ ముగుస్తుంది ఈ కవిత. స్త్రీ పురుష వివక్షతో మొదలుపెట్టి దాని పరిష్కారాన్ని మొత్తం రాజకీయార్థిక వ్యవస్థలలో రావలసిన పునాది మార్పుతో అనుసంధానించి చూపిన కవిత ఇది.

'ఇక చాలు' అనే కవిత కాశ్మీర్ సందర్భం నుండి లైంగిక అత్యాచార ఘటన కేంద్రంగా వ్రాయబడింది(2007) కాశ్మీర్ భారతదేశంలో భాగంగా ఉండాటాన్ని కాదనే ఉగ్రవాదుల నుండి కాశ్మీరును రక్షించటానికి ప్రవేశించిన భారతదేశ సైన్యపు పడగ నీడలో ప్రజలు పడిన బాధలు, ఎదుర్కొన్న నిర్బంధాలు, హింస అదంతా పెద్ద చరిత్ర. రాజ్యం ఎక్కడ ప్రవేశించినా ఆధి పత్య స్థాపనలో భాగంగా స్త్రీల మీద అత్యాచారాలు చరిత్ర పొడగునా కొనసాగుతూనే ఉన్నాయి. కాశ్మీర్ అందుకు మినహా యింపు కాదు. ఉగ్రవాదుల జాడలు చెప్పమనో , ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయనో కాశ్మీర్ ప్రజలు సైనికుల వేధింపులకు గురవుతుంటే స్త్రీలు అదనంగా అత్యాచారాలకు గురికావలసి వచ్చింది. అలాంటి ఘటనలు ఇకచాలు అంటూ కునన్ అనే గ్రామంలో స్త్రీలు ప్రతిఘటించటం, గ్రామమంతా కలిసి వచ్చి నిలబడటం ఒక వాస్తవ ఘటన.దాని చుట్టూ అల్లిన కథాన కవిత 'ఇకచాలు'.

మొత్తంగా షహీదా కవితలు స్త్రీల సమస్యను వర్గ వైరుధ్యాల సమాజపు సంబంధంలో అర్థం చేసుకోనాలని స్త్రీల సమస్యలకు తత్కాల పరిష్కారాలు ఎన్ని రూపొందినా అవి సంస్కరణలు, పై పై పూతలే కానీ అసలు జబ్బును గుర్తించేవి, తొలగించేవీ కావని వాటిని తక్కువ చేయకుండానే చెప్తాయి. అసలు జబ్బు ఆస్తులు, సంపదలు కొందరి దగ్గర కూడెయ్యబడి అనేకులు అభాగ్యులై అలమటించేట్లు చేస్తున్న వర్గ సమాజంలో ఉన్నదని అర్థం చేయిస్తాయి. దిగుడు బావి లాంటి, ఊడల మర్రి లాంటి ఆ వ్యవస్థను పూడ్చటమైనా, కూల్చటమైనా విప్లవోద్యమం వల్లనే సాధ్యమని నమ్మబలుకుతాయి. ❑

## తొలితరం రచయిత్రుల కథల్లో..

(17వ పేజీ తరువాయి)

ధిక్కరించగల్గాలి. ఈ కథలో యువతి చేసినపని అదే. ఆమె మొక్కవోని ధైర్యంతో "నా కిరువురు అన్నలు గలరు. ప్రతిరోజు నన్ను ముద్దాడుకొని ఆశీర్వదించి శాంతి సమరానికి పంపుచున్నారు. తరతరాల నుండి దాస్యాన్ని అనుభవిస్తున్న మాతృభూమి విముక్తికోసం విదేశీ వస్తువులనే విషానికి ఆహుతి అవుతున్న నీలాంటి సోదరున్ని రక్షించుకోవడానికి ఒక ముద్దు ఇవ్వలేనా? నీవు నా మూడవతోబుట్టువు. ఒకటి కాదు, ఎన్నైనా పొందమని" ఆమె తన సంసిద్ధతను వ్యక్తంచేసింది. ముద్దు అతని దృష్టిలో ఒక లైంగిక చర్య. ఆమె దృష్టిలో స్నేహాన్ని సానుభూతిని, అప్యాయతను వ్యక్తీకరించే చర్య. ముద్దును దాని లైంగికత్వముద్రనుండి విముక్తం చేసి ఒక మానవీయ స్పందనగా నిలబెట్టటం ఆ యువతి వికాసానికి ఔన్నత్యానికి గుర్తు. ఉద్యమాలలో స్త్రీల భాగస్వామ్యం జాతీయోద్యమాన్ని, ఆత్మాభిమానాన్ని కల్పుకొని సాగాల్సిన స్థితి గురించి ఈ కథ చెప్పింది. తాడినాగమ్మ రాసిన 'ఒక ముద్దు' కథలో దేశీయస్వాతంత్ర్య ఆకాంక్షతో పాటు, విదేశీ వస్తు బహిష్కరణ పెనవేసుకున్నాయి. స్త్రీలను జాతీయోద్యమంలోకి సమీకరించ టమే కాక సామ్రాజ్యవాద సంస్కృతిని వ్యతిరేకించే చైతన్యాన్ని స్త్రీగా స్వతంత్ర వ్యక్తిత్వ చైతన్యాన్ని కూడా రచయిత్రి ఇందులో చూపించారు. ఈ విధంగా స్త్రీ కథలు జాతీయోద్యమ ఆదర్శాల ను ఆయా ఉద్యమాలలో క్రియాశీలక భాగస్వామ్యాన్ని చైతన్య చరిత్రను నమోదు చేశాయి. ❑

ఉపయుక్త గ్రంథాలు : 1. తాగినాగమ్మ కథలు, రచనలు సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్, 2. తెలుగు సాహిత్యంలో స్త్రీ వాద విమర్శకురాలు డా. కందాల శోభారాణి 3. తెలుగు సాహిత్య విమర్శ- స్త్రీల కృషి- డా. కందాల శోభారాణి 4. స్త్రీల కథలు-5 1901-1980- డా.కె.లక్ష్మీనారాయణ.

# మోనోగమీ ఒక భ్రమ





డా. కె.ఎన్. మల్లీశ్వరి

జాతీయ కార్యదర్శి, ప్రజా స్వామిక రచయిత్రుల వేదిక


**మానవ ప్రగతికి 'సమ సమాజం' ఒక లక్ష్యం. స్త్రీ పురుష సంబంధాలకి 'మోనోగమి' ఒక లక్ష్యం, ఒక ఆదర్శం. 'ఒక స్త్రీకి ఒకే పురుషుడు, ఒక పురుషునికి ఒకే స్త్రీ' అన్నది ఈ పరిణామంలో అత్యంత ఆధునికం, నాగరీకం, ఆదర్శం అయిన దశ. ఇది మానవ సహజాతపు మంచి చెడ్డలను బాలెన్స్ చేసే దశ. అయితే ఆదర్శాలను పాటించడం ఐచ్ఛికమే తప్ప నిర్బంధం కాకూడదు.**

రెండు నెలల కిందట, మధ్యాహ్నం ఒంటి గంట సమయం. విశాఖపట్నం, ఆర్కే బీచ్ రోడ్‌లో నుంచి ఇంటికి వస్తున్నాను. కురుపాం సర్కిల్ వద్దకి వచ్చేసరికి నా టూ వీలర్‌కి పెద్ద గుంపు అడ్డం వచ్చింది. ఒక మూల నుంచి తోవ చేసుకుని వెళ్తూ యథాలాపంగా గుంపులోకి చూశాను. వెంటనే నా బండికి బ్రేక్ పడింది. నమ్మశక్యం కాని ఆ దృశ్యాన్ని చూస్తూ బండి తీసి పక్కన పార్క్ చేసి గుంపులో చొరబడ్డాను. చుట్టూ మూగిన మా మధ్య ఒక బైక్ ఆగి ఉంది. స్టాండ్ వేసి ఉన్న ఆ బండి వెనక సీటు మీద అటొక కాలు ఇటొక కాలు వేసుకుని, పాతిక – ముప్పై మధ్య వయసున్నామె కూర్చుని ఉంది. ఫాషనబుల్‌గా కనిపిస్తున్న ఆ అమ్మాయి, వేసుకున్న చుడీదార్, భుజాల వద్ద పర్రున లాగితే చిరిగినట్లు ఉంది. చున్నీ నేల మీద జీరాడు తోంది. నల్లటి ఒత్తైన జుత్తుని పట్టుకుని





మాటిమాటికీ లాగినట్లు క్లిప్పులన్నీ ఊడిపోయి చెల్లాచెదురుగా కనబడుతోంది. ఆ వెనక సీట్లో ముందుకు వంగిపోయి రెండు చేతులతో ఛాతీ కప్పు కుంటూ ఉంది. నల్లమబ్బులాంటి జుట్టు మొహాన్ని కప్పుతోంది.

ఉండుండి ఆ జుట్టుని మెలిపెడుతూ వీపు మీద పిడి గుద్దులు వేస్తూ దాదాపు అదే వయసున్న ఒక యువకుడు. 'ఏంటిది?' నా గొంతులో కోపం కన్నా దుఃఖం పలికింది. అలా అడిగిన నా వంక క్రూరంగా, ఒక పిచ్చి ఉద్రేకపు చాంచల్యంతో అతను చూసిన చూపుకి ఒళ్ళు జలదరించింది. అతని చేతిలో బెదిరింపుగా ఊగుతోన్న హెల్మెట్ భయపెడుతోంది. చుట్టూ పలు రకాల వ్యాఖ్యానాలలో నుంచి విషయం గ్రహింపునకు వచ్చింది.

వివాహిత రాలైన ఆమె, ఆఫీసుకు వెళ్తున్నానని చెప్పి, తన స్నేహితునితో రహస్యంగా గడిపి వస్తూ పట్టుబడింది. వాళ్లిద్దరు ఎక్కిన బైక్‌ని ఆమె భర్త వెంటాడి ఇక్కడ ఆపాడు. ఆమె స్నేహితుడు ఒక నిమిషం తచ్చాడి తాళాలతో సహా బండి అక్కడే వదిలేసి ఉడాయించాడు. అట్లా ఉడాయిస్తున్నపుడు అతన్ని పట్టుకోవడానికి ఆ భర్త గానీ చుట్టూ సమూహం కానీ ఏ మాత్రం ప్రయత్నించలేదు. నేరస్తురాలు దొరికాక నిమిత్త మాత్రుడితో పనేముంది! ఇక అక్కడ, ఆమె మీద ఆన్ ది స్పాట్ భర్త గారి ఖాప్ పంచాయితీ మొదలైంది.

విశాఖపట్నం వంటి నాగరికమైన, ఆధునికమైన ప్రదేశంలో, చదువుకుని, మంచి ఉద్యోగం చేసుకుంటున్నట్లు కనిపిస్తున్న ఆమె మీద అంతటి దాడిని అలా స్వయంగా చూడటం నన్ను చాలా కలవరపెట్టింది. నిర్విచారంగా చూస్తున్న పౌరసమాజం సాక్షిగా హింసాపర్వం నిరాటంకంగా సాగడం మరింత ఆందోళనకు గురిచేసింది. అయితే చుట్టూ జనాలు మాత్రం అతన్ని చాలా కోపంగా మందలిస్తున్నారు. ఎందుకోసమంటే – 'ఇదేంటి ఇలా రోడ్డు మీద!? ఇంటికి తీసుకెళ్ళి చంపుకుంటావో మానతావో నీ ఇష్టం. ట్రాఫిక్‌కి ఇబ్బంది కలిగిస్తూ ఇక్కడ ఇలా జరగడానికి వీల్లేదు.' ఆ అమ్మాయి క్షేమం కోసం, రక్షణ కోసం, కనీసం ఈ దెబ్బల నుంచి తప్పించడం కోసం, వాళ్ళనీ వీళ్ళనీ సాయం రమ్మని అడుగుతున్న నన్ను చుట్టూ మూగిన గుంపు, ముఖ్యంగా ఆడవాళ్ళు చిత్రంగా చూశారు. ఆమె ఎంతటి సామా జిక ద్రోహానికి ఒడి కట్టిందో నాకు అర్థం చేయించే ప్రయత్నం చేసారు. రేపటి నుంచీ అతను ఎలా తలెత్తుకు తిరుగుతాడని అల్లాడిపోతున్నారు. నా మిత్రులైన మహిళా సంఘాల నాయకు లకు ఫోన్ చేయడానికి ప్రయత్నిస్తున్న సమయంలో – అతను అదే స్థితిలో ఉన్న ఆ అమ్మాయి, సరిగా కూచుందో లేదో కూడా చూడకుండా సర్రున బండి పోనిచ్చాడు. కళ్ళ ముందు జరిగిన ఈ ఘటన నన్ను పట్టుకు వదలడం లేదు. ఇటీవల నేను రాసిన 'నీల' నవలలోని చంద్రకళ పాత్ర నా కళ్ళ ముందుకి వచ్చినట్లుగా అనిపించింది. వైవాహికేతర సంబంధం ఉన్న చంద్రకళ, తన స్నేహితుడు ఆటో రాజుతో కలిసి గడుపుతున్న సమయంలో – ప్రత్యక్షంగా పట్టుబడి భర్త, అతని బంధువుల చేత హత్యకు గురైన ఘటన ఈ నవలలో ఉం టుంది. వైవాహికేతర సంబంధాలు, స్వేచ్ఛాయుత ప్రేమ సం బంధాల కోణం ఈ నవలకి ఉంది. రాసినపుడు ఉండే అం తస్సంఘర్షణకు తోడు, పబ్లిష్ అయ్యాక కొన్నిరకాల సాహిత్య, సామాజిక ఒత్తిళ్లకు గురయ్యాను. విమర్శ పేరిట రచనని అడ్డం పెట్టుకుని, రచయితగా, మనిషిగా నాకుండే డిగ్నిటీని అవ హేళన చేసిన సందర్భాలను ఎదుర్కొన్నాను. రోజు వారీ జీవితం లో నన్ను కలిసిన చాలా మంది నా మీద సాగుతు న్న వ్యతిరేక ప్రచారాలను ప్రస్తావించినపుడు 'అవి నాకు అనవసరం' అని చెప్పడానికి చాలా సమయం వెచ్చించవలసి వచ్చింది. స్త్రీ పురు ష సంబంధాలు ప్రస్తుతం మార్కెట్ సరుకు కనుక పెట్టుబడిదారీ వ్యవస్థకి లొంగిపోయి రచన చేసిన తప్పుకి అంటగట్టబడ్డాను. ఈ రచన విషయంలో కొందరు సన్నిహితులు మౌనం వహిం చారు. మిత్రులు దూరం జరిగారు. అపరిచయస్తులు కొందరు నిప్పులు చెరిగారు. ఒక్కమాటలో చెప్పాలంటే నాజూకు వెలివే తల పాలయ్యాను. నిజాయితీగా వస్తు శిల్పాలని తీవ్రంగా విమ ర్శ చేసినవారు, బాగా ఇష్టపడి గాఢమైన అభిమానంతో హత్తుకు న్నవారు ఎక్కువమందే ఉండటం వల్ల రచయితగా నేను మిగి లాను. కానీ ఒక రచన చేసిన పాపానికి నా భావోద్వేగాలు, నా సమయం, నా శ్రమ, నా సామాజిక సంబంధాలు – అదనంగా ఎందుకు పణం పెట్టవలసి వచ్చింది?

ప్రత్యక్షంలోనూ పరోక్షంలోనూ కూడా కట్టుబాటుని మీరిన బంధాల చుట్టూ ఎందుకు ఇంత హింస గూడు కట్టుకుని ఉంది!? భర్త కాని వ్యక్తితో 'స్నేహం' చేసిన ఏ వివాహిత మహిళనూ భారతీయ సమాజం క్షమించదు. ఇక్కడ 'స్నేహం' అన్నపదాన్ని విశేషమైన అర్థంలోనే వాడుతున్నాను. స్త్రీ అయినా పురుషుడు అయినా ఒక మనిషికి మరో మనిషితో ఉండేది ముందుగా మానవ సంబంధమే. శారీరక సాన్నిహిత్యం అనేది స్నేహపు తీవ్రతకో, అపురూపతకో, స్నేహపు యాదృచ్ఛికతకో, తక్షణ ఉద్వేగాలకో, శారీరక అవసరాలకో మరింకే అంశాలకో ఒక వ్యక్తీకరణ రూపం మాత్రమే. ఇటువంటి స్నేహాలను చట్టాలు నియంత్రించజాలవు. చట్టాలు, నేరం – న్యాయం పరిధిలో వ్యక్తుల హక్కులను కాపాడతాయి తప్ప వ్యక్తిగత స్వేచ్ఛను, ఇష్టపూర్వక చర్యలను పరిధి దాటి వెళ్లి అడ్డుకోవు. ఇటువంటి పరిధికి, స్త్రీ పురుష సమానత్వానికి, స్త్రీ స్వాభిమానా నికి వ్యతిరేకంగా ఉన్నందువల్లే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 497 'అడల్టరీ' రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించి రద్దు చేసింది. 158 ఏళ్ల కిందటి కాలం చెల్లిన చట్టాన్ని వదుల్చుకోవడం ప్రజాస్వామికమైన ముందడుగు. తీర్పు ఇచ్చే సందర్భంలో సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు చాలా కీలకమైనవి. Any provision of law affecting individual dignity and equality of women invites wrath of constitution. Its time to say that husband is not the master of wife. Legal soverignity of one sex over other sex is wrong. కానీ ధర్మాధర్మాలను కాపాడటానికే పుట్టామని నమ్మే స్వయం ప్రకటిత వ్యవస్థలు, సమాంతర నైతిక వ్యవస్థలు తప్పొప్పులను నిర్ణయిస్తాయి. ఈ స్వయం ప్రకటిత ధర్మ, నీతి వ్యవస్థలు గుంపుగా కూడి పనిచేస్తూ ఉండొచ్చు, వ్యక్తిమాత్రం గానూ పని చేస్తూ ఉండొచ్చు. తండ్రి, భర్త, కొడుకు, యజ మాని, మత పెద్దలు, కులపెద్దలు, గ్రామ పెద్దలు, రాజ్యాంగాన్ని తమకి నచ్చినట్లు ఆడించే రక్షణ వ్యవస్థలు కలిసి ఈ ధర్మా ధర్మాలు, నీతి అవినీతులు, మంచి చెడ్డల త్రాసు పట్టుకుని సిద్ధంగా ఉంటాయి. ఈ త్రాసు పేద వారు, స్త్రీలు, దళితులు, మైనార్టీలు తదితర అణచివేత వర్గాలవైపు ఎపుడూ మొగ్గదు. పైగా వీరికి బలవంతంగా అంటగట్టబడిన నీతులు ఆధిపత్య వర్గాల విషయంలో ఉదారమైన మినహాయింపులను ఇస్తాయి.

ఈ శక్తులు చట్టాలకన్నా బలమైనవి. చట్టానికి రుజువు ఉండాలి. అది సమగ్రమై ఉండాలి. కానీ ఈ శక్తులకి అధిపత్యం ఒకటి చాలు మనుషులను నియంత్రించడానికి. చట్టంకన్నా బలంగా, చట్టంకన్నా త్వరగా స్పందించే వీటి బారిన పడినవారి హింసను చూస్తూనే ఉన్నాం. ఫలానా ప్రాంతం, ఫలానా వర్గం అంటూ లేకుండా అన్నిచోట్లా ఇటువంటి హింస చూడటం నిత్యకృత్యమైంది. ఈ ధర్మ, నీతి శక్తుల చేతిలో పడిన ఇటువంటి 'ప్రత్యేక స్నేహితులు' గౌరవప్రదమైన జీవితం మీద ఆశలు వదులుకోవాల్సిందే. పట్టుబడిన స్త్రీలను నగ్నంగా మార్చి ఊరేగించడం, చెట్టుకి కట్టేసి కొట్టడం, ఆమె మీద పదేపదే

అత్యాచారం చేయించడం, ఆమెని నిలువునా మంటల్లో తగల బెట్టడం, జరిమానాలు విధించడం, అణచివేత వర్గాల పురుష డినయితే లైంగిక అవయవాలను కోసి మరీ చంపడం – వంటి మధ్యయుగాల హింసని వర్తమానంలో చూస్తూ ఉన్నాం. ఇక వెలివేయడం, హీనపరచడం, నీతి లేని వారిగా చీత్కరించడం వంటి మానసిక క్షోభకి అంతే ఉండదు. అత్యంత సహజమైన శారీరక, మానసిక భావోద్వేగాలను కలిగి ఉన్నందుకు గానూ ప్రాణాలనే ఒడ్డాల్సిన అగత్యం ఎందుకు ఏర్పడుతోంది? వైవాహికేతర సంబంధం కలిగి ఉన్న స్త్రీ తన భర్తకి పట్టుబడితే హింసకి గురయ్యేది ఆమే. వైవాహికేతర సంబంధం ఉన్న పురుషుడు భార్యకి పట్టుబడితే హింసకి గురయ్యేది పురుషుడు కాదు అతని స్నేహితురాలు. ఈ భార్య, భర్తకి ఉన్న శక్తికి లోబడి పోయి, అటువంటి శక్తి లేని తనవంటి స్త్రీ మీద బంధుగణంతో కూడి దాడులు చేయించడం తరుచుగా చూస్తున్నాం. ఇక్కడ స్త్రీ ఇష్ట పూర్వకంగా చరిస్తే స్త్రీయే బాధితురాలు, పురుషుడు ఇష్ట పూర్వకంగా చరించినా స్త్రీయే బాధితురాలు. ఇటువంటి వివక్ష అనేక రూపాల్లో కనిపిస్తూ ఉంటుంది. స్త్రీలు పట్టుబడినపుడు అత్యంత కఠినంగా శిక్షించడానికి పూనుకునే పురుషుడు, తన వంతు వచ్చేసరికి స్వరం మార్చుతారు. ఇటీవలి 'మీ టూ' ఉద్యమం ఇందుకు ఉదాహరణ. తమపై జరిగిన లైంగిక వేధిం పులను చెప్పుకోడానికి భయపడో, సంకోచించో మరెందుచేతనో ఇన్నాళ్ళూ మౌనంగా ఉన్న అనేకమంది స్త్రీలు 'మీ టూ' వేదిక మీద సమూహంగా గొంతు విప్పారు. ఆ కాస్త స్పేస్‌ని కూడా భరించలేనివారు, వినలేని వారు, ఎదురుదాడులకి దిగడం గమనించాం. తమ హక్కుల గురించి, తమ వాయిస్ వినిపించే స్పేస్ గురించి, స్త్రీల ఆరోపణలకి ఉండాల్సిన సాక్ష్యాల గురించి, స్త్రీలు అత్యంత ప్రజాస్వామికంగా ఆలోచించాల్సిన ఆవశ్యకత గురించి మగవారు మాట్లాడారు. 'ఇష్ట పూర్వక స్నేహం' కలిగి ఉన్న స్త్రీని గౌరవించలేని పురుష సమాజం, మీటూ సందర్భంగా తాము చేసిన 'లైంగిక వేధింపుల' గురించి మినహాయింపులు అడగడం ఒక ఐరనీ.

ఆటవిక దశ నుంచి మనుషులు నాగరికత వైపు ప్రయాణం చేస్తూ ఉన్నారు. ఈ చలనశీలత వల్ల సమాజం జడంగా ఉండదు. మనకి నచ్చినా నచ్చకున్నా మార్పులు సంభవిస్తూనే ఉంటాయి. సమాజపు ఉనికిలో ఉన్న ప్రతీ వ్యవస్థా ఆ మార్పుల తాకిడికి గురి కావలసిందే. దీనిని బలంగా నమ్మే ప్రగతిశీల శక్తులు కుటుంబ వివాహ వ్యవస్థల్లో వచ్చే మార్పుల్ని తట్టుకోలేరు. సమాజంలో అన్ని వ్యవస్థలూ మారిపోవాలి. స్త్రీ పురుష సంబంధాలు మాత్రం యథాతథంగా ఉండాలి అనుకోవడం తాము నమ్మిన పై సూత్రాలకి విరుద్ధం. మానవ ప్రగతికి 'సమ సమాజం' ఒక లక్ష్యం, స్త్రీ పురుష సంబంధాలకి 'మోనోగమి' ఒక లక్ష్యం, ఒక ఆదర్శం. 'ఒక స్త్రీకి ఒకే పురుషుడు, ఒక పురు షునికి ఒకే స్త్రీ' అన్నది ఈ పరిణామంలో అత్యంత ఆధుని కం, నాగరీకం, ఆదర్శం అయిన దశ. ఇది మానవ సహజాతపు మంచి చెడ్డలను బాలెన్స్ చేసే దశ. అయితే ఆదర్శాలను పాటిం చడం ఐచ్ఛికమే తప్ప నిర్బంధం కాకూడదు. ఇపుడు సమాజం మోనోగమీలో ఉన్నట్లు నమ్మింప జూస్తుంది కానీ అది నిజం కాదు. ఈ మోనోగమీ ఒక మేడిపండు. ఇక్కడ ఏదో ఒక స్థాయిలో నిర్బంధం, అవసరం, పెత్తనం లాంటి లక్షణాల అసమ స్థాయి బంధాలే కనపడతాయి. ప్రేమ, స్వేచ్ఛలు సమస్థాయి బంధాలకి ప్రాతిపదికలు కావాలి. మనుషులు భయం నుంచో అభద్రత నుంచో కాక ఒక స్థిమితం నుంచి ఒకరినొకరు కోరుకోగలగాలి. ఇక్కడికి చేరుకోవడానికి మానవ సమూహాలకి చాలా శిక్షణ అవసరం. ఆ శిక్షణని భయపెట్టి, బంధించి, బోధించి ఇవ్వగలిగేది కాదు. ఒక ప్రసిద్ధ తెలుగు రచయిత కొడవటిగంటి కుటుంబరావు చెప్పినట్లు 'చట్టాలేవీ స్త్రీకి రక్షణ కల్పించలేవు. మనుషుల్లో మానసిక విలువల సంస్కారం పెరిగే కొద్దీ న్యాయాన్నీ నీతిని అమలు చేసే చట్టాలు తగ్గిపోవాలి. అపుడు చట్టం చేసే పనిని సంస్కారమే చేస్తుంది'. ❑

## చరిత్ర తిరగరాయడమే లక్ష్యం!

(23వ పేజీ తరువాయి)


నెలల బిడ్డ మీద కూడా దాడి జరిగితే ప్రభుత్వానికి చీము, నెత్తురు ఉన్నట్టా, లేనట్టా! ఉన్నదో లేదో తెలయాలి. రాణి పద్మావతి 'సతి మంటల'పై ఉన్న శ్రద్ధ స్త్రీల రక్షణకి ఎందుకు లేదు. చరిత్ర పునరావృతమవుతోంది. స్త్రీలు బాధితులు మాత్రమే గాదు. అవసరమైతే చీపురు పుచ్చుకుని చెంగు కుచ్చిళ్లు దోపి తిరగబడగలరు. స్త్రీ అంటే రవివర్మ చిత్రాల్లోని సౌందర్య రాశి మాత్రమే కాదు. బతుకు మీద దాడి జరిగితే దాన్ని తిప్పికొట్టే భద్రకాళి కూడా. అదే జరుగుతోంది. ఇప్పుడదే జరుగుతోంది. హింసకు వ్యతిరేకంగా వర్నిక ముందు తిరగబడింది. గుర్మెహర్ కౌర్ నిలబడింది. బెనారస్ హిందూ యూనివర్శిటీ అమ్మాయిలు లాఠీ దెబ్బలను కూడా లెక్క చేయలేదు. నేడు రాష్ట్రంలో మహిళలు తిరగబడుతున్నారు. అశ్లీల కేసు, ఆడదాన్ని అంగడి సరుకుగా చిత్రించే రామ్‌గోపాల్‌వర్మ అరెస్టు చేస్తే గాని శాంతించమని, హింసను అరికట్టాలని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. బ్రాండిక్సు మహిళా కార్మికులు ఏ అద్భుత శక్తి వారిని నడిపిందో సంఘటితమయ్యారో. జీతాల కోసం పోరాడారు. చంద్రబాబు ప్రభుత్వాన్ని రప్పించారు. వేతనాలు సాధించారు. బెంగళూరులో వస్త్ర పరిశ్రమ కార్మికులు లక్షల సంఖ్యలో రోడ్లమీద కొచ్చారు. భాజపా ప్రభుత్వ మెడలు వంచారు. కార్మికులను దోచుకునే పెన్షన్ పథకాన్ని తిప్పికొట్టారు. భారత్ మహిళలు పువ్వులు కాదు నిప్పురవ్వలు, పోరాడతారు. బతుకు మీద దాడిని తిప్పికొడతారు. అధికార పీఠాలనే మార్చగల సత్తా మహిళలకు ఉంది. అదే మార్చి 8 దిశా నిర్దేశం! ❑

# లేడీ డాక్టర్స్..
# అడుగడుగునా అవరోధాలు

పుస్తక పరిచయం : వి.విజయకుమార్

**బ్రిటీష్ రాణికి బిడ్డ అడ్డం తిరగడంతో ప్రసూతి గదిలోకి పురుషుడి ప్రవేశానికి చట్టం వచ్చింది. పాలక వర్గాలకు కాక తగిలితేనే గదా ప్రజా ప్రయోజనం అనే మాటకొక అర్థం దొరికేది. ప్రసూతిలో బొడ్డు తాడుని పళ్లతో కొరికి వేరు చేయడం మొదలు, గొడ్ల పాకలో ప్రసవాల వరకు వైద్య చరిత్రలో ఇవ్వాళ మనం అమానుషం అనుకుంటున్న అనేక విషయాలు నమోదయ్యాయి. ప్రతి జ్ఞానం వెనుకా అజ్ఞానమే ఉంటుంటుంది దీపపు నీడలా.**

మానవాళిని ముందడుగు వేయించిన మహనీయులను స్మరించుకోవడం కూడా రానివాళ్లమేమో అనిపిస్తుంది ఒకోసారి! చాలా ఆసుపత్రుల ప్రాంగణాల్లో అడుగు పెట్టగానే యాంటీ సెప్టిక్ లోషన్ కంటే ఘాటుగా ఏదో మతం తాలూకూ బూడిద వాసన ముక్కుపుటాలు సోకుతుంది. అక్కడ కనబడే పెద్ద పాదా




లు చరకుడివో, శుశృతిడివో అయితే బాగుండు అనిపిస్తుంది. వైద్య శాస్త్రానికి అసమాన సేవలు అందించిన మహనీయుల్ని స్మరించుకుంటున్నామోమే అనిపించేది కనీసం. ఇటీవల కాలంలో కొన్ని హాస్పటళ్లలో గర్భ గుడిని తలపించే హుండీలు చూశాక ఆ ఆశ కూడా చచ్చిపోయింది. ఎదురుగా గుండె తడిమి స్వస్థతనిచ్చే జ్ఞానికంటే గాల్లో చేతులు వూపి మాటలు విసిరే వారికే విలువిచ్చే సమాజం మనది ! అందుకే ఇటువంటి పుస్తకాల అవసరం చాలా ఎక్కువగా ఉందేమో అనిపిస్తుంది. బ్రిటీష్ రాణికి బిడ్డ అడ్డం తిరగడంతో ప్రసూతి గదిలోకి పురుషుడి ప్రవేశానికి చట్టం వచ్చింది. పాలక వర్గాలకు కాక తగిలితేనే గదా ప్రజా ప్రయోజనం అనే మాటకొక అర్థం దొరికేది. ప్రసూతిలో బొడ్డు తాడుని పళ్లతో కొరికి వేరు చేయ డం మొదలు, గొడ్ల పాకలో ప్రసవాల వరకు వైద్య చరిత్రలో ఇవ్వాళ మనం అమానుషం అనుకుంటున్న అనేక విషయాలు నమోదయ్యాయి. ప్రతి జ్ఞానం వెనుకా అజ్ఞానమే ఉంటుంటుంది దీపపు నీడలా. ఆ నీడలో దాగొన్న అజ్ఞానాల్ని మాత్రమే కాదు, ఆ దీపపుశిఖ పంచే అటువంటి వెలుగుని చూపుతుందీ పుస్తకం. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, జర్నలిజం బోధించే కవితారావు లేడీ డాక్టర్స్ (ద అన్ టోల్డ్ స్టోరీస్ ఆఫ్ ఇండియాస్ ఫస్ట్ విమెన్ ఇన్ మెడిసిన్) పేరుతో తొలి తరపు ఆరుగురు భారతీయ మహిళలు వైద్య విద్యను నేర్చుకోవడానికి ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నారో ఇందులో పరిచయం చేశారు. ఆంగ్లంలో వున్న ఈ గ్రంథాన్ని అంతకంటే మించి సామాజిక స్పృహ కలిగిన చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ రామచంద్రపురం వారు ఈ విలువైన గ్రంథాన్ని తెలుగులో అందించారు. దీన్ని అత్యంత శ్రద్ధగా, వైద్యుడు కాని డాక్టర్ పీఎస్ ప్రకాశరావు తెలుగు చేశారు. వైద్య రంగంపై ఎంతో అనురక్తి ఉంటే తప్ప ఇది సాధ్యం కాదేమోనన్నంత బాగా పరిచయం చేశారు.

**1.ఆనందీబాయి**

పదహారేళ్ల ఈ అమ్మాయి వైద్య విద్య కోసం పడిన తపన ఆద్యంతం కంటతడి పెట్టిస్తుంది. 60 రోజులు తినీ తినకా, ఒడలో పస్తులుండి ప్రాణాలు ఉగ్గబట్టుకుని, యావత్

సంప్రదాయం వెన్నుపట్టి వెనక్కి లాగుతుంటే, భర్త అనునిత్యం రిమోట్ సెన్సింగ్‌తో పవిట ఎటు తిప్పి వేసుకోవాలో కూడా చెబుతుంటే పెన్సిల్వేనియాలో వైద్య విద్య పూర్తి చేసుకుని వెను తిరిగి వచ్చి, కనీసం సంవత్సరం కూడా ప్రాక్టీసు చేయకముందే అనారోగ్యంతో మరణించడం ఒక పెను విషాదం. ఆనందీ బాయి అనారోగ్య కారణంకంటే పురుషాధిక్యపు దాష్టీకానికే ఇరవై రెండేళ్లు కూడా నిండకుండానే బలైందని అనిపిస్తుంది ఈ కథనం చదివాక.

**2.కాదంబిని గంగూలీ**

ఈమెది ఇంకొక అసాధారణ పోరాటం. మహిళా వైద్యులంటే బాగా చిన్న చూపున్న సమాజంలో వైద్యురాలంటే బరితెగించిన ఆడదిగా అనునిత్యం వివక్షతకు గురవుతూ ఒక వైపు, ఎనిమిది మంది సంతానాన్ని సంరక్షించుకుంటూ సాగిన జీవితం ఇంకో వైపు హృదయాన్ని పట్టి కుదిపేస్తుంది. ఎడింబరోలో చదివినా అమెకు జరిగిన ఒక్క అవమానం గురించి చెబితే ఆమె ఎటువం టి సమాజాన్ని ఎదిరించి వైద్యురాలైందో అర్థం అవుతుంది. ఒక ధనికుడి ఇంటిలో పురిటి కేసులో తల్లీ బిడ్డల్ని కాపాడిన ఆమెకు పనిమనిషి పక్కన కూర్చోపెట్టి భోజనం వడ్డించారు. తర్వాత తను కూర్చొని తిన్న ప్రాంతాన్ని శుద్ధి చేయాలిసందిగా చెప్పారు ! మనుధర్మ శాస్త్రం వైద్యులు పంక్తి భోజనానికి అనర్హులుగా చెప్పింది మరి ! వైద్యుడ్ని పంక్తి భోజనానికి అనర్హుడిగా ప్రకటించిన మనుధర్మం ఒకవైపు బోధిస్తూనే, అదే అప్రాచ్యపు వైద్యుడితో పీఠాధిపతులు వాక్సిన్ వేయించుకునే గడుసుదనం ఈ పుణ్యభూమిలో తప్ప మరెక్కడా చూడం.

**3.రుక్మాబాయి రౌత్**

ఈమె ఒక మేలిమి బంగారం, ఒక శూద్ర మహిళ. ఆమె అతివాద జాతీయ నాయకుడు తిలక్ చెప్పినట్లు పారిశుధ్యం, పాచిపని, కుట్టుపనితో సరిపెట్టుకోకుండా ఏకంగా వైద్య వృత్తిలో అసమాన ప్రతిభాశీలిగా పేరు తెచ్చుకుంది. ఆమె తిలక్ లాంటి మూఢ సంప్రదాయ వ్యక్తుల్ని ఎదిరించిన కథనాన్ని తప్పక చదివి తీరాల్సిందే. స్త్రీ విద్య నుంచి వివాహ వయస్సు వరకు వినాశకర సంస్కృత భాషా జ్ఞానంతో ఆదిమ సమాజం గర్హించే అనేక విషయాలను తిలక్ ఎంత బాగా సమర్థించాడో తెలుసుకోవా లంటే ఇది చదవాలి. బాహ్య ప్రపంచానికి సంబంధం లేకుండా జడత్వంతో బతుకీడ్చే హిందూ సమాజపు చాప కింద ఏకంగా ఒక విస్ఫోటనమై పేలడం ఒక శూద్ర మహిళగా వున్న రుక్మాకి ఎలా సాధ్యమైందన్నది చదివి తీరాలి.

**4.హైమవతీ సేన్**

ఆమెది మరో స్ఫూర్తివంతమైన పోరాట జీవితం. ఎనభై ఏళ్ల వరకు ట్రంకు పెట్టెలో దాగిపోయిన ఒక అబల తాలూకూ జీవితం హైమవతీ సేన్ ది. అతి దయనీయమైన పేదరికాన్ని చవిచూస్తూ వైద్య విద్యలో బంగారు పతకం పొందేంత స్థాయి ఎదిరిగింది. జీవితమంతా వైద్యపరంగా తలెత్తిన అత్యంత అమానుషమైన సామాజిక నేరాలతో పోరు సల్పింది. ఇంచు మించు ఐదొందల మంది అభాగ్య శిశువులను చేరదీసిన మాన వతా మూర్తి ఆమె. తొమ్మిదో ఏట పెళ్లి. 12వ ఏట వైధవ్యం. అచ్చం మను ధర్మ శాస్త్ర శాసన బద్ధమే జీవితం. కాని, దాన్ని ఎదిరించి వైద్యురాలిగానే కాదు. పునర్వివాహం కూడా చేసుకుని కాలం చెల్లిన వికృత ఆదర్శాలను సవాలు చేసింది. ధాతృత్వానికి నిలువెత్తు ప్రతీకగా, హరించిపోతూ వెలుగుపంచి రెండంచులా వెలిగిన కొవ్వొత్తిలాంటి ఈ మాణిక్యాన్ని చదవాల్సిందే.

**5.ముత్తు లక్ష్మీ రెడ్డి**

ఈ ఆణిముత్యం దేవదాసీ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చినా అసాధారణమైన ప్రజ్ఞతో, అపారమైన విశ్వాసంతో, వైద్యురాలైన తీరు స్ఫూర్తిదాయకం. బాలిక వివాహ వయస్సును 16 దాకా పెంచడంపై గాంధీని సైతం ఒప్పించిన ముత్తు, కౌన్సిల్ సభ్యుడు సత్యమూర్తి దేవదాసీ వ్యవస్థ రద్దు వద్దన్నప్పుడు అలా అయితే ఏళ్ల తరబడి దేవదాసీలు ఆ పనులు నిర్వహిస్తున్నారు కాబట్టి ఈసారి ఆ విధుల్ని బ్రాహ్మణ బాలికలకు అప్పగిద్దాం అని తెగేసి చెప్పగలిగిన సాహసి ఆమె !

**ఇంకా.. మరెందరో**

ప్రసూతి శిశు పోషణా గ్రంథాన్ని రాసిన ప్రసిద్ధ వైద్యురాలు కొమర్రాజు అచ్చమాంబ గారి గురించి, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో భారతీయ వైద్య సేవా విభాగంలో సేవలందించిన హిల్డా మేరీ లాజరస్ గారి గురించి తూర్పు గోదావరి జిల్లాలో తొలి తరం మహిళా వైద్యులుగా ఎందరి మన్ననలో అందుకున్న డాక్టర్ కమలమ్మ గురించి ఈ పుస్తకంలో సంక్షిప్తంగానైనా విలు వైన విషయాలను చర్చించారు. శాస్త్ర గమనమంతా ఎదురీత ! ఏయుగంలోనైనా సాఫీగా సాగనివ్వకుండా అడ్డుకుంది మతమో, ఆ పేరుతో పురుషుడో ! అడ్డుకున్న పురుషాధిక్యతనూ చూస్తారు. అదే సమయంలో ఆదరించిన పురుషులూ కనబడతారిందులో ! పుస్తకం పేరు లేడీ డాక్టర్స్ అయినా ప్రధాన విషయం అంతా సామాజికమే ! ఇది సమాజ ప్రగతిని కాంక్షించే ప్రతీ ఒక్కరూ చదవాల్సిన పుస్తకం. మరీ ముఖ్యంగా ఈనాడింత స్వేచ్ఛగా, వైద్య విద్యను అందుకోవడానికి పరోక్షంగా ఎందరు త్యాగమూ ర్తులు కారకులయ్యారో తెలుసుకోవడానికి ప్రతీ వైద్య విద్యార్థి తప్పకుండా చదవాల్సిన పుస్తకమిది. ఇంత విలువైన గ్రంథాన్ని తెలుగులో అందించిన డాక్టర్ చెలికాని రామారావు మెమోరి యల్ కమిటీ, రామచంద్రపుం వారికి అంతే శ్రద్ధతో చక్కగా సంక్షిప్తంగా పరిచయం చేసిన పీఎస్ ప్రకాశరావు గారికి ధన్యవాదాలు. ❑

# పురుషాధిక్యతతో మూగబోయిన 'మహిళా రిజర్వేషన్లు'




డాక్టర్ పి.సంజీవమ్మ

**మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అంటే చిన్న విషయమా మరి ? 545 సీట్లువున్న పార్లమెంటులో 180 సీట్లకుపైన ఆడవాళ్ళకు పోతే, మరి ఆ మేరకు మగవాళ్ళకు ఎంత మందికి నష్టం పాపం! అన్ని సీట్లు వదులుకుంటారా? చూసి చూసి? రాష్ట్ర శాసనసభల్లోనూ అదే కథ. పెత్తనం ఆడవాళ్ళది అవుతుం దేమో అనే భయం! మరి ఇంకా ఏ ఏ భయాలు వాళ్ళను వెంటా డుతున్నాయో! ఏ ఏ దురాలోచనలు వాళ్ళ మనసుల్లో దాగివు న్నాయో?**

ఐక్యరాజ్యసమితి 1975లో 'సమానత్వం, అభివృద్ధి శాంతి' అనే మూడు అంశాల నినాదంతో ఆ సంవత్సరాన్ని అంతర్జాతీ య మహిళా సంవత్సరంగా ప్రకటించింది. సభ్యదేశాలు మహిళల హక్కులను గుర్తించి ఆ వైపుగా అనేక కార్యక్రమాలు చేపడుతూ వచ్చాయి. అంతకు మునుపే 1945లోనే 60 దేశాల నుండి మహిళలు పారిస్ సమావేశమై అంతర్జాతీయ ప్రజాతంత్ర మహిళా సమాఖ్యను ఏర్పాటు చేశారు. మన దేశంలో 1954లో కలకత్తాలో మహిళలు ఒక మహాసభ నిర్వహించి ఎన్ఎఫ్ఎస్ఐ డబ్ల్యును ఏర్పాటు చేసుకున్నారు 'భారత జాతీయ మహిళా సమాఖ్య'. అప్పటి నుండి నిరంతరంగా అలుపెరగని శక్తితో మహిళల హక్కుల కోసం ఎన్ఎఫ్ఎడబ్ల్యు పోరాడుతూ దేశంలో అగ్రగామి సంస్థగా నిలిచింది. 1975లో ఫాసిజం ఓటమి 30వ వార్షికోత్స వాన్ని పురస్కరిం చుకొని ఆ సంవత్సరాన్ని మహిళా సంవత్స రంగా పాటించాలని అంతర్జాతీయ ప్రజాతంత్ర మహిళా సమాఖ్య ఐక్యరాజ్యసమితికి ప్రతిపాదనలు పంపింది. దాన్ని అంగీకరించిన ఐక్యరాజ్యసమితి మెక్సికోలో ఆ సంవత్సరం ప్రపంచ మహిళల మహాసభను ఏర్పాటు చేసింది. తర్వాత 1976 నుండి 1985 వరకు మహిళా దశాబ్దాన్ని ప్రకటించింది. మెక్సికో సమావేశం మార్చి 8వ తేదీని అంతర్జా తీయ మహిళా దినంగా పాటించాలని కూడా పిలుపునిచ్చింది. 1980లో కోపెన్ హేగెన్లో ఐక్యరాజ్యసమితి రెండవ అంతర్జాతీయ మహిళా మహాసభను జరిపింది. 1985లో మూడవ మహాసభను కెన్యా రాజధాని నైరోబిలో జరిపింది. ఈ మహాసభలకు మన దేశం నుంచి మహిళా సమాఖ్య తరఫున అధికార ప్రతినిధు లుగా ప్రముఖులు హాజరయ్యారు. ఇతర మహిళా సంస్థల నుంచి ఎందరో మహిళలు హాజరయ్యారు. ఈ సమావేశాల్లో యుఎస్ఏలో సభ్యదేశాలుగా వున్న ప్రపంచదే శాలు తమ దేశాల నుండి మహిళా ప్రతినిధుల్ని పంపటమే కాకుండా ఆయా సమావేశాల్లో మహిళా హక్కుల గురించి సంక్షేమం గురించి యూఎస్వో తీసుకున్న నిర్ణయాల్ని అమలు జరిపే దిశగా కార్యక్రమాలు రూపొందించుకున్నాయి.

మన దేశంలోనూ జాతీయ మహిళా కమిషన్ ఏర్పాటు జరిగింది. మరల ఒక దశాబ్ది తర్వాత 1995లో బీజింగ్ నాల్గవ అంతర్జాతీయ మహిళా సభ జరిగిం ది. గడచిన దశాబ్దిలో ఆయా దేశాల్లో మహిళల కోసం ఏమేం సాధించబ డింది, ఏయే కార్యక్రమాలు అమలు జరిగాయి అనేది అంచనా వేసి



కొన్ని సంవత్సరాలకు కార్యాచరణను రూపొందించారు. ఆ సందర్భం లో మన ప్రభుత్వ అధికారిక ప్రతినిధిగా అక్కడకు హాజరైన మాధవరావు సింధియా (మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి) ఒక ప్రకటన చేశారు. భారతదేశంలో రాజ్యాంగాన్ని సవరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు జరుపుతామని, రాష్ట్ర శాసనసభలు, పార్లమెంటులోనూ ఆ విధమైన రిజర్వేషన్లు త్వరలో అమలు చేస్తామని ప్రకటించారు. ఆ ప్రకటన అక్కడ అందరి ప్రశంసలు చూరగొన్నది. 73, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు. ఎనిమిది లక్షల మందికిపైగా మహిళలు దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో అధికారం పొంది పరిపాలన సాగిస్తున్నారు. ఇదంతా మన చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన నేపథ్యం. చట్టసభల్లో మాత్రం మహిళా రిజర్వేషన్లకు ఇంత వరకు చర్చ రాలేదు. ప్రభుత్వాల హామీలు నెరవేర్చలేదు. రెండు దశాబ్దాలు దాటింది మరి. 2001 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి మహిళా సాధికారక సంవత్సరంగా ప్రకటించింది.

ప్రభుత్వాలు ఎన్ని మారినా మహిళా రిజర్వేషన్ల విషయం మాత్రం సీరియస్‌గా తీసుకోలేదు. ఈ సందర్భంగా మహిళా రిజర్వేషన్ల విషయంలో ఎంతో కృషి చేసిన మన గొప్ప పార్లమెంటేరియన్ గీతా ముఖర్జీ గురించి కొంత చెప్పుకోవాలి. మహిళా రిజర్వేషన్ల కోసం ఏర్పాటు చేసిన జాయింట్ సెలెక్టు కమిటీకి ఆమె అధ్యక్షురాలిగా నియమించబడ్డారు. దేశవ్యాప్తంగా పర్యటించి అభిప్రాయ సేకరణ చేశారు. పార్లమెంటులో ఆ విషయంలో తన వాదనలు వినిపించారు. మహిళల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. కాని ఆమె కృషి, ఆశయం నెరవేరలేదు. అందుకు నిరసనగా మహిళా రిజర్వేషన్ల చట్టం తీసుకొని రాలేని ప్రభుత్వంలో కొనసాగలేనని తన పదవికి రాజీనామా చేశారు. 2000లో కీర్తిశేషులయ్యారు. మరి ప్రస్తుత పరిస్థితి ఏమిటి? ఎక్కుడవేసిన గొంగళి అక్కడే వుంది.

భారత జాతీయ మహిళా సమాఖ్య రెండు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేస్తూనే ఉంది. స్వయంగాను, ఇతర మహిళా సంఘాలతో కలిసి ఉద్యమాలు నడుపుతూంది. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రతిసారి ధర్నాలు నిర్వహిస్తోంది. మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోరాటాలు చేస్తూనే ఉంది. మాజీ ప్రధాన మంత్రులందరూ మహిళల్ని పూరించారు. అదిగో తెస్తిమి.. ఇదిగో తెస్తిమి చట్టం అని. వాళ్ళు కనీసం పార్లమెంటులో బిల్లును చర్చకు ప్రవేశపెట్టలేకపోయారు. మహిళా సంఘాల ఒత్తిడి వల్ల' రాజ్యసభలో ప్రవేశపెట్టారు బిల్లును. అక్కడ అది ముక్కీ మూలిగి నెగ్గింది. అంతే.. ఇంక ఆ తర్వాత దాన్ని ప్రభుత్వాలు లోక్‌సభలో ప్రవేశపెట్టలేదు. అసలు ఆ విషయం ఎవరూ సీరియస్‌గా తీసుకోవటం లేదు. పార్టీల గొప్పలు, ప్రభుత్వాల గొప్పలు డప్పు వాయించుకోవటానికే చట్టసభల సమావేశాల సమయం చాలటంలేదు. ప్రతిపక్షాల నుండి పెల్లుబికే వ్యతిరేకత దాని ఫలితంగా సమావేశాల్లో అప్రజాస్వామిక అసభ్యదృశ్యాలు చోటు చేసుకోవటం చూస్తూనే వున్నాం. చాలా బిల్లులు సాధారణంగా చర్చకురావు. మహిళా బిల్లు చర్చకు పెడితే రచ్చ అవుతుందనేది కొందరి అభిప్రాయం కావచ్చు. కాని, పెట్టి చూడటం ప్రభుత్వ కర్తవ్యం. మనవి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు అనటంకంటే 'పురుష స్వామ్య ప్రభుత్వాలు' అనటం సబబుగా ఉంటుందేమో.. ఎందుకంటే ఏ ప్రభుత్వమూ మహిళల రిజర్వేషన్ల కోసం చట్టం తేవాలనే పట్టుదలతో లేదు. రాజ్యాంగాన్ని సవరించాలి. చట్టం తేవాలంటే అందుకు ఎందరు పురుష ప్రజా ప్రతినిధులు సహకరిస్తారు? పోనీ గడచిన ప్రభుత్వాలకు, ప్రస్తుత ప్రభుత్వానికి ఈ చట్టం తేవటానికి మెజారిటీ లేదా అంటే అదేం లేదు. మెజారిటీ వుంది. మరి ఎంతసేపూ ఏకాభిప్రాయ సాధన అనే పాటతోనే సాగదీస్తున్నారు రెండు దశాబ్దాలనుండి. ఆడవాళ్ళ విషయం వచ్చేటప్పటికి ఏకాభిప్రాయ సాధన అవసరం అయిందా? ఎన్ని చట్టాలు కనీసపు మెజారిటీతో సాధించలేదు? ఆంధ్ర, తెలంగాణ విభజన చట్టం తీసుకు రావటంలో ఎంత ప్రహసనం జరిగిందో దేశ ప్రజలందరికీ తెలుసు. తాము అనుకున్నది సాధించటానికి ప్రభుత్వాలకు మార్గాలు తెలుసు. ఆ మార్గాలు నవ్యమో అపసవ్యమో వాళ్ళకు అనవసరం. ఒకప్పుడు మొదటిసారి మహిళల రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభలో చర్చకు ప్రవేశ పెట్టినప్పుడు బీహార్ యాదవుడు లాలూ ప్రసాద్, ఉత్తరప్రసాద్ యాదవుడు ములాయం సింగ్ ఇరువురు ఆ బిల్లు ప్రతులను ముక్కలు

**స్త్రీ పురుష వివక్ష పునాది నుండి పెకలింపబడాలంటే వారికి సమానత్వం, సంక్షేమం, భద్రత, సాధికారత చేకూరాలంటే ఆర్థిక స్వాతంత్ర్యం, రాజ్యాధికారం లభించాలి. అందుకు చట్టసభల్లో వారికి కనీసం 3వ వంతు రిజర్వేషన్ల చట్టం రావాలి. రాజ్యాధికారం ఉన్నప్పుడే మహిళలు తమకు అవసరమైన మరిన్ని చట్టాల్ని పకడ్బందీగా తీసుకు రాగలరు. వారి సంక్షేమాన్ని గురించి వారినే ఆలోచించుకోనివ్వండి. తర్వాత సమాజం యొక్క క్షేమాన్ని గురించి కూడ వారు ఆలోచించ గలుగుతారు.**

ముక్కలుగా చింపివేసిన దృశ్యం (టీవీలో ప్రసారం) ఇంకా నా కళ్ళలో మెదులుతూనే ఉంది. వాళ్ళ ఆ ప్రవర్తనలో పురుష దురహంకారం స్పష్టంగా కనిపించింది. అసలు ఆ బిల్లు చర్చకు రాక మునుపే కులాల వారి రిజర్వేషన్లు ఆడవాళ్ళకు రావాలని గొడవలు సృష్టించాలనుకున్నారు.. ఎంత కుత్సితం? అసలు విషయం ఆ పురుష ప్రతినిధుల మనసుల్లో వున్నది. ఆడవాళ్ళకు రాజ్యాధికారం అవసరం లేదనేది. లేదంటే లాలూ ప్రసాద్ యాదవ్ తన మీద అవినీతి ఆరోపణలు వచ్చిన సందర్భంలో ఆయన భార్య రబ్రీదేవికి ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టి, స్వయంగా ఆయనే 'పరిపాలన సాగించాడే.. అలా అయితే బాగుంటుంది అనుకుంటారేమో ఆ పురుష పుంగవులు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అంటే చిన్న విషయమా మరి ? 545 సీట్లువున్న పార్లమెంటులో 180 సీట్లకుపైన ఆడవాళ్ళకు పోతే, మరి ఆ మేరకు మగవాళ్ళకు ఎంత మందికి నష్టం పాపం! అన్ని సీట్లు వదులుకుంటారా? చూసి చూసి? రాష్ట్ర శాసనసభల్లోనూ అదే కథ. పెత్తనం ఆడవాళ్ళది అవుతుం దేమో అనే భయం! మరి ఇంకా ఏ ఏ భయాలు వాళ్ళను వెంటా డుతున్నాయో! ఏ ఏ దురాలోచనలు వాళ్ళ మనసుల్లో దాగివు న్నాయో? అసలు మహిళా రిజర్వేషన్లు ఎవరి దయాదాక్షిణ్యాలు కావు. అవి సగం జనాభా హక్కు. కులాల వారీగా, మైనారిటీల పేరుతోనూ పార్టీలు, గ్రూపులు కట్టి మా ఓట్లు కావాలంటే మాకిన్ని సీట్లు, పదవులు కావాలని ఆడవాళ్ళు బేరసారాలు చేయలేరనా? అధికారంలోకి వస్తున్నది ఆడవాళ్ళ ఓట్లతో, వారికి ఏం మేలు చేస్తున్నారు ? వాళ్ళు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలు కూడ ధనబలం, అధికారబలం ముందు ఆచరణలో ఎగతాళికి గురవుతున్నాయి.

మరోవైపు మహిళా సాధికారత అంటూ గొంతులు చించుకుంటున్నారు నాయకమ్మన్యులు. పావలా వడ్డీకి అప్పులు కొందరికి ఇచ్చి మహిళా సాధికారత సాధించినట్లు ప్రచారం చేస్తారు. మహిళా సాధికారత అనేమాట వారికి ఆషామాషీగా అనిపిస్తుంది కాబోలు! పితృస్వామ్యంతోపాటు సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ కార్పోరేట్ శక్తులు పీడన అణచివేతలకు ఆధునిక మహిళలు గురవుతున్నారు. స్త్రీ పురుష వివక్ష పునాది నుండి పెకలింపబడాలంటే వారికి సమానత్వం, సంక్షేమం, భద్రత, సాధికారత చేకూరాలంటే ఆర్థిక స్వాతంత్ర్యం, రాజ్యాధికారం లభించాలి. అందుకు చట్టసభల్లో వారికి కనీసం 3వ వంతు రిజర్వేషన్ల చట్టం రావాలి. రాజ్యాధికారం ఉన్నప్పుడే మహిళలు తమకు అవసరమైన మరిన్ని చట్టాల్ని పకడ్బందీగా తీసుకు రాగలరు. వారి సంక్షేమాన్ని గురించి వారినే ఆలోచించుకో నివ్వండి. తర్వాత సమాజం యొక్క క్షేమాన్ని గురించి కూడ వారు ఆలోచించ గలుగుతారు.

2001లో యూఎస్ఈ మహిళా సాధికారత గురించి ఏం చెప్పిందో ఒకసారి చూద్దాం.. 'దోపిడీరహిత సామాజిక ఆర్థిక వ్యవస్థను ఆవిష్కరించుకోవటానికి ఆ దిశగా సమాజ గమనాన్ని నిర్దేశించే శక్తి సామర్థ్యాలను మహిళలు కలిగివుండటం వల్లనే మహిళా సాధికారత సాధ్యం అవుతుంది అని ప్రకటించింది. అలాంటి సమాజంలోనే స్త్రీలు సంపూర్ణ వ్యక్తులుగా ఎదగగలు గుతారు. స్త్రీ పురుష సమానత్వం కార్యరూపం ధరిస్తుంది. స్త్రీ పురుషులిరువురికి సమానబాధ్యత, సమాన భాగస్వామ్యం ఉండే సమాజం అది. అధికారం అంటే అణచి వేసేదికాదు. అధికారం అంటే అవినీతి రాజకీయాధికారాన్ని, దోపిడీని అంతం చేసేది.

మహిళలకు కేవలం రాజకీయాధికారం మాత్రమే కాదు, ఆర్థిక అధికారం కోసం వనరుల మీద అధికారం కావాలి.. అవి ఏ రూపంలో వున్నా. సామాజిక ఉత్పత్తి రంగాలన్నింటిలో పురుషులతోపాటు పాల్గొనే అవకాశాలుండాలి. వారికి సమాజంలో ప్రస్తుతంవున్న అధికార సంబంధాలు మారాలి. స్త్రీలు ఆ సంబంధాల్ని ప్రశ్నించి, ఎదిరించి సమష్టి చైతన్యం ప్రదర్శించగలిగిన దశకు చేరుకోవాలి. చైతన్యవంతులైన స్త్రీలు ఉద్యమాలు నడపాలి. సామాజిక న్యాయంకోసం సమానత్వం కోసం పోరాటం అది. కేవలం రాజకీయాధికారం కోసం కాదు. రిజర్వేషన్ల చట్టం సాధించే నాటికి రాజకీయ పార్టీలన్నీ తమ పార్టీలనుండి మహిళలకు సీట్లు కేటాయించటానికి తగిన అభ్యర్థుల్ని శిక్షణ ఇచ్చి తయారుచేసుకోవాల్సి వుంది. తగినంత మంది మహిళల్ని సంసిద్ధం చేయటం ఒక బృహత్కార్యం. వామపక్షాలతో సహా అన్ని పార్టీలూ మహిళల్ని మంచి కార్యకర్తలుగా, రాజకీయ కార్యకర్తలుగా తీర్చిదిద్దవలసి వుంది. రాజకీయ పార్టీలలో ఎందరు మహిళలు చైతన్యవంతులుగా ఉన్నారు? అసలు ఆడవాళ్ళను ముందుకు రానిస్తున్నారా? ఒకవైపు కుటుంబాల్లో ఆంక్షలు.. మరోవైపు సమాజంలోనూ, పార్టీలలోని పురుషుల వైపు నుంచి కూడ చిన్నచూపు.. ఎదిగితే ఓర్చలేనితనం.. శీలం మీద అభాండాలు వేసే వరకు పోతుంది వ్యవహారం. ఈ విషమ పరిస్థితులన్నీ తట్టుకొని అధిగమించి రాజకీయాల్లో ముందుకు సాగాలంటే మహిళలకు ఒక అగ్ని పరీక్ష. మహిళలకు ఒక నిఖార్సయిన వ్యక్తిత్వం ఉండాలి. రాజకీ య పరిజ్ఞానం, వాటిపట్ల ఆసక్తి, సమాజంపట్ల బాధ్యత ఉండా లి. ఈ అర్హతలన్నీ ఎన్నికల్లో నిలబడే పురుష అభ్యర్థులందరికీ లేవని కాదు, వుంకానీ మహిళలకూ ఆ యోగ్యత వుండాలి. ఈనాడు రాజకీయాలు రొచ్చు రాజకీయాలు. ఆ రొంపిలోకి ఆడ వాళ్ళు ఎందుకని సన్నాయి నొక్కులు నొక్కే చతుర పురుషులూ ఉన్నారు. మహిళా రిజర్వేషన్ల చట్టం వచ్చి మహిళలు ఇతోధికం గా రాజకీయాల్లో పాల్గొన కలిగినప్పుడు అవినీతి రాజకీయాలు కొంతమేరకైనా ప్రక్షాళనం కాగలవని ఆశిద్దాం. ❑

# ప్రగతికి ఆమడ దూరంలో పడతులు



డాక్టర్ కనుపర్తి విజయలక్ష్మి

**స్త్రీలు ఆనాదిగా కేవలం భోగ్యవస్తువుగా, సంతానోత్పత్తి పరికరంగా, గృహ నిర్వాహకురాలిగా, పురుషుడి అడుగు జాడల్లో నడిచే వ్యక్తిగా మాత్రమే మిగిలిపోయింది. వ్యవసాయం, పాడి పరిశ్రమలు, కుటీర పరిశ్రమల్లో ఆవిడ శ్రమ అంతింతనరానిది. ఆవిడ పడే కష్టం లెక్కకు రానిదిగా మిగిలి పోతుంది. స్త్రీలు వంటింటికి, పడకటింటికి మాత్రమే పరిమితం అయిన వారిగా వున్నప్పుడు ఆవిడకు విద్యలో జ్ఞాన సముపార్జనలో అవసరం ఏమిటని తలపోసి ఆ విద్యారంగానికి దూరంగా పెట్టారు. మొత్తం మీద ఆ నాటి నుండి నేటి వరకు జరిగిన అభివృద్ధికంతటికి కర్తృత్వం వహించేది పురుషుడేనని, చరిత్ర నిర్మాతలు వారేననే విధంగా ప్రచారం సాగింది.**

మన దేశ జనాభాలో దాదాపు సగం మంది స్త్రీలున్నారు. ఆకాశంలో సగం మాది అంటున్నా అనుకొంటున్నా అవకాశాల్లో ఆశించినంత భాగస్వామ్యం కనిపించటం లేదు. ఏ దేశంలో అయినా మహిళలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక హక్కులు లేకుంటే ఆ దేశం పురోభివృద్ధికి దూరంగా వున్నట్లే నవి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుకొంటుంటాం. చరిత్రనంతా తిరగదోడి చూసినా స్త్రీలకి పురుషులతోపాటు సమానావకాశాలు వున్నట్లు మచ్చుకైనా కనిపించదు. అనేకానేక ఆచార సంప్రదాయాలు, విధి నిషేధాలు, ధర్మ శాస్త్రాలు స్త్రీలపై అనేక రకాల విధులు, బాధ్యతలు, పరిమితులు విధించాయి. ఆ చట్ర పరిధిలో నుండి స్త్రీలు ఒక అడుగు ముందుకు వేయటాన్ని కూడా వీలు లేకుండా పితృస్వామ భావజాలం చాలా ఖచ్చితంగా తనపని నిర్వర్తిస్తూ వచ్చింది.

## అభివృద్ధి దిశలో..

స్త్రీలపై హక్కు చెలాయించటమనే అలవాటు వేద కాలం నుండి మొదలై నాగరికతాభివృద్ధి చెందిందని అనుకొనే నేటి కాలం వరకు కొనసాగుతూ వుంది. అయితే 18వ శతాబ్ది వరకు కొనసాగుతూ వచ్చిన ఈ అణచివేత రాజారామ్మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, జ్యోతీబాపూలే వంటి వారి వల్ల అడ్డుకట్ట పడింది. సామాజికంగా స్త్రీలు అనేకరకాలైన అణచి వేతలకు గురవుతున్నా. అది విదేశీ పాలనైనా, స్వదేశీ పాలనైనా కానివ్వండి, రాజ్యాల మధ్య యుద్ధాలు జరిగినా, సంక్షోభాలు ఉత్పన్నమైనా, ఇచ్చి పుచ్చుకోటాలు అయినా స్త్రీలే 'విక్టిమ్స్' అవుతున్నారు. శత్రువుల నుండి తమను తాము కాపాడుకోటానికి 'జోహార్ 'వ్రతం ద్వారా జరిగే ఆత్మబలిదానం లేదా సహగమనం' ద్వారా బలవంతపు చావులు.. ఒకనాటి దండయాత్రల నుండి నేటి గజరాత్ అల్లర్ల దాకా బాధితులు స్త్రీలే ! అత్యాచారాలు, హత్యలు, కక్షలు తీర్చుకోటానికి స్త్రీలనే ఎంచుకోటం ఒక దౌర్భాగ్యం. మనిషిలోని రాక్షస ప్రవృత్తి ముందుగా బల హీనుల మీదనే దాడికి సంసిద్ధమవుతోంది. సతీ సహగమనం నిషేధింపచేయడంతో రాజా రామ్‌మోహన్‌రాయ్, (1829), వితంతు పునర్వివాహ చట్టం(1856) చట్టం తీసుకు రావడంతో ఈశ్వర చంద్ర విద్యాసాగర్.. స్త్రీ విద్య కోసం పోరాటం సలిపిన మహాత్మ పూలే.. వీరందరి కృషి ఫలితమే స్త్రీల ఉనికికి కారణమయింది. మన తెలుగు నాట అయితే బాలికలకు ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పిన కందుకూరి వీరేశలింగం మహిళలకు నిత్యస్మర ణీయుడు. బాల్యంలోనే వైధవ్యానికి గురైన ఆడ పిల్లలకు వితంతు పునర్వివాహాలు నిర్వర్తించటం లో ఆయన పడిన పాట్లు అన్ని ఇన్నీ కాదు. స్త్రీ విద్యావశ్యకత గూర్చి పోరాడిన మహోను భావులందరు పురుషులే... ఏది ఏమైతేనేం సంస్కర్తల వల్లనేమి, విదేశా మిషనరీల వల్లనేమి, దేశీయుల్లో వచ్చిన మార్పు వల్లనేమి 19వ శతాబ్ది నాటికి ఆడపిల్లల్ని విద్యావంతుల్ని చేయాలనే భావాలు ప్రబలినాయి. 1855 నాటికి బ్రిటిషు ప్రభుత్వం విద్యా శాఖను నెలకొల్పింది. మద్రాసు ప్రెసిడెన్సీలో బాలికా పాఠశాలలు స్థాపించబడ్డాయి. 1908 నాటికి విద్యాలయాల సంఖ్య 329కి, విద్యార్థినుల సంఖ్య 43,546 కి చేరుకొంది. అట్లా క్రమాభివృద్ధి గాంచి నేటికి అన్ని విధాలైన శాస్త్ర సాంకేతిక విజ్ఞానశాస్త్ర, దేశపరి రక్షణ రంగాల్లోకి స్త్రీలు చొచ్చుకువచ్చారు. తమదైన' ప్రతిభను'ను చాటి చెబుతున్నారు.

## జాగృతి శకం

జాతీయోద్యమంలో స్త్రీలు పాలు పంచుకోవటంతో ఆ ఉద్య

మానికే ఒక 'ఊపు వచ్చిందని చెప్పవచ్చు. ఇంటి నుండి బయటకు రాకుండా వంటింటికి మాత్రమే పరిమితమై 'అసూర్యం పశ్యలుగా' వుండిపోయిన స్త్రీలు ఉద్యమబాట పట్టటం ఆశ్చర్యకరమైన విషయం. ఇంటి గడప దాటి ఎరగని మహిళలు ఒక్కసారిగా జైలు కటకటాల వెనుక దుర్భరమైన జీవితాన్ని గడపటానికి వెనుకాడలేదు. గాంధీజీ ఇచ్చిన పిలుపుతో స్త్రీలు విదేశీ వస్తు బహిష్కరణ, మద్యపాన నిషేధం ఉద్యమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 1940-41లో సాగిన వ్యక్తిగత సత్యాగ్రహంలో 1942 క్విట్ ఇండియా ఉద్యమంలోను ధైర్య సాహసాలలో పాలు పంచుకొన్నారు. గాంధీజీ స్త్రీలు ఇతోధికంగా ఉద్యమాల్లో భాగస్వాములవటానికి ప్రోత్సాహపరిచాడు. 'స్త్రీ జాతి పట్ల ప్రత్యేకంగా చూపే వివక్షకు కాలం చెల్లింది. కుమారుడు పుడితే సంతోషించడానికి, కుమార్తె కలిగితే దుఃఖించడానికి నాకు కారణం కనిపించదు. జీవించడానికి ఇద్దరికీ సమానమైన హక్కుంది. ప్రపంచం ముందుకు సాగాలంటే ఇద్దరూ సమానంగా అవసరం' అంటాడు గాంధీజీ ఈ సందర్భంలో చిట్టగాంగ్ విప్లవోద్యమాన్ని, కమ్యూనిస్టు పోరాట యోధుల త్యాగాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఆ నాడు విప్లవ శంఖం పూరించిన ఎంతోమంది మహిళలు, స్వాతం త్ర్యానికి పూర్వం, ఆ తరువాత ఎన్నో ప్రజాస్వామ్య ఉద్యమాల్లో పాల్గొన్నారు. అయినా ఇంకా అనుకొన్న ప్రగతి సాధించలేదని, అందుకై కొంత సమీక్ష ఆవసరం అని అనిపిస్తుంది.

### మహిళల హక్కుల బాటలో

ప్రపంచవ్యాప్తంగా స్త్రీల స్థితిగతుల పరిశీలన, విచారణ జరిపి తిరిగి హక్కుల పునరుద్ధరణకై 1975వ సంవత్సరాన్ని U.N.O అంతర్జాతీయ మహిళా సంవత్సరం'గా ప్రకటించింది. స్వేచ్ఛ, సమానత్వం, అభివృద్ధి అనే సూత్రాలను ప్రాతిపదికగా స్త్రీలకు సమాన గౌరవాన్ని ఇవ్వాలని, స్త్రీలను అన్ని రంగాల్లో భాగస్వాములుగా చేసి, ప్రపంచ శాంతి పరిరక్షణ చేయాలనేది మహిళా సంవత్సరపు లక్ష్యం. మొదటి రెండు సభలు మెక్సికోలోను, మూడో సభ బెర్లిన్‌లోను జరిగాయి. 150 దేశాల నుండి దాదాపు 5వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సభల్లో ప్రపంచదేశాల స్త్రీల పరిస్థితులపై ఎన్నో చర్చలు జరిగాయి. ఈ అంతర్జాతీయ మహిళా సంవత్సరం స్త్రీలనే కాక, పురుషులను, ప్రపంచం మొత్తాన్ని అలోచింపచేసింది. స్త్రీల స్థాయి అనుకున్న రీతిలో పెరగనందున 1976 నుండి 1985 వరకు UNO మహిళా దశాబ్దంగా ప్రకటించింది. ఈ దశాబ్దంలో జరిగిన అతి పెద్ద సభ కోపెన్ హాగన్' సభ. ప్రపంచవ్యాప్తంగా స్త్రీల అభివృద్ధిని గురించిన సర్వేలు రిపోర్టులు(మన దేశంలో సహా) బయటకు వచ్చి స్త్రీల స్థితిగతులను గూర్చి పునరాలోచన చేయవలసిన అగత్యం ఏర్పడింది.మానవ హక్కులు మహిళలకు వర్తించవా? ప్రస్తుత సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణలోకి తీసుకొన్నట్లయితే మానవ హక్కులు మహిళలకు వర్తిస్తున్నాయా ? అనే ప్రశ్న ఎదురవుతుంది. రెండు ప్రపంచ యుద్ధాలు మానవాళికి కలిగించిన భయభ్రాంతులు విచ్ఛిన్నం చూసి భయపడిపోయి శాంత సామరస్యం వైపు ప్రజలు అర్రులు చాచారు. ఈ భూమి మీద జన్మించిన ప్రతి వ్యక్తి భయం భీతి లేని సమాజంలో కొన్ని హక్కులతో జీవించాలి అనే సదాశయంతో UNO 1948 డిసెంబరు 10వ తేది 'మానవ హక్కుల' పత్రాన్ని జారీచేసింది. ఇందులో పురుషులతోపాటు స్త్రీలకు సమానంగా అన్నీ హక్కులు వుండాలనే నిర్దేశం వుంది. ఇందులో 30 ఆర్టికల్స్ వున్నాయి. అన్ని సభ్య దేశాలు జాతి, మత, లింగ, వర్గ, భాషలతో నిమిత్తం లేకుండా పూడవ హక్కుల పరిరక్షణకు ఆమోదం తెలిపాయి. మానవ హక్కులకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. దీనికి అనుబం ధంగా 1961లో లండన్ కార్యాలయంగా ఏర్పడిన 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' సంస్థ మానవ హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తున్నది. అంతర్జాతీయంగా మానవ హక్కుల సమావేశాలు జరుగుతున్నాయి.

## లోక్‌సభలో మహిళలు

### ఏ సంవత్సరం ఎంత మంది ఎన్నికయ్యారు

| లోక్‌సభ ఎన్నికలు సంవత్సరం | మహిళా సభ్యుల ప్రాతినిత్యం | సభలో మహిళల శాతం |
|---|---|---|
| 1951 | 22 | 5 |
| 1957 | 22 | 5 |
| 1962 | 31 | 6 |
| 1967 | 29 | 6 |
| 1971 | 28 | 5 |
| 1977 | 19 | 4 |
| 1980 | 28 | 5 |
| 1984 | 43 | 8 |
| 1989 | 29 | 6 |
| 1991 | 39 | 7 |
| 1996 | 40 | 7 |
| 1998 | 43 | 8 |
| 1999 | 49 | 9 |
| 2004 | 45 | 8 |
| 2009 | 59 | 11 |
| 2014 | 66 | 12 |
| 2019 | 78 | 14 |

అయితే మానవ హక్కుల ఉల్లంఘనను ఏ దేశమూ అరికట్టలేక పోతున్నది. ఇక స్త్రీలపరంగా చూస్తే హక్కులను పొందటం, అనుభవించటం అన్నది నామమాత్రం గానే కొనసాగుతుంది. మహిళా అభ్యున్నతి అంతంత మాత్రమే! అయితే మన దేశానికి సంబంధించినంత వరకు మనం పరిశీలిస్తే మన దేశ రాజకీయ, మత, ఆర్థిక, సామాజిక అంశాల్లో స్త్రీల భాగస్వామ్యం ఎంత? తమ అభిప్రాయానుగుణంగా ఏ మేరకు వారు నడుచుకోగలుగుతున్నారు ?

### రాజ్యాంగం : స్త్రీల హక్కులు

చట్టం ముందు అందరూ సమానులే ! స్త్రీ పురుష వివక్షత వుండరాదు. ఆర్టికల్ 14లో చెప్పబడ్డ ప్రకారం అందరికీ ఒకే రకమైన రక్షణ వుండాలి. ఆర్టికల్స్ 15, 16 కూడా స్త్రీలకు సమాన అవకాశాలు గురించే చెప్పాయి. ఇన్ని రకాలైన హక్కులు, చట్టాలు వచ్చినా ఈ 21 శతాబ్దంలోనూ స్త్రీ పురుషుని వలె హక్కులు పొందగలుగుతుందా?

### ప్రపంచీకరణ, సాంకేతిక విజ్ఞానం

స్త్రీల సమస్యలను ఇంకా పెంపొందించాయా? స్త్రీలు సంపాదనాపరులైనా ఆర్థిక స్వాతంత్ర్యం ఏ మేరకు వుంది ? గృహహింసలాటి చట్టాలు వున్నా స్త్రీలు ఎందుచేత కుటుంబాల కుమ్ములాటల్లో నుంచి బయటకు రాలేకపోతున్నారు. నిర్ణయాధికారమనేది లేకుండా, సాధికారతవైపు ఎందుకు నడవలేకపోతున్నారు ? అంటే. మనకు వచ్చే సమాధానం – 'చట్టంకంటే సాంప్రదాయం బలమైంది." ఆ సంప్రదాయపు సంకెళ్ళకు బందీ కాకుండా స్త్రీలకు అన్ని అంశాలపై అవగాహన కల్పించవలసిన బాధ్యత బాల్యం నుండి పెంపొందింపవలసిన అగత్యం వుంది. ఎన్ని హక్కులున్నా, చట్టాలున్నా వాటిని ఎవరి నిమిత్తమైతే చేశారో వారు జాగరూకతతో వ్యవహరించాలి. లేకపోతే ఎవరూ ఏమి చేయలేరు. తమ కోసం చేసిన చట్టాలతో తమకు 'రక్షణ' కలుగుతుందనే నమ్మకం స్త్రీలలో కలిగించాలి. కలిగించే బాధ్యత సమాజానిది. ప్రభుత్వానిదే.

### రాజాధికారం వైపు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళయింది. ఆజాదికా అమృత మహోత్సవాలు జరుపుకుంటున్నాం. అయినా మహోన్నత చట్టసభలో పట్టుమని 100 మంది మహిళలు కూడా సభ్యులుగా లేరు. కాని ఓట్లు వేయటానికి మాత్రం స్త్రీలు కావాలి. దాదాపు పురుష జనాభాలో సమానంగా మహిళలు వున్నారు. కాని వారి ప్రాతినిధ్యం మాత్రం అతిస్వల్పం... చట్ట సభల్లో మహిళా ప్రాతినిధ్యం పెంచాలనే ఉద్దేశం H.D.దేవగౌడ ప్రధాన మంత్రిగా వుండగా 33% రిజర్వేషన్లు ఇవ్వాలనే ప్రతిపా దనతో బిల్లు పార్లమెంటులో (మిగతా 42వ పేజీలో)

## రాజ్యసభలో మహిళలు

### ఏ సంవత్సరం ఎంత మంది ఎన్నికయ్యారు

| రాజ్యసభ ఎన్నికలు సంవత్సరం | మహిళా సభ్యుల ప్రాతినిత్యం | సభలో మహిళల శాతం |
|---|---|---|
| 1952 | 15 | 6.9 |
| 1954 | 17 | 7.8 |
| 1956 | 20 | 8.6 |
| 1958 | 22 | 9.5 |
| 1960 | 24 | 10.2 |
| 1962 | 18 | 7.2 |
| 1964 | 21 | 8.9 |
| 1966 | 23 | 9.8 |
| 1968 | 22 | 9.6 |
| 1970 | 14 | 5.8 |
| 1972 | 18 | 7.4 |
| 1974 | 18 | 7.5 |
| 1976 | 24 | 10.1 |
| 1978 | 25 | 10.2 |
| 1980 | 29 | 12 |
| 1982 | 24 | 10.1 |
| 1984 | 24 | 10.3 |
| 1986 | 28 | 11.5 |
| 1988 | 25 | 10.6 |
| 1990 | 24 | 10.3 |
| 1992 | 17 | 7.2 |
| 1994 | 20 | 8.3 |
| 1996 | 19 | 7.8 |
| 1998 | 19 | 7.7 |
| 2000 | 22 | 9 |
| 2002 | 25 | 10.2 |
| 2004 | 28 | 11.4 |
| 2006 | 25 | 10.2 |
| 2008 | 24 | 9.8 |
| 2010 | 27 | 11 |
| 2012 | 26 | 10.6 |
| 2014 | 31 | 12.7 |
| 2016 | 27 | 11 |
| 2018 | 28 | 11.4 |
| 2020 | 25 | 10.2 |

# వివక్ష ఇంటి గుట్టును రట్టు చేసిన అమర్త్యసేన్



ఎస్.మనోరమ

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఇప్పుడు ప్రపంచాన్ని ఆవహించింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రారంభం నుంచే దోపిడీకి, వివక్షకు, వ్యతిరేకంగా మహిళలు సాగించిన ఉద్యమాల నుంచి వివిధ ప్రాంతాలలో మహిళా దినోత్సవాలు పుట్టుకొచ్చాయి. వీటి పర్యవసానంగా 1910లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు సదస్సు ప్రపంచ వ్యాపితంగా మహిళా దినోత్సవాన్ని ఒకేరోజున జరుపుకోవాలని, సంఘీభావాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. అంతిమంగా 1917లో రష్యాలో జరిగిన మార్చి 8 మహిళా దినోత్సవమే ప్రపంచ మహిళా దినోత్సవంగా పరిణామం చెందింది.**

అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఐక్యరాజ్యసమితి గుర్తింపు నివ్వడమే కాదు, మహిళా సాధికారతకు అవసరమైన అనేక చట్టాలు హక్కుల పత్రాలను చేపట్టేలా అనేక దేశాలకు దారి చూపింది వందేళ్లకు పైగా సాగుతున్న ఈ ఉద్యమం మహిళల స్వేచ్ఛ, సమానత్వం, సాధికారత కోసం సాగుతున్న



ఉద్యమాలకు ప్రేరణ ఇస్తూనే ఉంది.

మరోపక్క వివిధ దేశాలలో పాలక వర్గాలు మహిళల మద్దతు కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని హస్తగతం చేసుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఉద్యమస్ఫూర్తిని పక్కన పెట్టి ముగ్గుల పోటీలు, వంటల పోటీలు, ఉత్తమ జంటల పోటీలుగా ఈ ఉత్సవాన్ని దిగజార్చుతున్నారు. మరోపక్క పురుషాధిక్య భావజాలాన్ని అన్ని తరహాల ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా గుమ్మరిస్తున్నారు. ఇంటిచుట్టూ పురుషాధిక్యం, బైట మాత్రం పల్లకీల మోత సాగిస్తున్నారు. ఈ స్థితిలో హ క్కుల ఉద్యమం సాగాల్సిందే, సాధికారత కోసం పోరాటం సాగాల్సిందే. అయితే ఇంటిలో ఇంటి చుట్టూ కొనసాగుతున్న పితృస్వామిక భావజాలం బద్దలు కాకపోతే బైట పల్లకీల మోతే మహిళలకు మిగులుతుంది. ప్రఖ్యాత ఆర్థిక వేత్త, నోబుల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ ఈ ఇంటి గుట్టును రట్టు చేస్తూ కుటుంబం, దాని చుట్టూ సమాజంలో నెలకొన్న పురుషాధిక్య భావ జాలాన్ని వివరిస్తూ ఏడు రకాల వివక్షలను ఆవిష్కరించారు. వాటిని సంక్షిప్తంగా తెలుసుకుందాం.

### 1. మరణాల రేటులో అగ్రస్థానం

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మరణాల రేటులో మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. ప్రతి వెయ్యి మంది జనాభాను ఒక యూనిట్‌గా తీసుకుని ఆయా దేశాల మరణాల రేటును నిర్ధారిస్తారు. చాలా దేశాలలో మహిళల మరణాల రేటు పురుషుల కంటే హెచ్చుగా ఉంది. వారు తినే తిండిలో వ్యత్యాసం ఉంది. పోషకాహారలోపం, రక్తహీనత మహిళలలోనే ఎక్కువ. వైద్యం మీద ఖర్చులోనూ వ్యత్యాసం ఉంది. ఇది పుట్టుక, చావులో స్పష్టంగా కనిపిస్తున్నది.

### 2. పుట్టుకలో వివక్ష

పురుషాధిక్య సమాజాలున్న అన్ని చోట్లా పిల్లల పెంపకంలో లింగ వివక్ష స్పష్టంగా కనిపిస్తున్నది. ఇక్కడ పుట్టబోయే బిడ్డ మగ శిశువు కావాలని కోరుకుంటారు. ఆడ పిల్ల పుట్టడం అరిష్టంగా భావిస్తారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో

తల్లి గర్భంలో శిశువు లింగ నిర్ధారణను తెలుసుకుంటారు. భ్రూణ హత్యలకు గర్భ స్రావాలు చేయించడం అందరికీ తెలిసిందే. మన దేశంలో స్త్రీ పురుష నిష్పత్తిలో వ్యత్యాసానికి ఈ పురుషాధిక్య ప్రవృత్తే కారణం.

### 3. పెంపకంలో వివక్ష

వివిధ దేశాలలో ఆడ, మగ పిల్లలను చదివించడంలో తేడాలు ఉన్నాయి. మగ పిల్లలను ఖరీదైన పాఠశాలలకు, ఆడ పిల్లలను నాణ్యత లేని ఖర్చు తక్కువ పాఠశాలలకు పంపుతున్నారు. ఇంటి పనులలో ఆడ పిల్లల వినియోగం ఉంటే మగ పిల్లలకు మాత్రం మినహాయింపు ఉంది. ఆడ పిల్లలను బైటికి పంపడంలో, వారి లోని నైపుణ్యాలను వెలికి తీయడం అరుదుగా జరుగుతోంది. తక్కువ వయసులో పెళ్లి చేసి చదువుకు, ఉద్యోగానికి స్వస్తి చెప్పి వారిని వంటింటి కుందేళ్లుగా మారుస్తున్నారు.

### 4. ప్రత్యేక చదువులలో వివక్ష

పాఠశాల విద్యలో ఆడ, మగ పిల్లల మధ్య ఉండే వ్యత్యాసంకంటే ఉన్నత చదువులలో వృత్తి విద్యలలో వివక్ష స్పష్టంగా కనిపిస్తుంది. కొన్ని పనులు, వృత్తులు పురుషులే అర్హులు అన్న వివక్ష ఇప్పటికీ ఉంది. పురుషుల కోసం కేటాయించినది కేవలం యుద్ధం ఒకటి మాత్రమే కాదు. రాజకీయ రంగం, వ్యాపార వాణిజ్య రంగాలు, తాత్విక బౌద్ధిక రంగాలను పురుషులు హస్తగతం చేసుకున్నారు. ఇలాంటి వివక్షపరమైన విభజన అన్ని రంగాలలోనూ స్త్రీ పురుషుల భాగస్వామ్యంలో సమతుల్యతను దెబ్బ తీస్తున్నది.

### 5. అత్యున్న స్థానాలలో వివక్ష

వృత్తి పరమైన అత్యున్నత స్థానాలు, నిర్వహణా స్థానాలను పొందడంలో స్త్రీలు వివక్షతకు గురవుతున్నారు. ఉదాహరణకు జపాన్ దేశం అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందినట్లు కనిపిస్తున్నా, కీలకమైన వృత్తిపరమైన అత్యున్నత స్థానాలను మహిళలు దక్కించుకోలేకపోతున్నారు.

### 6. ఆస్తుల యాజమాన్యంలోనూ వివక్ష

అనేక దేశాలలో నేటికీ ఆస్తులకు సంబంధించిన యాజ మాన్యాలలో వివక్ష కొనసాగుతూనే ఉంది. అందువల్ల కుటుం బాలలో మహిళలకు ప్రాధాన్యత ఉండడం లేదు. అందువల్ల వారు వ్యాపార పరమైన, ఆర్థికపరమైన సామాజిక పరమైన కార్యకలాపాలను స్వతంత్రంగా నిర్వహించుకోలేకపోతున్నారు. మనదేశంలో అత్యధిక ప్రాంతాలలో ఆస్తి హక్కు సంప్రదాయ పరంగా పురుషులకు అనుకూలంగా ఉంది. కేరళలో నాయర్ సమూహంలో మాత్రం మాతృస్వామికం వున్నందువల్ల అక్కడ వారసత్వ హక్కు స్త్రీలకు అనుకూలంగా ఉంది.

### 7. కుటుంబంలో వివక్ష

మన కుటుంబాలలో లింగ పరమైన వివక్ష పలు రూపాలలో వుంది. ఇంటి పనులు పంచుకోవడంలో, పిల్లల పెంపకం, పెద్దల సంరక్షణలో ఇది కనిపిస్తుంది. ఉద్యోగం చేసే మహిళలైనా ఇంటి పని మహిళలది, బైట పని పురుషులదీ అన్న వివక్ష కనిపిస్తుంది. ఇది పైకి పని విభజనగా కనిపించినా మహిళల మీద అదనపు పనిని రుద్దే వివక్ష తప్ప వేరు కాదు. ఆమర్త్యసేన్ వెల్లడించిన ఈ వివక్షలు మన ఇంటి చుట్టూ నిత్యం కనిపించేవే. కాని, మనం అంతగా పట్టించుకోనివి. మహిళల సమానత్వం కోసం హక్కుల కోసం సాధికారత కోసం ఉద్యమాలు సాగాల్సిందే. విజయాలు సాధించాల్సిందే. కాని, అవి మన జీవితాలలో ప్రతిఫలించాలంటే ఇంటి చుట్టూ అల్లుకుని వున్న పురుషాధిక్య భావజాలం అంతరించాలి. అప్పుడే నిత్య జీవితంలో నిజమైన స్వేచ్ఛ మహిళకు దక్కుతుంది. పురుషాధిక్య భావజాలాన్ని తుదముట్టించే సాంస్కృతిక ఉద్యమం కూడా తక్షణ అవసరమే. ❑

## ప్రగతికి ఆమడ దూరంలో పడతులు

(40వ పేజీ తరువాయి) ప్రవేశ పెట్టబడింది. ఈ 26 ఏళ్ళ నుండి యీ బిల్లుకి మాత్రం మోక్షం రాలేదు. వస్తుందన్న ఆశ కూడా లేదు. పంజాయతీరాజ్‌లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా మూడో వంతు ప్రాతినిధ్యం స్త్రీలకి కేటాయించబడింది. ఆపై మన్మోహన్‌సింగ్ సర్కారు దాన్ని 50% వరకు పెంచటంలో ఒక్కసారిగా 14 లక్షల మందికిపైగా స్త్రీలు స్థానిక ప్రభుత్వాల్లోకి ప్రతినిధులుగా వచ్చారు. ఇంత వరకు బాగానే వుంది. స్థానికంలో సగం సరే. చట్టసభల మా సంగతేమిటి?" అనుకొం టూ ఎదురుచూడడమే. ఏ పార్టీకి ఏ నాయకుడికీ, ప్రస్తుతం పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించే మహిళలకీ, ఎవరికీ చిత్త శుద్ధి లేదు. ఉంటే ఈ పాటికి పార్లమెంటులో ఈ ప్రస్తావన వచ్చేదే ! చట్టాలతో సంబంధం లేకుండా పార్టీలు స్త్రీలకు ఇతోధికంగా ఎన్నికల్లో సీట్లు ఇవ్వవచ్చు. తండ్రో, భార్యో చనిపోతే దయాదాక్షిణ్యంగా ఆ సీటు ఇస్తున్నారంతే ! మహిళలు ఔన్నత్యం అంత యింత అని అనుకోకుండా, ఉపన్యాసాలకే సరి పెట్టకుండా అన్ని విధాల స్త్రీల వివేకాన్ని, విజ్ఞానాన్ని, శక్తిని దేశ పురోభివృద్ధికి వినియోగించుకోవలసిన ఆగత్యం తప్పనిసరి. ❑

**ఈ సందర్భంలో కందుకూరి వీరేశలింగం మాటలు ఒకసారి గుర్తు చేసుకొందాం - 'ఒక్క పురుషులు మాత్రమే మంచి స్థితికి వచ్చి స్త్రీలు యథాస్థితిలోనే వున్న యెడల నిజమైన అభివృద్ధి యెంత మాత్రము కలుగనేరదు.'**

# నేటి ప్రపంచంలో మహిళల స్థితిగతులు



డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి

**12 దశాబ్దాలకుపైగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. మహిళల అభివృద్ధి, సాధికారత కోసం, అన్ని రకాల అసమానతలతోపాటు జెండర్ అసమానతలను తగ్గించి మెరుగైన, మానవీయ ప్రపంచాన్ని సృష్టించుకోవడం కోసం జరుగుతున్న కృషి ఏ మేరకు సఫలమైంది అనేది అంచనా వేసుకోవడానికి అనువైన సందర్భం ఇది. ఐక్యరాజ్యసమితి 2030 సంవత్సరానికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఇప్పటి వరకు ఆశించినంత సాఫల్యం లేకపోవడం వలన మహిళల, బాలికల జీవితాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడుతోందనేది వివేచించే సందర్భంకూడా ఇది.**

## పేదరికం

విశ్వవ్యాప్తంగా 380 మిలియన్ల మంది స్త్రీలు, బాలికలు నిరుపేదలు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అధ్యయనాలు వారి పేదరికపు తీవ్రత పెరిగిందని తెలుపుతున్నాయి. రోజుకు 1.9 డాలర్‌కంటే తక్కువ డబ్బుతో బతుకుతున్న మహిళల సంఖ్య 2013లో 11.2 శాతం ఉండగా అది 2018కి 8.6 శాతానికి తగ్గింది. కొవిడ్ 19 ఈ ప్రగతిని విచ్ఛిన్నం చేసింది. 2022లో అది 9 శాతానికి చేరిందని, 383 మిలియన్ల మంది స్త్రీలు, బాలికలు కటిక దారిద్ర్యంలో కూరుకుపోగా, 368 మిలియన్ల మంది పురుషులు, బాలురు దారిద్ర్యంలోకి జారినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. కొవిడ్ 19తో ప్రపంచం మొత్తం అల్లాడిపోతున్నప్పుడు కొన్ని సాంఘిక భద్రతా చర్యలు తీసుకున్నప్పటికి, అవి స్వల్పకాలికమైనవి లేక జెండర్ స్పందన లేనివి. 2020లో నాలుగు బిలియన్లకంటే ఎక్కువ మందికి సాంఘిక భద్రత నగదు ప్రయోజనాలు లభించలేదు. 44.9 శాతం తల్లులకు మాత్రమే మెటర్నిటీ నగదు బెనిఫిట్స్ లభించాయి. ఇదే ధోరణి కొనసాగితే సబ్ సహారన్ ఆఫ్రికా లాంటి దేశాల్లో 2030కి ఇప్పటికంటే మరింత ఎక్కువ మంది స్త్రీలు, బాలికలు తీవ్రమైన పేదరికానికి బలవుతారని అంచనా వెయ్యబడుతుంది. పేదరికం తగ్గుదల మందగించడం వలన ఎక్కువగా నష్టపోతున్నది మహిళలు, బాలికలే. పేదరికం, పైపు నీరు, శుభ్రమైన వంట ఇంధనం మొదలైన మౌలిక సౌకర్యాలు స్త్రీలకు అందుబాటులోకి రాకపోవడం, వేతనం లేని పని, ఇంటి పని మొదలైన వాటిలో స్త్రీల శ్రమ వినియోగాన్ని తప్పనిసరి చేయడంతో అవి జెండర్ అసమానతలు మరింత పెరగడానికి దారితీస్తున్నాయి.



## ఆకలి, ఆహారభద్రత

2021లో విశ్వవ్యాప్తంగా ప్రతి ముగ్గురు స్త్రీలలో ఒకరు ఒక మోస్తరు నుండి తీవ్రమైన ఆహార అభద్రతతో జీవించారు. పెరుగుతున్న ఆహార ధరల వలన ఆకలి తీవ్రతరం అవుతుంది. పేద, నిరక్షరాస్య, మహిళలకు, సామాజిక బంధాలు, సమాచారం, భూమి, ఆర్థిక వనరులు తక్కువగా గల మహిళలకు ఆహార అభద్రత ప్రమాదం ఎక్కువ ఉంటుంది. సంఘర్షణలు, వాతావరణం, కొవిడ్ 19, ఈ మూడూ కలిసి ఆహారభద్రతకు ముప్పు కలిగిస్తున్నాయి. పురుషులకంటే అధిక సంఖ్యాక స్త్రీలు ఆహార అభద్రతకు లోనవుతున్నారు. మహిళల్లో ఒక మోస్తరు నుండి తీవ్రమైన ఆహార అభద్రత 2019లో ఉన్న 27.5 శాతం నుండి 2021లో 31.9 శాతానికి పెరగగా, పురుషుల్లో 25.7 శాతం నుండి 27.6 శాతానికి పెరిగింది. ఇది జెండర్ అసమానత 1.8 నుండి 4.3కి పెరగడానికి దారితీసింది. తీవ్రమైన ఆహార భద్రతను ఎదుర్కొంటున్న కుటుంబాలలోని స్త్రీలకు రక్తహీనత వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ప్రతి ముగ్గురిలో ఒకరు, దాదాపు 550 మిలియన్ల మంది పునరుత్పత్తి వయసులో ఉన్న బాలికలు, స్త్రీలకు రక్తహీనత ఉంది. ప్రపంచంలో పోషకాహార లోపం ఉన్న జనాభాలో 60 శాతం మంది సంఘర్షణలతో కల్లోలంగా ఉన్న దేశాల్లో నివసిస్తున్నారు. 2021లో యుద్ధంతో దెబ్బతిన్న దేశాలలో స్త్రీలు యజమానులుగా ఉన్న కుటుంబాలలో 37.5 శాతం, పురుషులు యజమానులుగా ఉన్న కుటుంబాలలో 20.5 శాతం ఒక మోస్తరు నుండి తీవ్రమైన ఆహార అభద్రత ఉంది. ఉక్రెయిన్‌లో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం కారణంగా రష్యన్ ఫెడరేషన్, ఉక్రెయిన్ దిగుమతులపై ఆధార పడుతున్న సుమారు 36 దేశాలలో గోధుమలు, ఎరువులు, ఇంధనం కొరత ప్రజలపై, ముఖ్యంగా స్త్రీలు, పిల్లలు, ఇతర దుర్బల వర్గాల వారిపై ఆకలి పంజా విసురుతూంది.

## ఆరోగ్యం

పాండమిక్ పురుషుల ఆరోగ్యంకంటే స్త్రీల ఆరోగ్యాన్ని నష్టపరిచింది. కొవిడ్ 19 వైద్య వ్యవస్థల్ని నాశనం చేసింది. పేద మహిళలకు ఆరోగ్య సంరక్షణ అందకుండా చేసింది. వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడగల వ్యవస్థలు విచ్ఛిన్నమయాయి. ఒత్తిడికి గురైన ఆర్థిక, మానవ వనరులు పరోక్షంగా, ప్రత్యక్షంగా స్త్రీల పునరుత్పత్తి, లైంగిక ఆరోగ్యంపై దుష్ప్రభాన్ని చూపుతున్నాయి. పాండమిక్‌కి ముందు కూడా ఈ సేవలు అరకొరగా లభ్యమవుతున్న స్త్రీలపై ఈ ప్రభావం మరింత ఎక్కువగా పడింది. గర్భిణుల సంరక్షణతో సహా తల్లుల ఆరోగ్య సేవలు అన్ని దేశాలలోనూ గణనీయంగా తగ్గిపోయాయి. సంపన్న దేశాల్లో టెలీ హెల్త్ సేవల ద్వారా కొంత ఈ లోటును పూడ్చుకున్నారు. కాని, పేద దేశాల స్త్రీలకు ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల విపరిణామాలను ఎదుర్కోవలసి వస్తోంది. పాండమిక్ డిప్రెషన్, ఆందోళన మొదలైన మానసిక సమస్యలకు గురైన గర్భిణుల శాతం పేద మహిళలలో ఇది మరింత ఎక్కువైంది. కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కౌమార తల్లుల శాతం పెరిగింది. ప్రాథమిక విద్య పూర్తి చేయని బాలికల్లో ఈ సమస్య మరింత ఎక్కువైంది. ప్రస్తుతం పునరుత్పత్తి వయసులో(15-49) ఉన్న 1.2 బిలియన్ల మంది స్త్రీలు, బాలికలు గర్భస్రావ సేవలు ఎంతో కొంత నిషేధానికి గురవుతున్న దేశాల్లో నివసిస్తున్నారు. 102 మిలియన్ల మంది స్త్రీలు, బాలికలు గర్భస్రావ సేవల్ని చట్టపరంగా నిషేధించిన దేశాల్లో నివసిస్తున్నారు. ప్రమాదకర గర్భస్రావాల సమస్య మాతృ మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటి. సురక్షిత గర్భస్రావాలు అందుబాటులో లేని ఆయా దేశాల్లో మాతృ మరణాల సంఖ్య పెరిగింది. కాని, ఇది పూర్తిగా నివారించగలిగిన విషాదం. 2019తో పోలిస్తే 2021లో స్త్రీల ఆయుర్దాయం సగటున 1.6 సంవత్సరాలు తగ్గింది. పాండమిక్ పురుషులకంటే ఎక్కువగా స్త్రీల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బ తీసింది. స్త్రీలు డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలకు గురయ్యారు.

## నాణ్యమైన విద్య

ఆర్థికాభివృద్ధి, శ్రేయస్సుతో సహా సమగ్రాభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలకు బాలికల విద్యా హక్కు అమలు తప్పనిసరి. ఆడపిల్లల చదువుస్థాయి పెరగడంతో సమానంగా పెద్దయాక వారి ఆర్జన స్థాయి పెరుగుతుంది. దశాబ్దాల తరబడి చేసిన పరిశోధనలు బాలికలకు విద్య లభించడం వలన సమాజానికి కలిగే ప్రత్యక్ష, పరోక్ష లాభాల్ని తేటతెల్లం చేస్తున్నాయి. విశ్వవ్యాప్తంగా బాలికల విద్య వల్ల జరిగే మార్పుల కారణంగా ఒనగూడే ప్రయోజనాలు ఇటీవల వాస్తవ రూపం దాల్చాయి. కొన్ని దేశాలలో బాలురతో సమానంగా, ఒకోసారి బాలురకంటే మిన్నగా చదువుకుంటున్నారు. కాని, గ్రామీణ ప్రాంతాలలో, పేద వర్గాల కుటుంబాలలో ఇంకా మార్పు రాలేదు. సార్వత్రిక విద్య బాలికలందరికి లభించడం వాస్తవ రూపం దాల్చలేదు. పేదరికాన్ని వేగంగా తొలగించడం, మెరుగైన పునరుత్పత్తి ఆరోగ్యం, తక్కువ శిశు మరణాలు, హెచ్.ఐ.వి.ని మెరుగ్గా అరికట్టడం, మహిళలపై హింసను నివారించడం మొదలైన లాభాలు బాలికా విద్య వల్ల ఒనగూడుతాయి. జాతి, మత, ప్రాంత, వలస, వికలాంగ స్థితి కారణంగా జరిగే వివక్షలు తగ్గుతాయి. బాలికలకు గర్భం, జెండర్ ఆధారిత హింస, అభద్రత కొవిడ్ కారణంగా జరిగిన అభ్యాసపరమైన నష్టాల్ని మరింతగా మంచి నాణ్యమైన పెంచుతున్నాయి. రెండేళ్లపాటు ఉన్న కొవిడ్

ప్రభావం తరువాత చాలా పాఠశాలలు తెరుచుకున్నాయి, కాని, సమాజపు అంచుల్లోకి నెట్టివేయబడిన లేక దుర్బల వర్గాలకు చెందిన బాలికలపై ఆ ప్రభావం కొనసాగుతోంది. కొన్ని పేద దేశాలలో అన్ని తరగతుల్లో, అన్ని సబ్జెక్ట్స్ బాలురకంటే బాలికలు వెనకబడిపోయారు. పేద వర్గాల బాలికలలో అభ్యాసపరమైన నాణ్యత మరింత తక్కువగా ఉంది. ప్రపంచంలో పాఠశాలల్లో చేరకుండా వున్న దాదాపు 130 మిలియన్ల మంది బాలికల్లో సగం మందికి పైగా(54శాతం) కల్లోల భరిత దేశాల్లో ఉన్నారు. సంఘర్షణలు, యుద్ధాలు, బాలికలను బడికి వెళ్ళకుండా చేస్తున్న నిరంతర ప్రయత్నాలు, పాఠశాలకు వెళ్ళడం, అభ్యాసంలో జెండర్ అంతరాన్ని పెంచుతున్నాయి. కౌమార గర్భాల వల్ల బాలికా విద్య దెబ్బ తింటుంది. మారుమూల ప్రాంతాలలో కోవిడ్‌కు ముందు బడి మానేసిన బాలికలలో 56 శాతం మంది ఇప్పుడు గర్భిణులు లేక ఇటీవలే బిడ్డను కని ఉన్నారు. పాండమిక్ వారిని జెండర్ ఆధారిత హింస, మానసిక ఆరోగ్య సమస్యలు, ఆహార, ఆర్థిక అభద్రత ప్రమాదాల్లోకి నెడుతోంది. తమను పోషించేవారు కోవిడ్‌తో అనారోగ్యం పాలవడం లేక మరణించడం కారణంగా బాలికలు పాఠశాల విద్యకు దూరమయ్యారు. ఇలాంటి విషాదాలు వారిని లైంగిక హింస, లైంగిక దోపిడి, హెచ్.ఐ.వి. ఇన్ఫెక్షన్ మొదలైన ప్రమాదాలకు దగ్గర చేస్తున్నాయి. తక్కువ విద్యతో సరిపెట్టుకుంటున్నారు. ఇదే ధోరణి కొనసాగితే అందరికీ ప్రాథమిక విద్యనే స్వప్నం సాకారమవడానికి మరొక 54 ఏళ్లు పడుతుంది. వివక్షా పూరిత జెండర్ నిబంధనలు, సాధారణీకరణలు పాఠ్య ప్రణాళికలు, పాఠ్య పుస్తకాలు, బోధన, అభ్యాస పద్ధతులు, ఆడ పిల్లలు ఏ సబ్జెక్టు చదవాలనే నిర్ణయాన్ని ప్రభావితం చెయ్యడం వలన, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమేటిక్స్ (STEM) బాలికలకు తగినవి కావనే భావనను ప్రచారం చేయడం వల్ల బాలికలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నప్పటికి, సైన్స్ రంగంలో కేవలం 35 శాతం మంది మాత్రమే, ఇన్ఫర్మేషన్ మరియు టెక్నాలజీ రంగంలో మరింత తక్కువగా, మూడు శాతం మంది మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉద్దేశపూర్వకంగా స్త్రీలకు ఇవి తగిన రంగాలు కావని బాలికల మెదళ్ళలో నాటడం వలన, ఆ రంగాల్లో వారికి రోల్ మోడల్స్ స్త్రీలు కనపడకపోవడం వలన, స్త్రీలపై సంప్రదాయకంగా నెట్టబడిన కుటుంబ సంరక్షణ బాధ్యతలకు అనుగుణంగా ఈ రంగాల ఉద్యోగాలు స్త్రీలకు వెసులుబాటు కల్పించేలాగా పని ఏర్పాట్లు చేయకపోవడం వల్ల ఈ రంగాల్లో స్త్రీల భాగస్వామ్యం తగ్గి జెండర్ గ్యాప్ పెరిగింది.

## జెండర్ సమానత్వం

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు - 2030 ఆచరణకు సంబంధించిన వాస్తవాలు 5వ వాగ్దానం జెండర్ సమానత్వ సాధన లక్ష్యం గాడి తప్పినట్లు తెలుస్తోంది. న్యాయ సంస్కరణల ప్రగతి, న్యాయ రక్షణలు ఉన్నప్పటికి ప్రస్తుతం జరుగుతున్న వేగంతోనే మార్పు జరిగితే వివక్షాపూరిత చట్టాలను తొలగించి జెండర్ సమానతను నెలకొల్పడానికి ఇంకా 286 ఏళ్లు పడుతుందని అంచనా. కొవిడ్ 19, స్త్రీ పునరుత్పత్తి, లైంగిక ఆరోగ్యం, పునరుత్పత్తి హక్కులపరంగా జరిగిన ఉల్లంఘనలు జెండర్ సమానత్వ అంశాన్ని మసకబారుస్తున్నాయి. మహిళలపై హింస, ముఖ్యంగా దుర్బల వర్గాల మహిళలపై అమలవుతున్న హింస పెచ్చు మీరిపోవడానికి వారు మున్నెన్నడూ లేనంతగా అభద్రతకు లోనవడానికి దోహదం చేశాయి. 2021లో ప్రపంచవ్యాప్తంగా పునరుత్పత్తి వయసు 15-49)లో ఉన్న స్త్రీలు, బాలికలలో 10 శాతానికిపైగా తమ భర్త లేక సహచరుడు అమలు చేసిన శారీరక, లైంగిక హింసకు గురయ్యారు. 2020లో పాఠశాలలు, డే కేర్ సెంటర్లు మూసేయడం వలన స్త్రీలు ప్రపంచవ్యాప్తంగా అదనంగా 512 బిలియన్ల గంటలు వేతనం లేని పిల్లల సంరక్షణ, కుటుంబ నిర్వహణకు వెచ్చించారు. అధికార స్థానాల్లో పురుషులతో సమానంగా స్త్రీల ప్రాతినిధ్యం ఇప్పటికీ లేదు. కార్పొరేట్ బోర్డూమ్స్, కోర్టులు, రాజకీయ నాయకత్వం వరకు స్త్రీలు తగిన సంఖ్యలో లేకపోవడం వల్ల వారిపై అన్ని రకాల వివక్షల్ని తొలగించే ప్రయత్నాలు సఫలమవడం లేదు. గ్లాస్ సీలింగ్ యథాతథంగా ఉంది. మేనేజర్లు, సూపర్‌వైజర్లు లాంటి స్థానాల్లో పురుషులతో సమానంగా స్త్రీలు ఉండడానికి ఇంకా 140 ఏళ్లు పడుతుందని అంచనా వేస్తున్నారు. అభివృద్ధి జరుగుతున్నప్పటికీ కేవలం 20శాతం దేశాల్లో మాత్రమే జెండర్ బడ్జెట్ కేటాయింపులు జరుగుతున్నాయి. నాయకత్వ స్థానాల్లో స్త్రీలు లేకపోవడం వలన నష్టపోయేది కేవలం స్త్రీలు మాత్రమే కాదు, మొత్తం సమాజం నష్టపోతుందనే ఎరిక ఎంత త్వరగా వస్తే అంత త్వరగా ప్రగతి వేగం పెరుగుతుంది. చాలా గొప్పగా అభివృద్ధి చెందామని అతిశయించే అమెరికాలో స్త్రీలు కూడా పితృస్వామ్య పంజాను తప్పించుకోలేకపోతున్నారు. వారి అనుభవం, తెలివితేటలు, జ్ఞానం, సామర్థ్యాలు ఎంత ఉన్నతంగా ఉన్నప్పటికి అమెరికన్ సమాజం స్త్రీలు పురుషులకంటే తక్కువ అర్హతలు, తక్కువ సామర్థ్యం ఉన్నవారనే భావజాలాన్ని పెంపొందిస్తుంది. దృఢమైన, తెలివి గల స్త్రీలు సమాజానికి సమస్యని, సమాజం సజావుగా నడవకుండా చేటు చేస్తారనే భావాల్ని సమాజం నమ్మేలా చెయ్యడంలో పితృస్వామ్యం సఫలీకృతమయింది. స్త్రీల పట్ల పక్షపాత వైఖరితో ఉండే మీడియా కూడా అధికార స్థానాల్లో ఉండే మహిళల ఆలోచనలు, అభిప్రాయాలకు కాకుండా వారి ఆహార్యానికి ప్రాధాన్యాన్నిస్తుంది. ప్రస్తుతం స్త్రీల ముందున్న అతి పెద్ద సమస్య విద్యాపరమైన అవకాశాల్ని పొందడంలో అసమానత. స్త్రీ వాదుల పోరాటాల ఫలితంగా ఎన్నో మార్పులు (మిగతా 49వ పేజీలో)

# భారతదేశంలో మహిళల ఆస్తి, వారసత్వ చట్టాలు

**పితృస్వామ్య సమాజంలోని చట్టాలు లింగంపై ఆధారపడి ఉంటాయి. మరియు భారతదేశంలోని మహిళలకు సంబంధించిన ఆస్తి మరియు వారసత్వ చట్టాలు సాంప్రదాయకంగా దోపిడీకి గురవుతున్నాయి. ఇది స్వాతంత్ర్యం తర్వాత మరియు మరింత ఎక్కువగా, ఇటీవలి కాలంలో విషయాలు చూడటం ప్రారంభించాయి. భారతదేశంలో యూనిఫాం సివిల్ కోడ్ లేనందున, ఆస్తి మరియు వారసత్వంపై దావాలు హక్కుదారుల విశ్వాసంపై ఆధారపడి ఉంటాయి. ఏదేమైనప్పటికీ, స్త్రీల కోసం వారసత్వ చట్టాలు, వారు ఏదైనా విశ్వాసం, సంఘం లేదా వర్గానికి చెందిన వారైనా, స్త్రీలకు పురుషులకంటే కొంచెం భిన్నమైన పద్ధతిలో అందిస్తారు.**

మహిళల కోసం హిందూ వారసత్వ చట్టాలలో ఇటీవలి సవరణలు కుమార్తెలు మరియు భార్యలకు కొంత ఉపశమనం కలిగించాయి. అయితే మహిళల కోసం ఇస్లామిక్ చట్టాలు



## చట్టాలు ఏం చెబుతున్నాయి ?

భిన్నంగా మరియు మరింత కఠినంగా ఉన్నాయి మరియు వారసత్వం లేదా ఆస్తి హక్కులకు సంబంధించినవి కానప్పటికీ, ఇటీవలి కాలంలో కొన్ని పరిమిత మార్పులను తీసుకువచ్చాయి. క్రైస్తవ చట్టాలు మరింత ఉదారమైనవి. అయితే ప్రతి విశ్వాసానికి దాని స్వంత నియమాలు ఉన్నాయి. హిందూ వారసత్వ చట్టం 2005, హిందూ వారసత్వ చట్టం 1956 మరియు హిందూ వారసత్వ సవరణ చట్టం 2005 ఉన్నాయి. ఆ తర్వాత ముస్లిం పర్సనల్ లా అప్లికేషన్ యాక్ట్ 1937 మరియు ది ఇండియన్ సక్సెషన్ యాక్ట్ 1925 ఉన్నాయి. ఇక్కడ మనం వాటిని – హిందూ చట్టం, ముస్లిం అని సూచిస్తాము. చట్టం మరియు క్రైస్తవ చట్టం. హిందువులు, జైనులు, బౌద్ధులు మరియు సిక్కులకు హిందూ చట్టం వర్తిస్తుంది.

పూర్వీకుల ఆస్తి గురించి మీరు తెలుసుకోవలసినది ఆస్తి చట్టాలు స్త్రీల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తాయో అర్థం చేసుకోవడానికి క్రింది పరిస్థితిని ఉదాహరణగా తీసుకుందాం.

- **విడాకులు తీసుకున్న స్త్రీ భరణం డిమాండ్ చేయవచ్చు. కానీ ఆమె మాజీ భర్త ఆస్తిపై వాటా వేయకూడదు. ఆస్తి భర్త పేరు మీద రిజిస్టర్ అయితే, చట్టం అతన్ని యజమానిగా గుర్తిస్తుంది. ఆస్తి ఉమ్మడిగా స్వంతం అయితే, భార్య కొనుగోలుకు తన సహకారాన్ని నిరూపించుకోవాలి.**

### ఆస్తి చట్టాలు మహిళల జీవనాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి

అనిత వివాహం చేసుకుని తన భర్తతో అతని అధికారిక క్వార్టర్‌లో నివసించడం ప్రారంభించే పరిస్థితిని పరిశీ లించండి. కొన్నేళ్ల క్రితం కట్టుకున్న ఇంట్లో ఆమె అత్తమామలు విడివిడిగా ఉంటున్నారు. పెళ్లయిన రెండేళ్ల తర్వాత, అనిత భర్త వీలునామా వదలకుండా లేదా ఆస్తిని సంపాదించకుండానే చనిపోతాడు. అనిత అధికారిక క్వార్టర్‌ను ఖాళీ చేయాలి. ఆమె తన అత్త

మామలతో ఉండాలనుకుంటోంది. కానీ, వారు ఆమెను అనుమతించడానికి నిరాకరించారు. ఆమె తన తల్లిదండ్రుల ఇంటికి వెళుతుంది. కానీ, ఆమె సోదరుడు ఆమెను వారితో ఉండటానికి అనుమతించలేదు. ఆమె తండ్రి (విల్ చేయ కుండా) మరణించినందున, అనిత సోదరుడు తన కుటుంబం తో తల్లిదండ్రుల ఆస్తిలో నివసిస్తున్నాడు. అనిత ఇప్పుడు ఎక్కడికి వెళ్ళవచ్చు ? ఆమె తన సొంతమని ఏమి క్లెయిమ్ చేయవచ్చు ? ఈ పరిస్థితికి సమాధానాన్ని కనుగొనడానికి, మహిళల కోసం ఆస్తి చట్టాలను వివరంగా తెలుసుకుందాం.

## మహిళలకు ఆస్తి మరియు వారసత్వ చట్టాలు

ప్రాచీన కాలం నుంచి మహిళలకు సంబంధించిన ఆస్తి చట్టా లు చాలా మార్పులకు లోనయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చి రూల్ బుక్స్‌ను రూపొందించిన తర్వాత కూడా, పిత్రు స్వామ్యంలోని పురుషులతో సమానంగా మహిళల హక్కులను వివిధ సవరణ లు తీసుకువచ్చాయి. ప్రస్తుతం, హిందూ విశ్వాసం ఉన్న మహి ళల వారసత్వ చట్టాలు క్రింద పేర్కొన్న విధంగా ఉన్నాయి.

## కుమార్తె యొక్క ఆస్తి హక్కులు

ఒక కుమార్తె తన తోబుట్టువుల వలె తల్లిదండ్రుల (తండ్రి మరియు తల్లి) ఆస్తిలో సమాన వాటాను వారసత్వంగా పొందు తుంది. ఆమె తన సోదరులుగా పూర్వీకుల ఆస్తిలో సహచరురా లు మరియు ఈ ఆస్తికి సంబంధించి అదే బాధ్యతలను పంచు కుంటుంది. వివాహిత కుమార్తె వితంతువు, విడాకులు తీసు కున్న లేదా విడిచిపెట్టి ఉంటే ఆమె తల్లిదండ్రుల నివాసంలో భరణం లేదా ఆశ్రయం కోసం అడగవచ్చు. ఆమె యుక్త వయస్సు చేరుకున్న తర్వాత, ఒక కుమార్తె ఆమెకు బహుమతిగా లేదా వీలునామా చేయబడిన ఏదైనా ఆస్తి లేదా ఆస్తిపై పూర్తి హక్కును కలిగి ఉంటుంది.

## భార్య యొక్క ఆస్తి హక్కులు

హిందూ వారసత్వ చట్టం ప్రకారం, వివాహిత స్త్రీకి తన వ్యక్తిగత ఆస్తిపై పూర్తి హక్కులు ఉంటాయి, ఆమె ఇష్టాను సారంగా విక్రయించవచ్చు/ బహుమతి చేయవచ్చు/ పారవేయ వచ్చు. HUF (హిందూ అవిభక్త కుటుంబం) విషయంలో ఆమె తన భర్త మరియు అతని కుటుంబం నుండి ఆశ్రయం, మద్దతు మరియు నిర్వహణకు అర్హులు. ఆమె భర్త మరియు ఆమె పిల్లల మధ్య ఆస్తి విభజన విషయంలో, ఆమె కూడా ఇతరులతో సమానంగా వాటా పొందుతుంది. మరియు ఆమె భర్త మరణిం చిన సందర్భంలో, ఆమె భర్త యొక్క ఆస్తులలో ఆమె, ఆమె పిల్లలు మరియు అతని తల్లి మధ్య సమానవాటాను పొందేందుకు అర్హులు.

## తల్లి యొక్క ఆస్తి హక్కులు

ఒక తల్లి క్లాస్ 1 వారసుడు అంటే, ఆమె మరణించిన కొడుకు ఆస్తులలో అతని భార్య మరియు పిల్లలతో సమానమైన వాటాను పొందుతుంది. తండ్రి మరణించిన తర్వాత పిల్లలు కుటుంబ ఆస్తిని విభజించినట్లయితే, ఒక తల్లి తన ప్రతి బిడ్డతో సమానంగా ఆస్తిలో వాటాను పొందేందుకు అర్హులు. ఆమె తన అర్హతగల పిల్లల నుండి ఆశ్రయం మరియు నిర్వహణకు కూడా అర్హులు. ఆమె ఆస్తులు మరియు ఆస్తులపై ఆమెకు పూర్తి హక్కులు ఉన్నాయి మరియు వాటిని తనకు నచ్చిన విధంగా పారవేయవచ్చు. అయితే, ఆమె మరణంతో, ఆమె ఆస్తులు ఆమె పిల్లలందరికీ సమానంగా సంక్రమిస్తాయి.

## సోదరి యొక్క ఆస్తి హక్కులు

ఒక సోదరి క్లాస్ 2 వారసుడు మరియు అతనికి క్లాస్ 1 వారసులు లేకుంటే మాత్రమే మరణించిన తన సోదరుడి ఆస్తిని క్లెయిమ్ చేయవచ్చు - తల్లి, భార్య మరియు పిల్లలు.

## కోడలు ఆస్తి హక్కులు

హిందూ వారసత్వ చట్టంలోని మహిళల వారసత్వ చట్టాల ప్రకారం, కోడలు హక్కులు చాలా పరిమితం. పూర్వీకులు లేదా స్వీయ - ఆర్జితమైనవి - అత్త వారి స్వంత ఆస్తులపై కోడలుకు హక్కు లేదు. ఆమె తన భర్త వారసత్వం మరియు వాటా ద్వారా మాత్రమే అటువంటి ఆస్తులపై హక్కులను పొందగలదు.

## విడాకులు తీసుకున్న మహిళల ఆస్తి హక్కులు

విడాకులు తీసుకున్న స్త్రీ భరణం మరియు భరణం డిమాండ్ చేయవచ్చు. కానీ ఆమె మాజీ భర్త ఆస్తిపై వాటా వేయకూడదు. ఆస్తి భర్త పేరు మీద రిజిస్టర్ అయితే, చట్టం అతన్ని యజ మానిగా గుర్తిస్తుంది. ఆస్తి ఉమ్మడిగా స్వంతం అయినట్లయితే, భార్య కొనుగోలుకు తన సహకారాన్ని నిరూపించుకోవాలి. అప్పుడు స్త్రీలకు సంబంధించిన ఆస్తి చట్టాల ప్రకారం, చెప్పబడిన ఆస్తిలో ఆమె కంట్రిబ్యూషన్ వరకు మాత్రమే ఆమె వాటాకు అర్హులు. అధికారిక విడాకులు లేకుండా విడిపోయిన సందర్భంలో, భార్య మరియు పిల్లలు పురుషుడు తిరిగి వివాహం చేసుకున్నా లేదా చేయకున్నా అతని ఆస్తిపై వారి వారసత్వానికి అర్హులు.

## పునర్వివాహం చేసుకున్న వితంతువు ఆస్తి హక్కులు

ఒక వితంతువు భర్త ఆస్తిలో ఇతర తరగతి 1 వారసులతో పాటు సమాన వాటాను పొందుతుంది - అతని తల్లి మరియు అతని పిల్లలు. వితంతు భార్య పునర్వివాహం చేసుకున్నట్లయితే, 1856 హిందూ వితంతు పునర్వివాహ చట్టం ప్రకారం, ఆమె మాజీ భర్త ఆస్తిపై తన దావాను వదులుకోవాలి. కానీ హిందూ

వారసత్వ చట్టం 1956లోని సెక్షన్ 24 ప్రకారం, వితంతువు అవివాహితగా ఉంటే ఆస్తి పంపిణీ గురించి చర్చించబడింది మరియు చాలా కాలం తరువాత వివాహం చేసుకుంటుంది, ఆమె ఆస్తిలో తన వాటాను కలిగి ఉంది.

**రెండవ భార్య యొక్క ఆస్తి హక్కులు**

హిందూ వివాహ చట్టం 1955 బహుభార్యత్వాన్ని చట్ట విరుద్ధంగా పరిగణిస్తుంది. మరియు ఒక వ్యక్తి ఏ సమయం లోనైనా ఒకరి కంటే ఎక్కువ చట్టపరమైన భార్యలను కలిగి ఉండకూడదు. అందువల్ల, రెండవ వివాహం యొక్క చట్టబద్ధత ఇక్కడ కీలకమైన అంశం. పురుషుడు తన భార్య మరణం తర్వాత లేదా అధికారికంగా విడాకుల తర్వాత మళ్లీ పెళ్లి చేసుకుంటే, రెండో భార్య అతని ఆస్తికి క్లాస్ 1 వారసుడు. అది కాకపోతే, రెండో భార్య మరణించిన వ్యక్తి యొక్క ఆస్తులకు అర్హులు కాదు, అయినప్పటికీ ఈ వివాహం నుండి ఆమె పిల్లలు ఉంటారు.

**క్రైస్తవ చట్టంలో ఆస్తి మరియు వారసత్వ చట్టాలు**

యూదులు మరియు పార్సీలకు కూడా వర్తించే క్రైస్తవ చట్టానికి సంబంధించి వివిధ సంబంధాల వర్గాల మహిళలకు వారసత్వ చట్టాలను పరిశీలిద్దాం.

**కుమార్తె యొక్క ఆస్తి హక్కులు**

ఒక కుమార్తె తన తోబుట్టువులతోపాటు తల్లిదండ్రుల ఆస్తులను సమానంగా వారసత్వంగా పొందుతుంది. ఆమె పెళ్లి అయ్యేంత వరకు ఆమె తల్లిదండ్రుల నుండి ఆశ్రయం మరియు నిర్వహణను పొందుతుంది. ఆ తరువాత, ఆమె తన భర్త సంరక్షణలో ఉంది. ఆమె మైనర్‌గా ఉన్నంత కాలం ఆమె తండ్రి ఆమెకు సహజ సంరక్షకుడిగా ఉంటాడు. చట్టబద్ధంగా పెద్దయ్యాక, ఆమెకు తన వ్యక్తిగత ఆస్తిపై పూర్తి హక్కు ఉంటుంది.

**భార్య యొక్క ఆస్తి హక్కులు**


భార్యగా, ఒక స్త్రీ తన భర్త నుండి భరణం పొందేందుకు అర్హులు. అతను దానిని అందించడంలో విఫలమైతే, ఆమె ఈ కారణంగా విడాకుల కోసం దాఖలు చేయవచ్చు. క్రైస్తవ విశ్వాసం ఉన్న స్త్రీల వారసత్వ చట్టాల ప్రకారం, ఒక వితంతువు తన భర్త ఆస్తిలో మూడింట ఒక వంతుకు అర్హులు, మిగిలినది మరణించిన వారి పిల్లలకు సమానంగా పంచబడుతుంది. పిల్లలు లేకుంటే ఆమెకు సగం ఆస్తి వస్తుంది. మరణించిన భర్త నుండి భార్య తప్పనిసరిగా పొందవలసిన కనీస మొత్తం INR 5000గా గుర్తించబడింది.

**తల్లి యొక్క ఆస్తి హక్కులు**

క్రైస్తవ విశ్వాసం ఉన్న స్త్రీలకు సంబంధించిన ఆస్తి చట్టాలు తల్లిని పిల్లలపై ఆధారపడిన వ్యక్తిగా పరిగణించవు. ఒక తల్లిగా, ఒక మహిళ భరణానికి అర్హత లేదు. కానీ మరణించిన పిల్లవాడు అవివాహితుడు మరియు పిల్లలు లేకుంటే, తల్లి ఆస్తిలో నాలుగింట ఒక వంతుకు అర్హులు. స్త్రీలు విడాకులు తీసుకున్నవారు, పునర్వివాహం చేసుకున్న వితంతువులు మరియు రెండవ భార్య అయితే వారికి సంబంధించిన వారసత్వ చట్టాలు హిందూ చట్టాలలో ఉన్నట్లే ఉంటాయి.

**ఇస్లామిక్ చట్టం కింద మహిళల ఆస్తి వారసత్వ చట్టాలు**

ఈ చట్టం షరియా నియమాన్ని అనుసరిస్తుంది మరియు ఇతర విశ్వాసాల కంటే భిన్నమైన నిర్దేశాలను కలిగి ఉంది.



### కుమార్తె యొక్క ఆస్తి హక్కులు

విశ్వాసం ప్రకారం, స్త్రీ విలువ పురుషుడి కంటే సగం. ఇక్కడ మహిళలకు వారసత్వ చట్టాలు కొడుకులు పొందుతున్న దానిలో సగం కుమార్తెలకు ఇస్తాయి. కానీ స్త్రీకి తన ఆస్తిపై పూర్తి నియంత్రణ ఉంటుంది మరియు ఆమె కోరిక మేరకు దానిని పారవేయవచ్చు లేదా నిర్వహించవచ్చు/అమ్మవచ్చు/బహుమతి చేయవచ్చు. కుమార్తెలకు వివాహం జరిగే వరకు మరియు వితంతువు/విడాకుల తర్వాత తల్లిదండ్రుల ఆస్తిలో నివాసం ఉండే హక్కు ఆమెకు/మైనర్ పిల్లలు లేకుంటే. పిల్లలు తమ తల్లిని చూసుకునేంత పెద్దయ్యాక, ఆమె పిల్లల బాధ్యత అవుతుంది.

### భార్య యొక్క ఆస్తి హక్కులు

షరియాలోని మహిళలకు సంబంధించిన ఆస్తి చట్టాల ప్రకారం, వివాహిత స్త్రీ తన సొంత ఆస్తులు మరియు ఇతర విషయాలపై పూర్తి యాజమాన్యాన్ని పొందుతుంది. ఆమె తన భర్త నుండి భరణానికి, విడాకుల తర్వాత అవసరమైన సహేతుకమైన నిబంధనలకు మరియు వివాహ సమయంలో నిర్ణయించిన 'మెహర్' మొత్తానికి హక్కును కలిగి ఉంటుంది. భర్త చనిపోతే మరియు ఆమె మాత్రమే భార్య అయినట్లయితే, పిల్లలు లేకుంటే అతని ఆస్తులలో నాలుగో వంతు ఆమెకు వారసత్వంగా వస్తుందిబీ మరియు వివాహంలో పిల్లలు ఉంటే ఎనిమిదవ వంతు. మరణించిన భర్తకు ఒకటి కంటే ఎక్కువ మంది భార్యలు ఉన్నట్లయితే, ప్రతి భార్య యొక్క వారసత్వం మరింత తగ్గుతుంది – పదహారవ వంతు అని చెప్పండి. ఇతర భాగస్వాములు లేని పక్షంలో, భర్త యొక్క వీలునామా కొంత వరకు భార్య యొక్క వారసత్వాన్ని పెంచుతుంది.

### తల్లి యొక్క ఆస్తి హక్కులు

ఒక వితంతువు లేదా విడాకులు తీసుకున్న తల్లి తన పిల్లల నుండి పోషణకు మరియు మరణించిన తన బిడ్డ ఆస్తిలో ఆరవ వంతు వారసత్వానికి అర్హులు. ఆమె సొంత ఆస్తి ముస్లిం చట్టం మార్గదర్శకాల ప్రకారం విభజించబడింది. మహిళలకు సంబంధించిన ముస్లిం వారసత్వ చట్టాల ప్రకారం విడాకులు తీసుకున్న ఆమె 'మెహర్' మొత్తాన్ని పొందుతుంది మరియు ఆమె భర్త అతని కుటుంబానికి చెందినది కాదు. ఆమె మరణించిన మాజీ భర్త నుండి ఆస్తి గ్రహీత కాదు. చనిపోయిన భర్త నుండి ఎలాంటి ఆస్తి హక్కులు పొందలేని పునర్వివాహం చేసుకున్న వితంతువు విషయంలో కూడా ఇదే పరిస్థితి. ముస్లిం చట్టాల ప్రకారం రెండవ భార్య చట్టబద్ధమైన భార్య మరియు మొదటి లేదా మూడవ భార్యకు సమానమైన హక్కులను కలిగి ఉంటుంది.

### మహిళల కోసం ఆస్తి చట్టాలపై తుది పదం

ఇప్పుడు మనం అనిత నిర్వహణ మరియు వారసత్వం యొక్క ప్రారంభ సమస్యకు సమాధానమివ్వడానికి ప్రయత్నిద్దాం. అనితకు తన అత్తమామల ఆస్తిపై హక్కు లేదు మరియు వారు ఆశ్రయం ఇవ్వడానికి నిరాకరిస్తే, అనిత నిర్ణయాన్ని అంగీకరించాలి. కానీ అనిత తన తండ్రి ఆస్తి నుండి వారసత్వంగా పొందటానికి అర్హులు. వీలునామా రాయకుండానే ఆమె తండ్రి మరణించినందున ఆస్తిని అనితకు, ఆమె సోదరుడికి, తల్లికి సమానంగా పంచాలి. ఈ విధంగా అనిత తన తండ్రి ఆస్తులలో కొంత భాగాన్ని పొందవచ్చు మరియు తల్లిదండ్రుల ఇంటిలో ఆశ్రయం పొందవచ్చు. అలాగే, ఆమె మరణించిన భర్త ఆర్థిక వ్యవహారాలు, బీమాలు మరియు అధికారిక క్లెయిమ్‌లను పరిశీలించి, అతను ఆమెను నామినీగా పేర్కొన్నాడో లేదో చూడవచ్చు. ఆమెకు ఆర్థిక సహాయం అవసరమైన సమయంలో ఇది ఒక ఆశీర్వాదంగా వస్తుంది. మహిళల కోసం ఆస్తి చట్టాలలో సవరణలు మరియు వివిధ తీర్పులలో మార్పులు మహిళలకు చట్టపరమైన హక్కుల యొక్క కొన్ని జాడలను తీసుకువచ్చాయి. మహిళలకు సంబంధించిన వారసత్వ చట్టాల ప్రకారం మీ చట్టపరమైన హక్కులను మీరు తెలుసుకోవడం చాలా ముఖ్యం, తద్వారా మీ ఆస్తులను ఎవరూ లాక్కోలేరు. ❑

---

## నేటి ప్రపంచంలో మహిళల స్థితిగతులు

(45వ పేజీ తరువాయి) జరిగినప్పటికి పురుషులతో సమానంగా స్త్రీలు చదువుకునే అవకాశాలు పొందడానికి అర్హులు కారనే భావన చాలా సమాజాల్ని వీడలేదు.

### అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2023 నినాదం:

డిజిట్ ఆల్–జెండర్ సమానతకు ఆవిష్కరణలు, సాంకేతికత. స్త్రీలను, సమాజపు అంచుల్లోకి నెట్టివేయబడిన ఇతర గ్రూపులను టెక్నాలజీ పరిధిలోకి తేవడం వల్ల అనేక సృజనాత్మక పరిష్కారాలు లభిస్తాయని, జెండర్ సమానతను ప్రోద్బలపరచే, స్త్రీల అవసరాలను తీర్చే ఆవిష్కరణలు సాధ్యమవుతాయని, వారిని టెక్నాలజీ పరిధిలోకి తేకపోతే అయా సమాజాలు భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని ప్రకటించారు. గత దశాబ్దంలో వారిని టెక్నాలజీ పరిధిలోకి తేని నిమ్న ఆదాయ, మధ్య ఆదాయ దేశాల స్థూల ఉత్పత్తిలో 1.5 ట్రిలియన్ డాలర్ల నష్టం జరిగిందని అంచనా. ఈ ధోరణిని తగ్గించడానికి అనేక సమస్యల్ని పరిష్కరించాలి. అందులో ముఖ్యమైనది దాదాపుగా 35 శాతం మంది స్త్రీలు అనుభవించిన ఆన్లైన్ హింస. జెండర్ స్పందనతో అందించే డిజిటల్ విద్య సమాజప్రగతికి ఇతోధికంగా తోడ్పడడమేకాక జెండర్ సమానతకు దారితీస్తుంది, ఐక్యరాజ్యసమితి 2030కి నిర్దేశించుకున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి దోహదం చేస్తుంది. ❑



ఇందిర గారు (ఇల్లెందు, ఖమ్మం జిల్లా) ఈ రోజు (19.02.2023) లోకాన్ని విడిచి వెళ్ళారు. వారికి ఆత్మీయ శ్రద్ధాంజలి.😢🙏🙏

# తన మరణం గురించి బైరి ఇందిర గారు రాసుకున్న కవిత్వం..

## నేను పోయినప్పుడు...!!

నేను పోయినప్పుడు
ఓ కాగితాన్ని కప్పండి
రాసుకోడానికి పనికొస్తుంది

మట్టిలో కప్పెట్టకండి
మరీ గాలాడదు
పురుగూ పుట్రా ఉంటాయ్

పెన్సిలు, రబ్బరు, కర్చీఫ్
బ్యాగులో ఉండేలా చూడండి
సెల్ మర్చిపొయ్యేరు
బోర్ కొట్టి చస్తాను

దండలు గిండలు వెయ్యకండి
నాకు ఎలర్జీ

పసుపు గట్రా పూసి
భయంకరంగా మార్చకండి
పిల్లలు ఝడుసుకుంటారు
పైగా నన్ను గుర్తుపట్టాలి కదా

పుణ్యస్త్రీ, పాపపు స్త్రీ అని
పేర్లు పెట్టకండి
నాకు చిర్రెత్తుకొస్తుంది

నా సామాన్లన్నీ పడేయకండి
అడిగినవాళ్లకు ఇచ్చేయండి

మంగళవారమైనాసరే,
పాడెకు కోడిపిల్లను కట్టి హింసించకండి
ఇప్పుడైనా నా మాట నెగ్గనియ్యండి

డ్యాన్సులాడి లేట్ చెయ్యకండి
ఏదైనా టైం ప్రకారం జరగాలి

కాస్త చూసి తగలబెట్టండి
పక్కన మొక్కలుంటాయేమో

బడికి ఇన్ఫామ్ చెయ్యండి
వాళ్లు సెలవిచ్చుకుంటారు

దేనికీ ఇబ్బంది పడకండి
గొల్లవాళ్ల కొట్లో ఖాతా ఉంది

పిట్టకు పెట్టేదున్నా లేకున్నా
అన్ని రోజులూ అందరు
ఇక్కడే ఉండండి
మళ్లీ మళ్లీ చస్తానా ఏంటి


పనిలో పని
కాష్టం దగ్గర
కవిసమ్మేళనం పెట్టండి
నేనూ ఉ(వి)న్నట్టుంటుంది

✍ Indira Bhyri




నిజం చెప్పాలి

ప్చ్.. ఎంత కొట్టినా..!







మొదలెట్టాశారు

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)
Vol : 1 - Issue No : 6 March 2023




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.